




GST NO: 36ACPPF9587L2ZM TELTEL/2013/53323

# సమయజ్యోతి

ప్రతీ అక్షరం - ప్రజలకోసం

తెలుగు దిన పత్రిక

CELEBRATING 12TH YEAR ANNIVERSARY

సంపుటి : 12 సంచిక : 94 పేజీలు : 12 ఆదిలాబాద్ వెల రూ : 01 ఆదివారం 15 జూన్ 2025 ఎడిటర్ : ఫైసల్ ఖాన్








## భవిష్యత్‌లో ప్రమాదాలు జరక్కుండా


# లోతుగా అధ్యయనం

- విమాన ప్రమాద ఘటనపై ఐదుగురితో కమిటీ
- వివిధ రంగాల నిపుణులతో ఉన్నతస్థాయి దర్యాప్తు
- బ్లాక్‌బాక్స్ విశ్లేషించాక అసలు విషయాలు గుర్తింపు
- కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు

**న్యూఢిల్లీ,జూన్14(సమయజ్యోతి):**

అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన దుర్ఘటనను పౌర విమానయాన శాఖ అత్యంత తీవ్రంగా పరిగణిస్తోందని కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. విమానయాన భద్రతపై శనివారం ఆయన ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం దిల్లీలో మీడియాతో మాట్లాడారు. ప్రమాదం జరిగిన వెంటనే ఘటనాస్థలిలో సహాయచర్యలు చేపట్టినట్లు తెలిపారు. గుజరాత్ ప్రభుత్వం, పౌరవిమానయాన శాఖ సంయుక్తంగా స్పందించినట్లు పేర్కొన్నారు. ఘటన జరిగిన వెంటనే మంటలార్పి.. మృతదేహాలను అక్కడి నుంచి తరలించాం.





## లక్కీ నంబరే

# కొంపముంచిందా?

## రెండుసార్లు టిక్కెట్ క్యాన్సిల్ చేసుకున్న రూపాని

**అహ్మదాబాద్,జూన్14(సమయజ్యోతి):**

అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిరిండియా విమాన ప్రమాదంలో మరణించిన గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపాణీ ప్రయాణానికి సంబంధించి మరో విషయం వెలుగులోకి వచ్చింది. లండన్‌లో ఉన్న తన భార్య, కుమార్తెను కలిసేందుకు వెళ్తున్న రూపాణీ.. అంతకుముందు రెండుసార్లు వెళ్లేందుకు సిద్ధమై టికెట్ రద్దు చేసుకున్నట్లు తెలిసింది. చివరకు మూడోసారి బయలుదేరినప్పటికీ గమ్యాన్ని చేరకముందే విమాన ప్రమాదంలో ఆయన ప్రాణాలు కోల్పోయారు. అంతేకాదు ఆయన లక్కీ నంబర్‌గా భావించే '1206' సంఖ్య కలిగిన తేదీనే ఆయనకు చివరి ప్రయాణం అయ్యింది. రూపాణీ వ్యక్తిగత వాహనాలన్నీ అదే నంబరుతో ఉన్నట్లు సమాచారం. అయితే ఆ లక్కీ నెంబరే గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపానీ ప్రాణం తీసిందనే ఓ చర్చ అయితే ప్రస్తుతం వైరల్ అవుతోంది. విజయ్ రూపానీ లక్కీ నెంబర్ 1206.



# మధ్యప్రదేశ్ ఎన్‌కౌంటర్ నలుగురు మావోల మృతి

**భోపాల్,జూన్14(సమయజ్యోతి):**

మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్ జిల్లాలో శనివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. వీరిలో ముగ్గురు మహిళలు ఉన్నారని పోలీస్ ఉన్నతాధికారులు వెల్లడించారు. బాలాఘాట్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారంటూ నిఘా వర్గాల నుంచి పోలీసులు, భద్రతా దళాలకు సమాచారం అందింది. దీంతో ఆ అటవీ ప్రాంతంలో వారు సంయుక్తంగా కూంబింగ్ నిర్వహించారు. ఆ క్రమంలో భద్రతా బలగాలను మావోయిస్టులు గమనించడంతో.. వారిపైకి కాల్పులకు తెగబడ్డారు. దీంతో భద్రతా బలగాలు వెంటనే ఎదురు కాల్పులు జరిపాయి. మరోవైపు ఛత్తీస్‌గఢ్‌లోని అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు నిరంతరాయంగా కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. ఆ క్రమంలో భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో వందల మంది మావోయిస్టులు మృతి చెందారు. వారిలో అగ్రనేతలు సైతం ఉన్నారు. అయితే ఈ కూబింగ్‌ను తట్టు-కోలేక కొందరు మావోయిస్టులు సరిహద్దు రాష్ట్రమైన మధ్యప్రదేశ్‌లోని పలు జిల్లాలోకి మావోయిస్టులు ప్రవేశించారంటూ నిఘా వర్గాల వద్ద స్పష్టమైన సమాచారం ఉన్నట్లు- తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆ యా జిల్లాల్లో భద్రతా బలగాలు కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. ఇంకోవైపు 2026, మార్చి మాసాంతానికి దేశంలో మావోయిస్టులను నిర్మూలిస్తామని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా స్పష్టమైన ప్రకటన చేశారు. ఈ నేపథ్యంలో వారి నిర్మూలన కోసం కేంద్రం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. అయితే తాము చర్చలకు సిద్ధమని ఈ నేపథ్యంలో ఆపరేషన్ కగార్ ఆపాలంటూ మావోయిస్టులు చేసిన విన్నపాన్ని అటు- కేంద్ర ప్రభుత్వం కానీ ఇటు- ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కానీ పరిగణలోకి తీసుకోకపోవడం గమనార్హం.

## జి-7 సదస్సులో పాల్గొననున్న ప్రధాని మోడీ

### నేటినుంచి మూడ్రోజుల పాటు విదేశీ పర్యటన

**న్యూఢిల్లీ,జూన్14(సమయజ్యోతి):**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం నాడు మూడు దేశాల పర్యటనకు వెళ్తున్నారు. ఈనెల 15-16 తేదీల్లో సైప్రస్ లో పర్యటిస్తారు. 16-17 తేదీల్లో కెనడాలోని జీ-7 సదస్సులో పాల్గొంటారు. 18న క్రొయేషియా లో పర్యటిస్తారు. కేంద్ర విదేశాంగ శాఖ శనివారంనాడు ఈ వివరాలను వెల్లడించింది. ఎంఈఏ వివరాల ప్రకారం, సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్ ఆహ్వానం మేరకు ప్రధానమంత్రి మోదీ ఈనెల 15-16 తేదీల్లో ఆ దేశంలో అధికారిక పర్యటన జరుపుతారు.

02

## బిఆర్‌ఎస్ అధికారంలోకి రావాలంటే రేవంత్ సిఎంగా

# ఉంటేనే మేలు




**హైదరాబాద్,జూన్14(సమయజ్యోతి):**

తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో ఒక ఉద్యోగి అని బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కవిత తెలిపారు. రేవంత్ రెడ్డి ముందు ఆయన ఉద్యోగాన్ని కాపాడుకోవాలని అన్నారు. ఆమె మీడియాతో చిట్ చాట్ సందర్భంగా, రేవంత్ రెడ్డికి పార్టీ అధినేతల అపాయింట్ మెంట్ దొరకట్లేదని తెలియజేశారు. బిఆర్ఎస్ మళ్లీ గెలవాలంటే రేవంత్ రెడ్డి సిఎంగా కొనసాగాలని చెప్పారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం జాగృతి తరపున పోరాటం చేశామని, ఈ నెల 17న మెదక్ లో బిసి రిజర్వేషన్లపై సమావేశం నిర్వహిస్తామని అన్నారు. ధర్నాలు, రైల్ రోకోలు, అవసరమైతే బంద్ కు పిలుపు ఇస్తామని, ఎవరూ కోర్టుకు వెళ్లే అవకాశం లేదని సూచించారు. నరేంద్రమోడీని కలిసిన సిఎం రేవంత్ రెడ్డి బిసి బిల్లు గురించి కనీసం అడగలేదని, బిజెపికి కూడా బిసిలపై చిత్తశుద్ధి లేదని విమర్శించారు. తెలంగాణ అస్తిత్వం దెబ్బతీసేలా పాఠ్యపుస్తకాలు మారుస్తున్నారని, కుమురంభీమ్ చిత్రపటం తొలగించి సైబర్ టవర్స్ ఫొటో ముద్రించారని కవిత మండిపడ్డారు.

## కృష్ణాజలాల వాటాను కేవలం

# 299 టిఎంసిలకే పరిమితం



02

- జగన్‌తో మిలాఖత్ అయి కృష్ణా జలాల దోపిడీ
- బనకచర్లపై మేము అప్రమత్తంగానే ఉన్నాం
- పదేళ్లలో దోచిపెట్టిన ఘనులు బిఆర్ఎస్ పాలకులు
- హరీష్ వ్యాఖ్యలపై మండిపడ్డ మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్,జూన్14(సమయజ్యోతి):**

నదీ జలాల హక్కులపై తెలంగాణకు నష్టం చేసింది ఆర్ఎస్ పార్టీనే అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. కృష్ణానది వాటాను కేవలం 299 టిఎంసిలకే పరిమితం చేశారని.. బిఆర్ఎస్ హయాంలోనే ముచ్చుమర్రి, మాల్యాల నుంచి నీటిని తరలించారని అన్నారు. రాయలసీమ ఎత్తిపోతలపై అపెక్స్ కౌన్సిల్‌ను మీరెందుకు సంప్రదించలేదని ప్రశ్నించారు. ఎపి రోజూ 3 టిఎంసిలు మళ్లిస్తుంటే కెసిఆర్ చోద్యం చూశారని.. జగన్, కెసిఆర్ మధ్య అవగాహనతోనే తెలంగాణ నీటిని ఎపికి దోచిపెట్టారని పేర్కొన్నారు.

## రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అవార్డులు అందుకున్న అల్లు అర్జున్, విజయ్ దేవరకొండ

- హైదరాబాద్ హైటెక్స్‌లో వైభవంగా తెలంగాణ గద్దర్ అవార్డుల ప్రదానోత్సవం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి చేతుల మీదుగా అవార్డుల అందజేత
- 'పుష్ప-2' చిత్రానికి ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్‌కు పురస్కారం
- ఉత్తమ నటిగా నివేదా థామస్, ఉత్తమ దర్శకుడిగా నాగ్ అశ్విన్ (కల్కి)
- ఉత్తమ హిస్టారికల్ ఫిల్మ్‌గా 'రజాకార్', ఉత్తమ తొలి చిత్రంగా 'కమిటీ కుర్రోళ్లు'

**హైదరాబాద్‌లోని హైటెక్స్ వేదికగా తెలంగాణ గద్దర్ అవార్డుల ప్రదానోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హాజరై, చలనచిత్ర రంగంలో విశేష ప్రతిభ కనబరిచిన పలువురు కళాకారులు, సాంకేతిక నిపుణులకు పురస్కారాలు అందజేశారు.**

02



## కత్తి పట్టుకోమన్న కార్యకర్తపై

# కమల్ హాసన్ ఫైర్...

- చెన్నైలో మక్కల్ నీది మయ్యం పార్టీ సమావేశంలో ఘటన
- కమల్ హాసన్‌కు వేదికపై కత్తిని బహూకరించిన కార్యకర్తలు
- ఒక కార్యకర్త కత్తిని బలవంతంగా చేతికివ్వబోగా కమల్ తీవ్ర అసహనం
- దీంతో స్టేజ్‌పై కాసేపు గందరగోళం, తోపులాట
- పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దారు



02

మొదటి పేజీ తరువాయి

### భవిష్యత్‌లో ప్రమాదాలు జరక్కుండా

# లోతుగా అధ్యయనం

దుర్ఘటనపై విచారణకు తక్షణమే ఐదుగురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేశాం. అవసరమైతే మరికొంత మంది సభ్యులనూ బృందంలో చేరుస్తాం. శుక్రవారం సాయంత్రం ఘటనాస్థలిలో బ్లాక్స్‌బాక్స్ దొరికింది. దానిని విశ్లేషించిన తర్వాత ఏం జరిగిందనేది పూర్తిగా తెలుస్తుందని అన్నారు. అందులో ఏముందో తెలుసుకునేందుకు మేమూ ఆతృతగా ఎదురుచూస్తున్నాం. దుర్ఘటనలో మరణించిన వారి కుటుంబాల బాధను అర్థం చేసుకోగలను. నా తండ్రి కూడా ప్రమాదంలోనే మరణించారు. ఆ బాధ నాక్కూడా తెలుసు. హోంశాఖ సెక్రెటరీ ఆధ్వర్యంలో మరో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశాం. ప్రత్యేక అధికారులతో, వివిధ రంగాలకు చెందిన నిపుణులతో ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేశాం. సంపూర్ణ దర్యాప్తు జరిపేందుకు ఈ కమిటీ సభ్యులు దోహదపడతారు. నిపుణుల విచారణ పూర్తయ్యాక తగిన సమయంలో మీడియాకు సమాచారమిస్తాం. రెండు నెలల్లోగా విచారణ పూర్తవుతుందని భావిస్తున్నాం. అంతేకాకుండా బోయింగ్ 787 సిరీస్‌ను తరచూ తనిఖీలు చేయాలని ఆదేశించాం అని రామ్మోహన్ నాయుడు మీడియాకు తెలిపారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ.. విమాన ప్రమాదంలో చనిపోయిన కుటుంబాలకు సంతాపం వ్యక్తం చేశారు. గడిచిన రెండు రోజులు భారంగా గడిచిందని.. ప్రమాదంలో ఎవరైనా చనిపోతే ఆ కుటు-ంబం అనుభవించే బాధ తనకు ప్రత్యేకంగా తెలుసన్నారు. విమాన ప్రమాదం జరిగిన వెంటనే నేను సంఘటనా స్థలానికి చేరుకుని చర్యలు చేపట్టాం. ప్రమాదం స్థలాన్ని పరిశీలించాను. గుజరాత్ ప్రభుత్వం సహాయక చర్యలు చేపట్టింది. పౌర విమానయాన శాఖ ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుందన్నారు. ఈ ఘటనపై ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మెడికల్, ఫోరెన్సిక్, టీమ్‌లతో పాటు ఐదుగురితో ఏఐబీ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. బ్లాక్ బాక్స్‌ను ఇప్పటికే స్వాధీనం చేసుకున్నామని... అందులో ఉన్న సమాచారం కీలకంగా మారనుందని తెలిపారు. బ్లాక్ బాక్స్‌లో ఉన్న సమాచారం రానున్న రోజుల్లో కీలకమని చెప్పుకొచ్చారు. కేంద్ర హోంశాఖ కార్యదర్శి చైర్మన్ నేతృత్వంలో కమిటీ- వేసినట్లు- తెలిపారు. హోంశాఖ కార్యదర్శి, సివిల్ ఏవియేషన్ సెక్రటరీ, గుజరాత్ అధికారులు, పోలీసు కమిషనర్ అహ్మదాబాద్, స్పెషల్ డైరెక్టర్ ఐబీని ఈ కమిటీలో నియమించినట్లు చెప్పారు. విమానాశ్రయం నుంచి 2 కి.మీ దూరం వెళ్లిన తర్వాత.. 650 అడుగుల ఎత్తులో ఉన్నప్పుడే విమానం కూలిపోయినట్లు- పౌరవిమానయాన శాఖ కార్యదర్శి తెలిపారు. అహ్మదాబాద్ ఏటీసీకి పైలట్ మేడే కాల్ ఇచ్చారు. విమాన సిబ్బందిని ఏటీసీ సంప్రదించినా స్పందన రాలేదు. ప్రమాదం జరిగిన వెంటనే సహాయబృందాలు ఘటనాస్థలికి చేరాయి. రెండు గంటల్లో ఉన్నతాధికారుల బృందమంతా ఘటనాస్థలికి చేరుకుంది. గుజరాత్ ప్రభుత్వం తక్షణమే స్పందించి క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించింది.సాయంత్రం 6 గంటలయ్యేసరికి అగ్నిమాపక శాఖ మంటలార్పేసింది. ఎస్వోపీ ప్రకారం.. తక్షణమే విచారణకు ఆదేశాలు ఇచ్చాం అని ఆయన వివరించారు. అహ్మదాబాద్‌లో ఈనెల 12న జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాద ఘటన యవత్ దేశాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ ప్రమాదంలో మొత్తం 241 మంది ప్రాణాలు కోల్పోగా.. ఒక్కరు మాత్రం మృత్యుంజయుడిగా నిలిచాడు.

మొదటి పేజీ తరువాయి

## జి-7 సదస్సులో పాల్గొననున్న ప్రధాని మోడీ

రెండు దశాబ్దాలుగా ఆ దేశంలో భారత ప్రధాని పర్యటించడం ఇదే ప్రథమం. అధ్యక్షుడు క్రిస్టోడౌలిడెస్‌తో చర్చల అనంతరం లిమాసోల్‌లో వ్యాపార దిగ్గజాలను ఉద్దేశించి మోదీ ప్రసంగిస్తారు. రెండు దేశాల మధ్య దౌపాక్షిక సంబంధాల పటిష్టతకు మోదీ పర్యటన దోహదం కానుంది. అనంతరం కెనడాకు మోదీ బయలుదేరి వెళ్తారు. కెనడా ప్రధాని మార్క్ కార్నే ఆహ్వానం మేరకు జూన్ 16-17 తేదీల్లో జరిగే జీ-7 సదస్సులో మోదీ పాల్గొంటారు. జీ-7 సదస్సులో మోదీ పాల్గొనడం వరుసగా ఇది ఆరోసారి. సదస్సు సందర్భంగా పలు దైపాక్షిక సమావేశాల్లోనూ ప్రధాని పాల్గొంటారు. ప్రధాని తన పర్యటన చివర్లో క్రొయేషియాలో పర్యటిస్తారు. క్రొయేషియా ప్రధాని ఆండ్రెజ్ ప్లెంకోవిక్ ఆహ్వానం మేరకు జూన్ 18న ఆ దేశంలో అధికారిక పర్యటన జరుపుతారు. క్రొయేషియాలో భారతదేశ ప్రధానమంత్రి ఒకరు పర్యటించనుండటం ఇదే మొదటిసారి. ద్వైపాక్షిక సంబంధాల్లో ప్రధాని పర్యటన ఒక మైలురాయి కానుంది. ప్రధాని ప్లెంకోవిక్, అధ్యక్షుడు జోరన్ మిలనోవిక్‌తో మోదీ సమావేశమవుతారు. యూరోపియన్ యూనియన్ భాగస్వాములతో మరింత పటిష్ట బంధాల గురించి చర్చిస్తారు.

మొదటి పేజీ తరువాయి

## లక్కీ నంబరే కొంపముంచిందా?

ఆయన ముఖ్యమంత్రిగా ఉండగా.. ఈ నెంబరే తన అధికారిక వాహనానికి పెట్టుకున్నారు. అలాగే ఆయన సొంత వాహనాలు.. కారు, స్కూటర్‌లకు సైతం ఇదే నెంబర్ వచ్చేలా ఆయన చూసుకున్నారు. అయితే ఆయన.. తన లండన్ ప్రయాణాన్ని సైతం లక్కీ నెంబర్ వచ్చేలా చూసుకున్నారు. కానీ తాను ఒకటి తలిస్తే దైవం ఒకటి తలిచినట్లుగా.. ఆ రోజు ప్రయాణమే ఆయనకు చివరి ప్రయాణం కావడం గమనార్హం.ఈ లక్కీ నెంబర్ రోజు తన ప్రయాణాన్ని ఆయన వరుసగా రెండు సార్లు టికెట్ బుక్ చేసుకుని మరీ రద్దు చేసుకున్నారు. మాజీ సీఎం విజయ్ రూపానీ కుమార్తె లండన్‌లో ఉన్నత విద్యను అభ్యసిస్తోంది. ఈ నేపథ్యంలో విజయ్ రూపానీ భార్య ఇప్పటికే లండన్‌లో కుమార్తె వద్ద ఉన్నారు. దీంతో కుమార్తె వద్ద కొన్ని రోజులు ఉండి.. తిరుగు ప్రయాణంలో భార్యను తన తీసుకు రావాలని మాజీ సీఎం విజయ్ రూపానీ భావించారు. అందులో భాగంగా తొలుత లండన్ వెళ్లేందుకు మే 19వ తేదీన ఆయన విమాన టికెట్ బుక్ చేసుకున్నారు. ఆ తర్వాత దీనిని రద్దు చేసుకున్నారు. అనంతరం జూన్ 5వ తేదీన లండన్ వెళ్లాలని ఆయన భావించారు. కానీ ఆ టికెట్‌ను సైతం ఆయన రద్దు చేసుకున్నారు. చివరగా తన లక్కీ నెంబర్ కలిసేలా జూన్ 12వ తేదీన ఆయన లండన్ వెళ్లాలని నిర్ణయించుకున్నారు. దీంతో ఎయిర్ ఇండియా విమానంలో 12డీ నెంబర్ సీటును ఆయన ప్రత్యేకంగా బుక్ చేసుకున్నారు. ఆ క్రమంలో ఈ ప్రయాణంలో తన లక్కీ నెంబర్‌గా భావించిన రోజే ఆయన మరణించారు.జూన్ 12వ తేదీ 1.38 గంటలకు గుజరాత్‌లోని అహ్మదాబాద్ నుంచి లండన్ బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానం కొన్ని నిమాషాలకే కుప్ప కూలి మంటల్లో దగ్ధమైంది. అందులో రూపానీ కూడా ఉన్నారు.

# లోక్ అదాలత్ ల ద్వారా కేసుల సత్వర పరిష్కారం

### - జిల్లా జడ్జి శివకుమార్

**కరీంనగర్ లీగల్ సమయజ్యోతి**

జాతీయ,రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాలానుసారం ఈ లోక్ అదాలతులను నిర్వహిస్తున్నట్లు, వీటి ద్వారా కేసుల సత్వర పరిష్కారం జరుగుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్, జిల్లా జడ్జి ఎస్ శివకుమార్ తెలిపారు.జిల్లా కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోకదాలత్ ప్రారంభ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. రాజీ ఏ రాజమార్గంగా ఈ లోకదాలతులను ఏర్పాటు చేయడం జరిగిందని, దీని ద్వారా ఇరుపార్టీల వారు రాజీ అయి వారిపై కేసులు తొలగించుకోవచ్చని తెలిపారు. లోకదా లతులలో కేసులు పరిష్కరించుకుంటే వాటికి అప్పీలు ఉండదని, కోర్టుల్లో కేసుల సంఖ్య పేరుకుపోయి ఉందని కేసుల పెండెన్సీ తగ్గించేందుకు లోకదాలతులే సరి అయిన మార్గమని తెలిపారు. ఈ లోకదాలత్ లను క క్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని, దీనిలో ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కరించుకొని రాష్ట్రంలో జిల్లాకు గుర్తింపు తీసుకురావాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. అడిషనల్ డీసీపీ వెంకటరమణ మాట్లాడుతూ రాజీ ద్వారా కేసుల సత్వర పరిష్కారానికి లోకదాలత్ లు సరైన మార్గం అని, క్రిమినల్ కేసుల పరిష్కారానికి తమ పోలీస్ సిబ్బంది పూర్తి సహకారం అందించనున్నట్లు ఆయన తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు లింగంపల్లి నాగరాజు మాట్లాడుతూ లోకదాలత్ లపై ప్రజల్లో అవగాహన పెరిగిందని, వీటిలో కేసుల పరిష్కారాల సంఖ్య చూస్తే తెలుస్తుందని, రాజీ ద్వారా సత్వర న్యాయం పొందేందుకు లోకదాలత్ లే ఏకైక మార్గం అని తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ లోకదాలత్ లలో ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కరించుకునేందుకు అందరి సహకారం లభిస్తున్నదని తెలుపుతూ లోకదాలత్ ల గూర్చి అయన వివరించారు. అనంతరం జాతీయ లోకదాలత్ ను ప్రారంభిస్తూ జిల్లా జడ్జి మోటారు ప్రమాద సంఘటన కేసు లోకదాలత్ లో పరిష్కారం కాగా ఆ మరణించిన వ్యక్తి కుటుంబానికి కోటి రూపాయల పరిహారం చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు,పోలీస్ అధికారులు,ఇన్సూరెన్స్, బ్యాంక్, ఆర్టీసీ ప్రతినిధులు, న్యాయవాదులు, కక్ష దారులు పాల్గొన్నారు.




మొదటి పేజీ తరువాయి

## రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అవార్డులు అందుకున్న అల్లు అర్జున్, విజయ్ దేవరకొండ

ప్రముఖ నటుడు అల్లు అర్జున్ 'పుష్ప-2' సినిమాలో కనబరిచిన అద్భుతమైన నటనకు గాను ఉత్తమ నటుడిగా తెలంగాణ ప్రభుత్వ గద్దర్ అవార్డును అందుకున్నారు. ఆయన నటనకు విమర్శకుల ప్రశంసలతో పాటు ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ లభించిన విషయం తెలిసిందే. ఈ అవార్డును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆయన స్వీకరించారు. ఈ వేడుకలో పలు విభాగాల్లో అవార్డులను ప్రకటించారు. ఉత్తమ నటిగా నివేదా థామస్ ఎంపికయ్యారు. 2024 సంవత్సరానికి గాను 'కల్కి' చిత్రానికి దర్శకత్వం వహించిన నాగ్ అశ్విన్ ఉత్తమ దర్శకుడిగా పురస్కారం అందుకున్నారు. చారిత్రక కథాంశంతో తెరకెక్కిన 'రజాకార్' చిత్రం ఉత్తమ చారిత్రాత్మక చిత్రంగా నిలవగా, 'కమిటీ కుర్రోళ్లు' ఉత్తమ తొలి చిత్రంగా అవార్డును దక్కించుకుంది.ఎన్టీఆర్ నేషనల్ ఫిల్మ్ అవార్డును నందమూరి బాలకృష్ణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. 'కాంతారావు ఫిల్మ్ అవార్డు'ను విజయ దేవరకొండ, 'బీఎన్ రెడ్డి ఫిల్మ్ అవార్డు'ను సుకుమార్, 'రఘుపతి వెంకయ్య అవార్డు'ను యండమూరి వీరేంద్రనాథ్, 'నాగిరెడ్డి అండ్ చక్రపాణి ఫిల్మ్ అవార్డు'ను అట్లూరి పూర్ణ చంద్రరావు, 'పైడి జైరాజ్ అవార్డు'ను మణిరత్నం అందుకున్నారు.

మొదటి పేజీ తరువాయి

## కత్తి పట్టుకోమన్న కార్యకర్తపై కమల్ హాసన్ ఫైర్...

ప్రముఖ నటుడు, మక్కల్ నీది మయ్యం (ఎంఎన్ఎం) అధినేత కమల్ హాసన్ తన పార్టీ కార్యక్రమంలో తీవ్ర అసహనానికి గురయ్యారు. ఓ కార్యకర్త అత్యుత్సాహంతో ఆయన చేతికి బలవంతంగా కత్తిని ఇవ్వబోవడమే ఇందుకు కారణం. ఈ అనూహ్య పరిణామంతో వేదికపై కాసేపు గందరగోళం నెలకొనగా, పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దాల్సి వచ్చింది. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.వివరాల్లోకి వెళితే, చెన్నైలో జరిగిన ఎంఎన్ఎం పార్టీ సమావేశంలో ఈ ఘటన చోటుచేసుకుంది. కార్యక్రమం ఉత్సాహంగా సాగుతున్న వేళ, కొందరు కార్యకర్తలు కమల్ హాసన్‌కు ఓ పెద్ద కత్తిని బహూకరించారు. అభిమానుల కేరింతల మధ్య కమల్ నవ్వుతూనే దానిని స్వీకరించి ఫోటోలకు పోజులిచ్చారు. అయితే, అదే సమయంలో మరో కార్యకర్త వేదికపైకి దూసుకొచ్చి, కమల్ చేతికి బలవంతంగా కత్తిని అందించే ప్రయత్నం చేశాడు. ఈ చర్యతో కమల్ హాసన్ ఒక్కసారిగా తీవ్ర అసహనానికి లోనయ్యారు. ఆయన ముఖంలో చిరునవ్వు మాయమై, ఆగ్రహం స్పష్టంగా కనిపించింది. సదరు కార్యకర్త వైపు తీవ్రంగా చూస్తూ, కత్తిని కింద పెట్టమంటూ గట్టిగా సంజ్ఞ చేశారు. అక్కడే ఉన్న ఓ పోలీసు అధికారి వెంటనే స్పందించి, ఆ కార్యకర్తను నిలువరించి, కత్తిని పక్కనబెట్టారు. అయినప్పటికీ, ఆ కార్యకర్త కమల్ హాసన్‌తో కరచాలనం చేసేందుకు, ఫోటో దిగేందుకు పట్టుబట్టడంతో, భద్రతా సిబ్బంది అతడిని పక్కకు తీసుకెళ్లారు. ఈ ఘటనతో సభా ప్రాంగణంలో కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అనంతరం, కమల్ హాసన్ తేరుకుని కార్యక్రమాన్ని కొనసాగించారు.

మొదటి పేజీ తరువాయి

## 42శాతం బిసి రిజర్వేషన్లతోనే స్థానిక ఎన్నికలు

### సామాజిక తెలంగాణ కోసం విద్యార్థులు పోరాడాలి

### తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత

**హైదరాబాద్,జూన్14(సమయజ్యోతి):** బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తే ఊరుకోబోమని రేవంత్ సర్కారును ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. తెలంగాణ జాగృతి స్టూడెంట్ ఫెడరేషన్‌లో పెద్ద సంఖ్యలో చేరారు. వారికి కండువా కప్పి తెలంగాణ జాగృతిలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సామాజిక తెలంగాణ సాధనకు విద్యార్థి లోకం కదిలిరావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు ముందు వరుసలో ఉండి కొట్లాడారని.. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు కీలక పాత్ర పోషించారన్నారు. అదే స్ఫూర్తితో సామాజిక తెలంగాణ సాధన ఉద్యమంలో విద్యార్థులు ముందు వరుసలో ఉండాలని.. సామాజిక తెలంగాణను సాధించడానికి విద్యార్థులు నడుం బిగించాలన్నారు. బీసీ బిల్లులు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉండగానే.. స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలన్న ఆలోచన సరికాదన్నారు. బీసీలకు 42 రిజర్వేషన్లకు ఇవ్వకుండా ఎన్నికలు నిర్వహిస్తే చూస్తూ ఊరుకోబోమన్నారు. 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కర్నాటకలో కులగణన ఎలా చేయాలో అక్కడి సీఎం సిద్దరామయ్యకు నేర్పించానని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకుంటున్నారని.. సీఎం ఈ ప్రకటన చేసిన గంట సేపటికే కాంగ్రెస్ అధికారికంగా ఒక ఫొటో విడుదల చేసిందని.. ఆ ఫొటోలో రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, సిద్ధరామయ్య, డీకే శివకుమార్ ఉన్నారని.. రేవంత్ రెడ్డి మాత్రం లేరన్నారు. దీన్ని బట్టే రేవంత్ రెడ్డి ఎన్ని అబద్దాలు ఆడుతున్నారో అర్థమవుతుందన్నారు. రాహుల్ గాంధీ దర్శనం లేక సీఎం రేవంత్ రెడ్డి విలవిలలాడు తున్నారని.. దర్శనాల సంగతి పక్కనబెట్టి ప్రజా సమస్యలపై సీఎం దృష్టిపెట్టాలని సూచించారు.ఆర్ఎస్ఎస్ స్కూల్, టీడీపీ కాలేజీలో చదువుకున్నానని.. జాబ్ కాంగ్రెస్ లో చేస్తున్నానని సీఎం అన్నారని.. చేస్తున్న జాబ్‌లో కూడా రేవంత్ రెడ్డికి పాస్ మార్కులు రావడం లేదని ఎద్దేవా చేశారు. ఢిల్లీకి వెళ్లడంలో రేవంత్ రెడ్డి హాఫ్ సెంచరీ చేశారని.. కనీసం మంత్రివర్గాన్ని కూర్పు చేసుకోలేని సీఎం రేవంత్ రెడ్డి అని.. ఇంత అసమర్థ, బలహీన ముఖ్యమంత్రిని గతంలో ఎప్పుడూ చూడలేదని విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో చివరి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి కూడా ఇంత బలహీనంగా లేకుండేనని.. తెలంగాణ ఆత్మగౌరవాన్ని రేవంత్ రెడ్డి ఢిల్లీలో తాకట్టు పెడుతున్నారని ఆరోపించారు. విద్యార్థుల సమస్యలు, విద్యారంగ పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని.. దాదాపు రూ.8వేల కోట్ల మేర ఫీజు రియింబర్స్ మెంట్ బకాయిలు ఉన్నాయని.. తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. విద్య భరోసా కార్డులు పంపిణీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని విస్మరిస్తోందని.. తెలంగాణ జాగృతి విద్యార్థి విభాగం మెరుపులా పనిచేయాలని సూచించారు.

మొదటి పేజీ తరువాయి

### కృష్ణాజలాల వాటాను కేవలం

# 299 టీఎంసిలకే పరిమితం

ఏపీ ప్రభుత్వం నిర్మించతలపెట్టిన గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు విషయంలో తెలంగాణ ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన ఆరోపణలను మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తోసిపుచ్చారు. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై నిర్ణయాత్మకంగా వ్యవహరిస్తున్నాం. జనవరి 22న కేంద్ర జలశక్తి, ఆర్థికశాఖ మంత్రులకు లేఖ రాశాను. ఆ ప్రాజెక్టుపై అభ్యంతరాలు తెలిపాను. బనకచర్ల ప్రాజెక్టుపై కాంగ్రెస్ పార్టీ మౌనం వహించలేదు. చట్టపరంగా ముందుకెళ్తున్నాం. హరీశ్‌రావు వాదనలు నిరాధారం, తప్పుదారి పట్టించేలా ఉన్నాయని మండిపడ్డారు. నదీ జలాల హక్కులపై తెలంగాణకు నష్టం చేసింది బీఆర్ఎస్సేనని ఆరోపించారు. పదేళ్ల పాలనా కాలంలో కృష్ణానది వాటాను కేవలం 299 టీఎంసీలకే పరిమితం చేశారు. బీఆర్ఎస్ హయాంలోనే ముచ్చుమర్రి, మాల్యాల నుంచి నీటిని తరలించారు. రాయలసీమ ఎత్తిపోతలపై అపెక్స్ కౌన్సిల్‌ను మీరెందుకు సంప్రదించలేదు. ఏపీ..రోజూ 3 టీఎంసీలు మళ్లిస్తోంటే కేసీఆర్ చోద్యం చూశారు. జగన్, కేసీఆర్ మధ్య అవగాహనతోనే తెలంగాణ నీటిని ఏపీకి దోచిపెట్టారని ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆరోపించారు. ఇవన్నీ కప్పిపుచ్చి బనకచర్ల ప్రాజెక్టు గురించి బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు చేసిన ఆరోపణలను చేయడాన్ని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తోసిపుచ్చారు. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై నిర్ణయాత్మకంగా వ్యవహరిస్తున్నామని ఆయన అన్నారు. జనవరి 22న కేంద్ర జలశక్తి, ఆర్థికశాఖ మంత్రులకు లేఖ రాశానని.. బనకచర్ల ప్రాజెక్టుపై అభ్యంతరాలు తెలిపినట్లు- పేర్కొన్నారు. బనకచర్ల ప్రాజెక్టుపై కాంగ్రెస్ పార్టీ మౌనం వహించలేదని.. ప్రాజెక్టుపై చట్టపరంగా ముందుకెళ్తున్నామని తెలిపారు. ఈ విషయంలో హరీశ్‌రావు వాదనలు నిరాధారం, తప్పుదారి పట్టించేలా ఉన్నాయని ఉత్తమ్ మండిపడ్డారు.

# మానవ హక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా రమాకాంత్ రావు

సమయజ్యోతి న్యూస్ ప్రతినిది ఆదిలాబాద్

హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షులు శివదాస్ మహాజన్ ఆదిలాబాద్ జిల్లా వాస్తవ్యులైన రమాకాంత్ రావుని మానవ హక్కుల సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ పంపించిన నియామక పత్రం, ఐడెంటిటీ కార్డును హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పెట్కులే లయన్ రమాకాంత్ రావు కి శనివారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగి సాంబన్న తో కలిసి అందించడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పేట్కులే మాట్లాడుతూ మానవ హక్కులకు భంగం కలిగించే విధంగా ఎవరైనా ప్రవర్తించి ఎదుటివారికి అన్యాయం చేస్తే బాధితులు ఎవరైనా హ్యూమన్ రైట్స్ జిల్లా, రాష్ట్ర కార్యవర్గ అధ్యక్ష ప్రధాన కార్యదర్శుల ను కలిసి తమకు జరిగిన అన్యాయ విషయాన్ని వివరించి న్యాయం కోరితే తప్పకుండా




జాతీయ అధ్యక్షులు శివదాస్ మహాజన్ సహకారంతో న్యాయం అందించే ప్రయత్నం చేస్తామని, శివదాస్ మహాజన్ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేకమందికి న్యాయం చేకూర్చడంలో సహకరించారని తెలియజేశారు. రమాకాంత్ రావు తో పాటు జిల్లా కార్య నిర్వాహక అధ్యక్షునిగా మురళీధర్ నాగోషే ని నియమించడం జరిగింది. ఆ నియామక పత్రాన్ని కూడా బేల మండలం జూనోని కి చెందిన సామాజిక కార్యకర్త మురళీధర్ నాగోషే కి అందించి అభినందనలు తెలియజేయడం జరిగింది

# మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి

అమరచింత వనపర్తి జిల్లా.

మక్తల్ ఎమ్మెల్యేగా డాక్టర్ వాకిటి శ్రీహరి గత సంవత్సరం అమరచింతలో జూనియర్ కాలేజీ ఏర్పాటు చేస్తానని ప్రజలకు ఇచ్చిన హామీని మంత్రిగా నైనా తన ఇచ్చిన హామీని నెరవేర్చాలని అమరచింత పట్టణ సిపిఐ కార్యదర్శి ఏ. రవీందర్ డిమాండ్ చేశారు. శనివారం అయన సిపిఐ నాయకులతో కలిసి పట్టణంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ గ్రౌండ్ లో మాట్లాడారు. గత సంవత్సరం ఈ మండలంలో జూనియర్ కాలేజీ ఏర్పాటు చేస్తానని వాకిటి శ్రీహరి ఎమ్మెల్యేగా హామీ ఇచ్చారని గుర్తు చేశారు. నేటికీ అకాడమీ ఇయర్ ప్రారంభమైనా హామీని నెరవేర్చలేదని గుర్తు చేశారు. అమరచింత మండలంలోని 14 గ్రామాలలో పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు పై చదువులకు వెళ్లేందుకు ఇతర జిల్లాలకు వెళ్ళవలసి వస్తుందని అన్నారు. ఈ ప్రాంతంలో బీడీ కార్మికులు, వ్యవసాయ, చేనేత కార్మికులు ఎక్కువగా ఉన్నారని ఆర్థిక స్తోమత లేక పై చదువులు మానేస్తున్నారని అన్నారు. ఇటీవలే మంత్రిగా బాధ్యతలు చేపట్టిన వాకిటి శ్రీహరికి సిపిఐ పార్టీ తరపున అభినందనలు తెలుపుతున్నామన్నారు. ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ అకాడమిక్ ఇయర్ లోనే విద్యార్థులతో అడ్మిషన్లు తీసుకొని పేద విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు భాస్కర్, శ్యాంసుందర్, లక్ష్మీనారాయణ, ఇజ్రాయిల్ పాల్గొన్నారు.

# మోడీ నాయకత్వంలో ఆదర్శవంతంగా దేశ అభివృద్ధి

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో భారతదేశం ప్రపంచంలోనే విశ్వ గురువుగా అభివృద్ధి చెంది, ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందని రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో శనివారం జరిగిన సమావేశంలో బిజెపి మండల అధ్యక్షుడు సొల్ల క్రాంతి కుమార్ తో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మట్ట వెంకటేశ్వర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి మల్లారపు సంతోష్ రెడ్డి పేర్కొన్నారు.

సబ్ కా సాథ్.. సబ్ కా వికాస్.. సబ్ కా ప్రయత్న్.. సబ్ కా విశ్వావాస్ అనే మంత్రంతో ప్రతి పౌరుడిని అభివృద్ధి బాటలోకి తెచ్చిన ఘనత నరేంద్రమోడిదని అన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఏర్పడి 11 సం.ల్లో దేశం అనేక సంక్షేమం, అభివృద్ధి మార్గంలో నడిచిందన్నారు. దేశం మొత్తం వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరే దిశగా ఏకతాటిపై ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. నూతన, స్వయంపూర్ణ, సురక్షిత, సాధికార, అభివృద్ధి చెందిన



భారతాన్ని నిర్మించడంలో మనందరిలో దృఢమైన సంకల్పం ఉందన్నారు. ఇది ప్రధాని మోదీ కలమాత్రమే కాదు, 140 కోట్ల భారతీయుల ఆశయంగా మారిందని, దేశ వ్యాప్తంగా ఏలాంటి అవినీతికి తావివ్వక అభివృద్దే లక్ష్యంగా కేంద్ర సర్కార్ ముందుకు సాగుతుందని, సంక్షేమం తో పాటు దేశ రక్షణ, తీవ్రవాదుల ఏరివేతతో ప్రపంచ దేశంలోనే బలమైన శక్తిగా రూపొందిందని అన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణలో భాజాప అధికారం దక్కించుకోవడంతో పాటు, కేంద్రంలో కమలం మరోమారు అధికారంలోకి రాబోతుందని, అనేక పథకాలను ప్రతి పేదవాడికి చేరే విధంగా కృషి చేస్తున్న ప్రధాని మోదీకి ప్రతి ఒక్కరం అండగా ఉంటూ దేశాన్ని మరింత అభివృద్ధి బాటలో నడిపించుకుందామని అన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుల జిల్లా కౌన్సిల్ మెంబర్ మేరుగు అంజాగౌడ్, పట్టణాధ్యక్షులు మెంగని మహేందర్, మండలా ఉపాధ్యక్షులు ఏదునూరి గోపి, గుండవేనీ తిరుపతి, జిలెళ్ళ మల్లేశం నాయకులు వరి వెంకటేశ్, చిట్నేని శ్రీనివాస్ రావు, పప్పుల శ్రీకాంత్, తాంద్ర రామ్ గోపాల్ కోల క్రిష్ణ గౌడ్, బుర్ర శ్రీనివాస్ గౌడ్, చీకోటి మహేశ్, బాల్ రెడ్డి , భగత్ రెడ్డి పాల్గొన్నారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంటింటికి ప్రచారం చేయాలి

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంటింటికి తీసుకెళ్లి ప్రచారం చేయాలని బాల్కొండ మండల కేంద్రంలో శనివారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్ నిర్వహించిన కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఆరు గ్యారటీలను ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమలు చేసిందని దీంతో ప్రజలు సంతోషంగా ఉన్నారని అన్నారు. సంక్షేమ పథకాలకు అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వివరాలు సేకరించాలని అన్నారు. గృహ జ్యోతి, ఉచిత విద్యుత్, ఉచిత బస్సు, 500 కే సిలిండర్, ఇందిరమ్మ ఇల్లు, సన్న బియ్యం, కొత్త రేషన్ కార్డులు, రుణమాఫీ, రైతు భరోసా, 50 వేలకు పైబడి ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలు, బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ అంశాలపై ప్రజలకు వివరించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా, మండల గ్రామ కార్యవర్గ సభ్యులు అనుబంధ సంఘాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే భూపతిరెడ్డి

సమయజ్యోతి న్యూస్ నిజామాబాద్ బ్యూరో

నిజామాబాద్ గ్రామీణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్ఓ సోషల్ మీడియా ఆధ్వర్యంలో అంతర్జాతీయ రక్తదాన దినోత్సవం, రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతి రెడ్డి, రక్తదాన శిబిరాన్ని ప్రారంభించగా సుమారు 25 మందికి పైబడి రక్తదానం చేశారు. జిల్లా యువ నాయకులు ఉమ్మాజి నరేష్, రూరల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మహేందర్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ సొప్పరీ వినోద్, రూరల్ జనరల్ సెక్రెటరీ ఆకాష్, జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కిరణ్ అనుపాల్, మండలాల యూత్ నాయకులు పాల్గొన్నారు.





# ఎఫ్ఎల్ఎన్ వండర్ బాక్సుల అందజేత

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

బాల్కొండ మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో శనివారము మండల విద్యాధికారి బట్టు రాజేశ్వర్, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్ఎం లకు ఎఫ్ఎల్ఎన్ వండర్ బాక్సులను అందజేశారు. విద్యార్థుల విద్యా బోధన సామర్థ్యాలు మెరుగు పరచడానికి, ప్రభుత్వం బోధనోపకరణాలను అందిస్తున్నదని, సమగ్ర విద్యా ద్వారా రూపొందించిన విద్యార్థులకు ఆటలు, వినోదంతో కూడిన బోధన అందించేలా బోధన ఉపకరణాల కిట్లు సరఫరా చేస్తున్నట్లుగా పేర్కొన్నారు. వండర్ బాక్స్.. విద్యాపరమైన బొమ్మలు, పుస్తకాలు, ఇవి పిల్లల సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచనా నైపుణ్యాలు పెంపొందిస్తాయని అన్నారు.



సమయజ్యోతి
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

# విమానయాన రంగం పురోగమించాలి !

అహ్మదాబాద్ విమాన దుర్ఘటన నుంచి మనం ఎన్నో పాఠాలు నేర్చుకోవాల్సి ఉంది. ప్రధానంగా సాంకేతికంగా మరింత నైపుణ్య సాధించాలి. విమానయాన రంగంలో నైపుణ్యాలకు పెద్దపీట వేయాలి.విమనాలు బయలుదేరే ముందు కనీసం దాని సామర్థ్యం, లోపాలను పరిశీలించి ఓకే చేసిన తరవాతనే ప్రయాణానికి అనుమతి ఇవ్వాలి. ఇప్పటి వరకు అలాగే జరుగుతున్నా తాజా ఘటనతో లోపాలను వెలికి తీయాలి. అలాగే ఎయిరిండియా విమానం కూలడానికి రెండు ఇంజిన్లు ఫెయిల్ అయ్యాయని అంటున్నారు. అది ఢిల్లీ నుంచి బయలుదేరి వచ్చిందని అంటున్నారు. అలాంటప్పుడు ఈ ప్రమాదం ఎలా జరిగిందన్న దానిపై లోతుగా విశ్లేషణ చేయాలి. ఇకపోతే విమానయానరంగ నిపుణులను తయారు చేసుకునే అవసరం ఇప్పుడు వచ్చింది. ఈ రంగంలో ఇంజనీర్లయిన నిపుణుల కొరత ఉన్నట్లు తెలుస్తోంది. 146 కోట్లు ఉన్న దేశ జనాభాకు తగ్గట్లుగా ఇప్పటికీ విమానాలు లేవు. ఉన్నకొద్ది విమానాలు సామాన్యుల అవసరానికి అనుగుణంగా లేవు. ఇంకా విమానాశ్రయాలు నిర్మించాల్సి ఉంది. స్పీడ్ యుగంలో ప్రజలకు విమానయాన ప్రయాణం అందుబాటులోకి రావాలి. నాణ్యమైన సేవలు అందించేలా ఈ రంగాన్ని తీర్చిదిద్దాలి. ఇవన్నీ తర్కిస్తూ...తాజా ప్రమాద ఘటనపై విశ్లేషణ చేయాలి. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై నిపుణులతో చర్చించాలి. ఈ ఘటన ఎందుకిలా జరిగిందో లోతుగా అధ్యయనం చేయాలి. నిజానికి అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటన ఒళ్ళు జలదరింపచేస్తోంది. ఆ పెనువిషాదం గుండెలను పిండేస్తున్నది. వందల కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపింది. ఎందరో కలలను చిదిమేసింది. ఎయిరిండియా తప్పిదానికి వందలాది ప్రాణాలు గాల్లో కలిసి పోయాయి. అలవోకగా సముద్రాలను అధిగమించి, సునాయాసంగా వేలాదికిలోమీటర్లు దూసుకుపోవాల్సిన ఈ విమానం నేలకూలడంతో బతుకలు ఛిద్రం అయ్యాయి. నిత్యం వదదలాది విమానాలు క్షేమంగా గమ్యం చేరుస్తున్నాయి. వేలాది మంది తమ గమ్యాన్ని చేరుకుంటున్నారు. ఇలా ఎన్నో కలలతో తమ గమ్యానికి చేరుకుంటామన్న వారి జీవితాలు బుగ్గిగా మారాయి. ఎన్నో ఆశలు, ఆశయాలతో బయలుదేరిన వారంతా అర్ధంతరంగా జీవితం చాలించారు. ఇందులో మరో విషాదమేమంటే ఏమీ తెలియని వైద్యవిద్యార్థులు భోజనానికి కూర్చున్న సమయంలో అనుకోని ప్రమాదం పిడుగులా దూసుకువచ్చిపడింది. దీంతో దాదాపు 33మంది మృతి చెందారని అంటున్నారు. నిజంగా వీరికోసం ఎందరో తల్లదండ్రులు కలలుకన్నారు. ఈ ప్రమాంతో ఇప్పటి వరకు 274మంది మృత్యువాత పడ్డారు. మరికొందరు ఇంకా ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వీరంతా అతివిషాదంగా తమ జీవితాన్ని ముగించాల్సివచ్చింది. మహాశక్తిమంతమైన ఇంజన్లు కలిగిన , అత్యాధునిక సాంకేతిక వ్యవస్థలు ఉన్న టాటాలు నడుపుతున్న విమానం లండన్‌లో నిక్షేపంగా దిగడానికి బదులు వందల అడుగులు లేవకుండానే కూలిన ఘటన మనకు గుణపాఠం కావాలి. మొత్తం విమానయాన రంగాన్ని ఆత్మపరిశీలనచేసుకోవాలి. విమానాల ఉత్పత్తి మొదలు సాంకేతకిత వరకు అన్నీ సమగ్ర అధ్యయనం చేయాలి. మాటలకు అందని మహావిషాదం ఇది. పట్టుమని తొమ్మిదివందల అడుగులు కూడా లేవలేక విమానం కుప్పకూలింది. విమాన ప్రమాదాల్లో సగానికి పైగా టేకాఫ్, లాండింగ్ సందర్భాల్లోనే జరుగుతాయి. తొలుత పక్షి ఢీకొన్నదేమోనన్న అనుమానాలూ ఉన్నాయి. టేకాఫ్ సక్రమంగా జరగలేదని, అందుకు తగినంత శక్తి సమకూరలేదని అర్థమవుతూనే ఉంది. ట్యాంక్ నిండా ఇంధనం ఉన్నా, సరఫరా వ్యవస్థల్లో లోపం ఉంటే, ఇంధనం సరిగా చేరక ఇంజన్ విఫలమవుతుంది. ఇంజన్ మీద అత్యంత భారం పడే టేకాఫ్ సందర్భం పైలట్ల నైపుణ్యానికీ, అనుభవానికీ కూడా ఓ విషమపరీక్ష. నిండుగా ఉన్న ఇంధనం నిక్షేపంగా గమ్యానికి చేర్చాల్సింది పోయి విమానం మొత్తం క్షణాల్లో భగ్గున మండేలా తోడ్పడింది. ఆ విమానం వైద్యవిద్యార్థుల హాస్టల్ మీద పడి, అనేక మంది ప్రాణాలు తీసింది. సమగ్ర పరీక్షలు చేయనిదే, ప్రయాణానికి నూరుశాతం అర్హమైనదని నిర్ధారణ కానిదే ఏ విమానమూ గాలిలోకి ఎగరదు. అత్యంత అనుభవజ్ఞులైన పైలట్, కోపైలట్‌కు ఏ మాత్రం అనుమానం కలిగినా ఈ ప్రయాణానికి అంగీకరించేవారే కాదు. ఇంతటి ఘోర ప్రమాదం జరిగిన తరువాత, మొత్తంగా బోయింగ్‌మీద, ప్రత్యేకించి ఈ తరహా విమానాలమీద అనుమానాలు ప్రచారంలోకి రావడం సహజం. ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాల్లో ఈ విమానాలు నిక్షేపంగా తిరుగుతున్నాయి. ఎయిర్ ఇండియాను కొనుగోలు చేసిన సందర్భంలో టాటా సంస్థకు సంక్రమించిన విమానాల్లో కొన్నింటికి కాలం చెల్లడంతో వాటి ఆధునికీకరణ కూడా సాగుతోందని అంటారు. గత నెలలోనే నాలుగు వందల మిలియన్ డాలర్ల వ్యయంతో అది మలిదశ కార్యక్రమానికి నడుంబిగించింది. ఈ ప్రమాదం నేపథ్యంలో ఎయిర్ ఇండియా తన విమానాల సంపూర్ణ ప్రక్షాళనకు సిద్ధపడక తప్పదు. విమానాల ఆధునికీకరణకు సంబంధించి దేశీయ విమానయాన సంస్థలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పట్టించుకొని వాటి తరఫున విదేశాలతో వ్యవహరించడం అవసరం. సాంకేతిక వైఫల్యాల నుంచి మానవ నిర్లక్ష్యం వరకూ ఈ ప్రమాదానికి దోహదం చేసిన అంశాలన్నింటినీ నిక్కచ్చిగా గుర్తించి, కఠినమైన చర్యలను చేపట్టడంతో పాటు, సరైన పరిష్కారాలను సాధించడం అవసరం. దేశీయంగా విమాన సాంకేతికతను బలోపేతం చేసుకోవాల్సిన అసవరం కూడా ఏర్పడింది. మనదశంలో ఐఐటిలు మొదలు అనేక ఇంజనీరింగ్ కాలజీల్లో చదువుతున్న లక్షల మంది యువ విద్యార్థుల్లో విమానరంగ విద్యపై శిక్షణ ఇవ్వాల్సి ఉంది. అలాంటి కోర్సులకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఈ రకంగా విద్యకు, ఉపాధికి లంకె వేసి దేశీయంగా విమానయాన రంగాన్ని బలోపేతం చేయాలి. మరిన్ని విమానాశ్రయాలను నిర్మించాలి. ప్రమాదాలపై తక్షణం అధ్యయనం చేయాలి. వాటిని ఆచరించి ముమ్ముందు అలాంటివి జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అప్పుడే మనం సమర్థంగా ముందుకు సాగగలం.

# విషాదం నింపిన విమాన ప్రమాదం



బోయింగ్ డీమ్ లైనర్తో జరిగిన అల్ క్రష్ ప్రయాణీకుల భద్రత మరియు విమాన రూపకల్పన పై తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తతుంది. అహ్మదాబాద్ లో జరిగిన ఘోర విమాన ప్రమాదంలో ఏరా ఇండియా బోయింగ్ 787-8 డీమ్ లైనర్ విమానం ప్రయాణీకుల భద్రత మరియు విమానాల రూపకల్పన పై తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తతుంది. ఇటీవల విమానయాన చరిత్రలో అత్యంత దారుణమైన విమాన విపత్తు కు కారణాలు ఇప్పటికే అసష్టగా ఉన్నాయి. అయితే గత కొన్ని సంవత్సరాలుగా దాని విమానాల సముదాయంలో సాంకేతిక లోపం కారణంగా తీవ్ర పరిశీలన ఎదురైనప్పటికి అమెరికన్ కెన్ ఏరోసేపస్ దిగ్గజం బోయింగ్ బాధలను ఇది మరింతగా పెంచుతుంది. అహ్మదాబాద్ విమానాశ్రయంలో టేకాఫ్ అయిన కొద్ది సేపటికే కుప్ప కూలిన లండన్ కు వెళ్ళే విమానం చివరి క్షణాలను బాగా అర్థం చేసుకోవడానికి బ్లాక్ బాక్స్ మాకు సహాయపడుతుందీ. విమానంలో 242 మంది ప్రయాణికులతో సహా 265 మంది ప్రాణాలు కోల్పోయిన ప్రమాదంపై ఎయిర్ క్రాఫ్ట్ యాకిడెంట్ ఇనెసిగేషన్ బూరో %ూూ×దీ%, దర్యాప్తు నాయకత్వం వహిస్తున్నది. మధ్యాహ్నం 1.39 నిమిషాలకు టేకాఫ్ అయిన కొద్ది సేపటికే పైలట్ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ %ూుజ% కి మేడే కాల్ జారీ చేశాడు. మరియు విమానం సమీపంలో ని నివాస ప్రాంతంలోకి పడిపోయే ముందు కేవలం 625 అడుగుల ఎత్తుకు చేరుకుంది. %హీూూూ% మొక్క కమరిషల్ క్యూ పోగామ్ లో భాగంగా అభివృద్ధి చేయబడిన వోమనౌక అయిన స్టార్ లైనర్ లోపభూయిష స్టార్ లైనర్ నుండి వోమగాములు సునీతా విలియమ్స్ మరియు బుచ్ విలోర్ అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం %×ూూ% లో అనేక నెలలు చిక్కుకుపోవడానికి దారీ తీసిన ఒక అంతరిక్ష నౌక, ప్రయాణీకుల విమానాలకు సంబంధించిన సాంకేతిక లోపాలు మరియు ప్రమాదాల శేణీ వరకు బోయింగ్ యొక్క కష్టాలు చాలా రెట్లు ఉన్నాయి. గత సంవత్సరం జూన్ లో ప్రయోగానికి ముందే స్టార్ లైనర్ లో హీలియం లీక్ కనుగొనబడింది. కానీ బోయింగ్ నాయకత్వం దానిని పట్టించుకోలేదు. ఏరోసేపస్ కంపెనీ సూచించిన మాడూల్లను అనుసరించిందా అనే ప్రశ్నలు. భద్రతా మరియు రక్షణ కార్య కలాపాలు. బోయింగ్ సవాళ్లు అంతరిక్ష రంగానికే పరిమితం కాలేదు. అ కంపెనీ తన జెట్ ల నుండి గాలిలో ఎగిరిపోయే తలుపులు మరియు చక్రాలు వంటి అన్ని తప్పుడు కారణాల వల్ల మీడియా ముఖ్యంశాలోకీ దిగుతుంది. 737 మాక్స సంక్షోభ సహా వాణిజ్య విమానాలతో ఇది గణనీయమైన సమస్యలను ఎదుర్కొంది. భద్రతా ప్రమాణాల గురించి విస్తృత అందోళనలను లేవనెత్తతుంది. ఇప్పటి వరకు 20 మందికి పైగా విజిల్ బ్లోయింగ్ ముందుకు వచ్చి భద్రత మరియు నాణ్యత సమస్యల గురించి ఆధారాలు లేవనతారు. బోయింగ్ 787 డీమ్ లైనర్ మరింత ఆధునికమైన, ఇంధన సమర్ధవంతమైన వైడ్ బాడీ విమానం ఎంపిక చేసినప్పటికీ ఇది గతంలో లిథియం అయాన్ బాటరీ సమస్యలు, హైడ్రాలిక్ మరియు ఇంధనం లీక్ లు, లోపాలు మరియు నిర్మాణం సమగ్రత ఆందోళనలతో సహా సాంకేతిక లోపాలు మరియు భద్రతా సమస్యలతో పోరాడింది. గత సంవత్సరం సామ్ సలేహ్పూర్ అనే విజిల్ బ్లోయింగ్ తన 777 మరిము 787 జెట్ లను తయారు చేయడంలో షార్ట్ కట్ లను తీసుకుందనీ, ఇది విమానం వయస్సు పెరిగే కొద్ది విపత్తు ప్రమాదంలకు దారి తీసింది. అహ్మదాబాద్ లో జరిగిన ప్రమాదంలో చిక్కుకున్న బోయింగ్ 787-8 డిమ్ లైనర్ 12 సంవత్సర వయస్సు గలది మరియు డిసెంబర్ 2013 లో సేవలోకి ప్రవేశించింది. బోయింగ్ 787 భద్రత గురించి సంవత్సరాలుగా ఆందోళన ,అయితే విమానయాన సంస్థ విమానాల రూపకల్పన పై నమ్మకంగా ఉంది. 2013 లో దాని బాటరీలు అనేక సందర్భాల్లో మంటల్లో చిక్కుకునారు. దీని వల్ల తాత్కాలికంగా నేలమట్టం అయింది. భద్రతా సమస్యలుపై బోయింగ్ అనేక %ఖూ% ఫెడరల్ ఏ వి యే ౦ ష ్ న ్ అడ్మినిస్ట్రేషన్. %ఖీూూ% దర్యాప్తు లను ఎదుర్కొంది. భద్రతా కంటే లాభాలు ప్రధాన్యం పొందడం ప్రారంభించినపుడు బోయింగ్ సమస్యలు ప్రారంభం అయ్యే విమానయాన నిపుణులు భావిస్తున్నారు ఏది ఏమైనా ఈ ప్రమాదం లో ఒక్కరూ తప్ప అందరూ చని పోవడం వైద్య విద్యార్థులు మృత్యు వాత పడడం అంతులేని విషాదం మాజీ సి ఎం విజయ్ రూపాని మరియు మృతులకు మా నివాళు లు వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ

**కామిడి సతీష్ రెడ్డి జయశంకర్ భూపాల్ పల్లి జిల్లా 9848445134**

# రాజీ మార్గమే రాజా మార్గం

## - ప్రధాన న్యాయమూర్తి నీరజ

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

రాజీ మార్గమే రాజమార్గమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కం చైర్మన్ పి.నీరజ హితువు పలికారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కోర్టులలో పెండింగ్ లో ఉన్న అన్ని సివిల్ కేసులను ఈ లోక్ అదాలత్ లో పరిష్కరించుకోవాలని సూచించారు. జీవితం చాలా చిన్నదని మీరందరూ ఎలాంటి గొడవలకు తావివ్వకుండా జీవితాన్ని ప్రశాంతంగా గడపాలని కోరారు. జాతీయ లోక్ అదాలత్ విజయానికి సహకరించిన పోలీసులు, న్యాయవాదులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, మీడియా పనితీరును ప్రశంసించారు. ఈ కార్యక్రమం లో జిల్లా న్యాయమూర్తి బి.పుష్పలత, అదనపు ఎస్పి డి.చంద్రయ్య, డిఎల్ఎస్ఎ కార్యదర్శి రాధిక జైస్వాల్, సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మణాచారి, మేజిస్ట్రేట్లు ప్రవీణ్, కె.సృజన, జి.మేఘన, సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జె.శ్రీనివాస్ రావు, లోక్ అదాలత్ సభ్యులు సిహెచ్.భాస్కర్, ఎ.వేణు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.శ్రీనివాస్, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్, న్యాయవాదులు, పోలీసులు, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.




# రక్తదాతలకు ఘనంగా సన్మానం

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి అమరచింత వనపర్తి జిల్లా.**

అమరచింత పట్టణానికి చెందిన అంజి గౌడ్, కమలాకర్ గౌడ్ చుట్టుపక్కల పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అనేక రక్తదాన శిబిరాల్లో పాల్గొనిఇప్పటి వరకు అంజి గౌడ్ 30 సార్లు కమలాకర్ గౌడ్ 24 సార్లు రక్తం ఇచ్చి రక్తదాతగా నిలిచిన సందర్భంగా జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో అంజి గౌడ్,కమలాకర్ గౌడ్ లను శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సభ్యులు శ్యామ్ అమరచింత పాత్రికేయులు రఫీ, కె.విజయ్ , చిన్న , సింగంపేట విజయ్, రవి,రామన్ గౌడ్ ,పురుషోత్తం గౌడ్, సత్యనారాయణ, రంగనాథ్, మహిమూద్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.



# జిల్లాలో పని చేయడం గొప్ప అనుభూతిని అందించింది

## - అందరి సహకారంతోనే నిజామాబాద్ ను ముందంజలో నిలుపగలిగాం

## - వీడ్కోలు సమావేశంలో బదిలీపై వెళ్తున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు వెల్లడి

## - ఇదే ఒరవడితో ముందుకెళ్తామని నూతన కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి స్పష్టీకరణ

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి నిజామాబాద్ బ్యూరో

నిజామాబాద్ లో దాదాపు రెండున్నర సంవత్సరాల పాటు విధులు నిర్వహించడం ఎంతో గొప్ప అనుభూతిని కలిగించిందని, జిల్లాతో ఏర్పడిన అనుబంధం ఎన్నటికీ మర్చిపోలేనిదని జిల్లా కలెక్టర్ గా పనిచేసి ఇటీవలే బదిలీ అయిన రాజీవ్ గాంధీ హనుమంతు అన్నారు. ఆయన బదిలీపై వెళ్తున్న సందర్భాన్ని పురస్కరించుకుని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో శనివారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. నూతన జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన టి.వినయ్ కృష్ణారెడ్డికి ఇదే వేదికపై స్వాగత కార్యక్రమం ఏర్పాటు చేశారు. అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు బదిలీ అయిన కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పనితీరును, ఆయనతో కలిసి పని చేసిన అనుబంధాన్ని గుర్తు చేస్తూ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ స్పెషల్ సెక్రెటరీగా బదిలీపై వెళ్తున్న సీనియర్ ఐ.ఏ.ఎస్ అధికారి రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ, కలెక్టర్ గా తాను జిల్లాలో బాధ్యతలు స్వీకరించిన నాటి నుండి కింది స్థాయి ఉద్యోగి మొదలుకుని ప్రతి శాఖకు చెందిన అధికారులందరూ అన్ని విషయాల్లోనూ ఎంతగానో సహకరించారని అన్నారు. వారి తోడ్పాటు కారణంగానే జిల్లాను ధాన్యం సేకరణ వంటి అనేక అంశాలలో ముందంజలో నిలుపగలిగామని, వరుసగా వచ్చిన శాసన సభ, పార్లమెంటు, ఎమ్మెల్సీ ఎన్నికలను ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా సమర్ధవంతంగా నిర్వహించడంలో సఫలీకృతం కాగలిగామని అన్నారు. ముఖ్యంగా వ్యవసాయాధారిత ప్రాంతమైనందున నిజామాబాద్ జిల్లాలో పని చేయడం వల్ల ధాన్యం సేకరణ, పసుపు, ఎర్రజొన్న వంటి అంశాలతో పాటు, సాగు రంగంపై మంచి అనుభవం ఏర్పడిందని, మునుముందు నిర్వర్తించే విధులకు ఇది ఎంతగానో ఉపకరిస్తుందని ఆశాభావం వెలిబుచ్చారు. నిజామాబాద్ జిల్లా ప్రజలు ఎంతో మంచివారని, అన్ని వర్గాల వారు అందించిన సహకారంతోనే జిల్లాను ప్రగతి దిశలో ముందంజలో నిలుపగలిగామని అన్నారు. జిల్లా పాలనాధికారిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డితో తనకు మంచి సాన్నిహిత్యం ఉందని తెలిపారు. జిల్లాకు సమర్ధవంతమైన అధికారి కలెక్టర్ గా వచ్చారని, ఆయన నేతృత్వంలో జిల్లా మరింతగా ప్రగతి దిశగా పయనిస్తుందనే పూర్తి నమ్మకం ఉందన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతలను గుర్తిస్తూ అధికారులు అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని, తనకు తోడ్పాటును అందించిన రీతిలోనే నూతన కలెక్టర్ కు కూడా పూర్తి స్థాయిలో సహాయ, సహకారాలు అందించాలని హితవు పలికారు.

ఈ సందర్భంగా కలెక్టర్ కె.వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ, బదిలీపై వెళ్తున్న రాజీవ్ గాంధీ హనుమంతు జిల్లా కలెక్టర్ గా తనదైన ప్రత్యేకతను చాటారని, ఆయన ఒరవడిలోనే ముందుకు సాగుతూ నిజామాబాద్ జిల్లాను అన్ని రంగాలలో ముందంజలో నిలిపేలా కృషి చేస్తానని అన్నారు. తాను ఉద్యోగులతో స్నేహపూర్వకంగా మెలుగుతానని, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల లక్ష్య సాధనకు సమిష్టిగా కృషి చేద్దామని సూచించారు. పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఆర్డీఓలు రాజేంద్ర కుమార్, రాజాగౌడ్ తదితరులు బదిలీపై వెళ్తున్నఐ.ఏ.ఎస్ అధికారి రాజీవ్ గాంధీ హనుమంతుతో కలిసి పని చేసిన అనుభవాలను నెమరువేసుకున్నారు. వీడ్కోలు సమావేశంలో అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులతో పాటు ఉద్యోగ సంఘాల జె ఏ సి చైర్మన్ అలుక కిషన్, రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రమణ్ రెడ్డి, టీఎన్జీఓ ల సంఘం అధ్యక్షుడు సుమన్, పీఆర్టీయూ సంఘం జిల్లా అధ్యక్షుడు మోహన్ రెడ్డి, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధి వి.మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.






# భూభారతి దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలిబీకలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి

## – ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల తనిఖీ

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి నిజామాబాద్ బ్యూరో



భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం జిల్లాలో సమర్ధవంతంగా అమలయ్యేలా అంకిత భావంతో కృషి చేయాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి రెవెన్యూ అధికారులకు సూచించారు. శనివారం ఆయన నిజామాబాద్ ఆర్డీఓ కార్యాలయాన్ని, సౌత్, నార్త్ తహసీల్దార్ ఆఫీసులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. భూభారతి రెవెన్యూ సదస్సుల సందర్భంగా వచ్చిన దరఖాస్తులు, వాటి పరిష్కారానికి చేపడుతున్న చర్యల గురించి వివరాలు అడిగి తెలుసుకుని, సంబంధిత రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దరఖాస్తులను వెంటదివెంట పరిశీలిస్తూ, నిర్ణీత గడువు లోపు పరిష్కారం అయ్యేలా చొరవ చూపాలన్నారు. భూభారతి చట్టంపై పూర్తి అవగాహన ఏర్పర్చుకుంటే దరఖాస్తులను సకాలంలో, సులభంగా పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని హితవు పలికారు. ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా, భూభారతి చట్టంలోని నిబంధనలను తు.చ తప్పకుండా పాటిస్తూ, పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని సూచించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలిస్తూ, అందుబాటులో ఉన్న రెవెన్యూ రికార్డుల వివరాలతో సరిపోల్చుకుని, క్షేత్రస్థాయి విచారణను పకడ్బందీగా జరపాలని అన్నారు. నూతన ఆర్ఓఆర్ చట్టంలో అప్పీల్, రివిజన్ వ్యవస్థలు ఉన్నందున పొరపాట్లకు ఆస్కారం లేకుండా దరఖాస్తుల పరిష్కారంలో ఎంతో జాగరూకతతో వ్యవహరించాలని హితవు పలికారు. పెండింగ్ దరఖాస్తుల వివరాలను, వాటి పరిష్కారంలో జాప్యానికి గల కారణాలను పొందుపరుస్తూ తనకు నివేదిక పంపాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, సౌత్, నార్త్ తహసీల్దార్లు బాలరాజు, విజయ్ కాంత్, ఇతర రెవెన్యూ అధికారులు ఉన్నారు.

# రైతు నేస్తం' కార్యక్రమానికి రైతు వేదికలను ముస్తాబు చేయాలి

## -కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి నిజామాబాద్ బ్యూరో

ప్రభుత్వం ఈ నెల 16న నిర్వహించనున్న రైతు నేస్తం కార్యక్రమాన్ని పురస్కరించుకుని జిల్లాలోని అన్ని రైతు వేదికలను అందంగా ముస్తాబు చేయాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన డిచ్పల్లి మండలం నడిపల్లి, మోపాల్ మండల కేంద్రంలోని రైతు వేదికలను సందర్శించి, అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించారు. ప్రతి రైతు వేదికలోనూ నీటి వసతి, టాయిలెట్స్, సరిపడా ఫర్నీచర్ వంటి సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. రైతు వేదికలు పరిశుభ్రంగా ఉండాలని, ఆహ్లాదకర వాతావరణం ఉండేలా వేదిక ఆవరణాలలో అందమైన పూల మొక్కలు, పచ్చదనాన్ని పెంపొందించేలా మొక్కలు నటించాలని సూచించారు. రైతు నేస్తం కార్యక్రమానికి ఆదర్శ రైతులతో పాటు, స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి రైతులతో ముఖాముఖి జరుపనున్నందున ఎలాంటి సాంకేతిక ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి వీరాస్వామి తదితరులు ఉన్నారు.



# ప్రభుత్వ విప్, కేకే.. జ్యోతిబాపూలే సావిత్రిబాయి పూలే విగ్రహాల ఏర్పాటుకు భూమి పూజా

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో శనివారము ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాసు, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డితో కలిసి మహాత్మ జ్యోతిబాపూలే, సావిత్రిబాపూలే విగ్రహాల ఏర్పాటు కోసం భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు.



# బాధిత కుటుంబాలను పరామర్శించిన సునీల్ కుమార్ రెడ్డి

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

మెండోరా మండలంలోని బుస్సాపూర్ గ్రామంలో శనివారం నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి బాధిత కుటుంబాలను క్షేత్రస్థాయిలో పరామర్శించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ కోమన్ పల్లి రమేష్ ను పరామర్శించి ఆరోగ్య సమాచారాన్ని ఆరా తీశారు. సోమ రాజన్న అమ్మ నర్సవ్వ ఇటీవల అనారోగ్యంతో మరణించగా, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపాన్ని తెలిపారు.



# విద్యుదాఘాతనికి గుర్రై వ్యక్తి దుర్మరణం

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్



రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం తెర్లుమద్ది గ్రామంలో శనివారము బైతీ రాజయ్య (50), ఇంట్లోనే విద్యుత్ ఘాతానికి గుర్రై, దుర్మరణం చెందినట్లుగా గ్రామస్తులు తెలిపారు. ఇల్లు కడుగుతుండగా ఎనామిల్ తెగిన సర్వీస్ వైర్ కారణంగా విద్యుత్ షాక్ ఏర్పడినట్లుగా తెలిపారు. మృతునికి అవివాహిత ఇద్దరు కుమార్తెలు, ఒక కొడుకు ఉన్నారు. ఈ ఘటనపై ఎస్సై చిందం గణేష్ దర్యాప్తు చేపట్టారు. సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

# ప్రతి పేద వారికి ఇల్లు ఇదే కాంగ్రెస్ లక్ష్యం

## - మానాల మోహన్ రెడ్డి

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి

నిజామాబాద్ బ్యూరో



ప్రతి పేదవారికి ఇల్లు ఉండాలని లక్ష్యంతో ప్రభుత్వము ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రభుత్వం చేపట్టిందని నిజామాబాద్ డిసిసి అధ్యక్షులు, రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి నర్సింగ్ రావు తో కలిసి కోరుట్ల నియోజకవర్గం మల్లాపూర్ మండల కేంద్రంలో 718 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరి పత్రాలను అందజేస్తూ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి సంక్షేమ పథకాలను చేపట్టిందని, ఆరు గ్యారెంటీలను అమలు చేసిందని తెలిపారు. స్థానిక శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారని ప్రభుత్వం ఏం చేయడం లేదని ఆరోపించారని అన్నారు. ఆయన బయట తిరిగితే కాంగ్రెస్ చేసిన అభివృద్ధి పనులు కనిపిస్తాయని అన్నారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి నర్సింగరావు కు కాంగ్రెస్ అధిష్టానంలో మంచి గుర్తింపు ఉందని ప్రజా సమస్యలపై మమేకంగా పనిచేస్తారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు, గృహ జ్యోతి, 500 కే సిలిండర్, 10 లక్షలకు ఆరోగ్యశ్రీ పెంపు, రెండు లక్షల రుణమాఫీ రాజీవ్ యువ వికాసం ద్వారా రుణాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. స్థానిక శాసనసభ్యుడు గ్రామంలోకి వస్తే ఇందిరమ్మ ఇండ్ల విషయంలో నిలదీయాల్సిన బాధ్యత మీ పైన ఉందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి గత ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలు కడుతూనే మరొకవైపు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు ముందుకు తీసుకు వెళుతున్నారని, ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను నెరవేరుస్తారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కోసం రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సరైన వ్యక్తిని ఎన్నుకొని గెలిపించడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం అందించే ప్రతి పథకం మీ ఇంటికి చేరవేసే విధంగా నర్సింగ్ రావు, మీరు గెలిపించిన కాంగ్రెస్ పార్టీ స్థానిక ప్రజా ప్రతినిధులు ఉంటారని మానాల మోహన్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో మల్లాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, మండల నాయకులు తిరుపతి రెడ్డి, మల్లాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సీతక్క, రాష్ట్ర ఎన్ ఎస్ యు ఐ ప్రధాన కార్యదర్శి వేణు రాజ్, మాజీ ఎంపీపీ రాజయ్య, సురేష్, పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నా

# కలెక్టర్..10 మందికి నష్టపరిహారం చెక్కులు అందజేత

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

వేములవాడ పట్టణంలో రోడ్డు విస్తరణలో భూములు కోల్పోతున్న నిర్వాసితులకు శనివారం కలెక్టర్ సందీప్ కుమార్ ఝ, ఆర్డీవో రాదాబాయితో కలిసి చెక్కులు పంపిణీ చేశారు. వేములవాడ తిప్పాపూర్ బ్రిడ్జి నుంచి శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం వరకు రోడ్డు విస్తరణ చేపట్టనున్న సందర్భంగా భూములు కోల్పోతున్న నిర్వాసితులకు కలెక్టరేట్లో చెక్కులు పంపిణీ చేశారు. వేములవాడలోని 10 మందికి చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# గోశాలలో సిబ్బంది నియామకానికి ఇంటర్వ్యూలు

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన గోశాలలో సిబ్బంది నియామకానికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. రాజన్న ఆలయానికి సంబంధించిన వేములవాడ సమీపంలోని తిప్పాపూర్ గోశాలలో సిబ్బంది నియమాకానికి ఇటీవల అధికారులు నోటిఫికేషన్ విడుదల చేసి దరఖాస్తులు ఆహ్వానించారు. ఈ పోస్టులకు దాదాపు 250 మంది దరఖాస్తు చేసుకోగా, శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్లో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, జిల్లా ఉపాధి కల్పనాధికారి రాఘవేందర్ అధికారులు కలిసి, ఇంటర్వ్యూలు నిర్వహించారు. విద్యార్హత, పని అనుభవం తదితర వివరాలను అభ్యర్థుల నుంచి అడిగి తెలుసుకున్నారు. 40 మందిని ఎంపిక చేసి త్వరలో వారికి నియామక పత్రాలు అందజేయనున్నట్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వెల్లడించారు. నూతన సిబ్బంది



నియామకంతో గోశాలలో కోడెల సంరక్షణ, పరిసరాల పరిశుభ్రత తదితర సమస్యలు పరిష్కారం కానున్నాయని వివరించారు.

# నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలి ఎమ్మెల్యే జీ ఎం ఆర్

సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం

అమీన్పూర్ లో శనివారం ఘనంగా జరిగిన వనమోత్సవంలో పాల్గొన్న పటాన్చెరు శాశనసభ్యులు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి భవిష్యత్తు తరాలకు ఆరోగ్యకరమైన ఆహ్లాదకరమైన వాతావరణం అందించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాల్సిన గురుతర బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని చక్రపురి కాలనీలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మున్సిపాలిటీలలో నిర్వహిస్తున్న వందరోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా వన మహోత్సవం మొక్కలు నాటుదాం కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మొక్కలు నాటారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కల పెంపకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు ప్రభుత్వ ప్రైవేటు ఖాళీ స్థలాలతో పాటు పార్కులు గేటెడ్ కమ్యూనిటీలు దేవాలయాలు పరిశ్రమల ఆవరణలో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని కోరారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి అమీన్పూర్ మాజీ ఎంపీపీ దేవానందం మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి మున్సిపల్ కమిషనర్ జ్యోతి రెడ్డి మాజీ ప్రజా ప్రతినిధులు సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు అనంతరం అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని చక్రపూరి కాలనీలో రిటైర్డ్ ఉద్యోగులు తమ సొంత నిధులతో నిర్మిస్తున్న శివాలయాన్ని ఎమ్మెల్యే జిఎంఆర్ పరిశీలించారు రాబోయే రోజుల్లో ఆలయ నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు



# రక్త దాతల దినోత్సవం సందర్భంగా రక్త దానం చేసిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు రావుల శంకర్

సమయజ్యోతి న్యూస్ జూన్ 14 బజార్ హత్నూర్

ప్రపంచ రక్త ధాతల దినోత్సవం సందర్భంగా శనివారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రం రిమ్స్ లోని ఆడిటోరియం లోఉపాద్యాయులు రావుల శంకర్,అప్పాల శ్రీనివాస్ రెడ్డి లు రక్తధానం చేశారు.రక్తధాన శిబిరాన్ని జిల్లా పాలనాదికారి రాజర్షి షా ప్రారంభించారని రావుల శంకర్ అన్నారు.జిల్లా కలెక్టర్ ఎన్నిసార్లు రక్తధానం చేశారని అడగగా పదిహేడవ సారి అని చెప్పడంతో ఈ వయస్సులో కూడా రక్తధానం చేయడం గొప్పతనమని ఉన్నారన్నారు.ఇలాంటి సేవాకార్యక్రమాలు అందరు చేయాలని సూచించారు.అనంతరంరక్త దాతల కు సర్టిఫికెట్ ను అందజేశారు



# తెలంగాణలో స్థానిక సందడి

## మంత్రుల ప్రకటనలతో నేతల అలర్ట్-గ్రామాల్లో ఊపందుకోనున్న రాజకీయ వేడి

హైదరాబాద్,జూన్14(సమయజ్యోతి):

తెలంగాణలో స్థానిక సంస్థలకు త్వరలోనే ఎన్నికలంటూ మంత్రులు అడపాదడపా ప్రకటనలు చేస్తున్నారు. గెలిచేది తామేనని కూడా ప్రకటిస్తున్నారు. ఈ క్రమంలో జూన్, జూలై మధ్య ఎన్నికలకు అవకాశాలు మెండుగా ఉన్నాయి. సర్పంచ్, ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికలను నిర్వహించేలా లోలోపల వేగంగా పావులు కదుపుతున్నాయని అనుకోవచ్చు. ఇటీవల మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, సీతక్క తదితరులు వరుస ప్రకటనలు చేస్తున్నారు. అలాగే రెవెన్యూ సదస్సుల పేరుతో మంత్రులు జిల్లాల పర్యటనలు చేసేస్తున్నారు. ఇదంతా ఓ రకంగా ప్రజల్లో తమ బలాన్ని మరింత పెంచుకునేలాచేసే యత్నమని గుర్తించాలి. ఈ క్రమంలో గ్రామాల్లో రాజకీయ వేడి రాజుకుంటోంది. కొన్ని రోజులుగా రాజకీయ పార్టీల సందడి జోరుగా కనిపిస్తోంది. ఇప్పటికిప్పుడు ఎన్నికలు లేకున్నా ఖాళీగా కూర్చునే ఆలోచనలో లేరు. పార్టీలన్నీ ఏదో ఓ కార్యక్రమంతో ప్రజల్లోకి వెళుతున్నాయి. నిత్యం ప్రజల్లోనే ఉంటున్నాయి. నేతలంతా ఏదో ఒక కార్యక్రమంలో ముందుకు సాగుతున్నారు. తెలంగాణలో బిజెపి, కాంగ్రెస్, బిఆర్ఎస్ కూడా నిత్యం కార్యక్రమాలతో ప్రజల్లోకి వెళుతోంది. ఇలా జిల్లాలో ప్రధాన రాజకీయ పక్షాలు ప్రజాక్షేత్రంలోకి వెళ్లి బలోపేతం కావడానికి ప్రయత్నాలు చేస్తున్నాయి. ఒక్కో పార్టీ ఒక్కో పేరిట ప్రజల్లోకి వెళ్లి తమ వాణిని వినిపిస్తున్నాయి. బిఆర్ఎస్ దీనిని బాగా ఉపయోగించుకుంటోంది. తెలంగాణ మొత్తం అభివృద్ధి చెందిందన్న ప్రచారంతో ప్రజలను బురిడీ కొట్టిస్తోంది. తెలంగాణ సస్యశ్యామలం కావడమే గాకుండా బంగారు తునకగా మారిందన్న ప్రచారంతో నేతలు, అధినేతలు తరిస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీలు కూడా పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా నేరుగా ఓటరు వద్దకు వెళుతున్నాయి. ఎమ్మెల్యేలు జనంలో ఉండాలన్న అధికార పక్షం ఆదేశాన్ని తూచా తప్పకుండా పాటిస్తున్నారు. ప్రజల మధ్య ఉంటూ తమ గెలుపునకు వ్యూహ రచన చేస్తున్నారు. ప్రతిపక్ష ఆశావహులు సైతం గెలుపు కోసం అనుసరించాల్సిన వ్యూహాలను సిద్ధం చేసుకుంటున్నారు. దీంతో పల్లెల్లో స్థానిక ఉన్నికల హడావిడి కనిపిస్తోంది. నిత్యం ఎదో ఒక పార్టీ నేత, ఏదో ఒక కార్యక్రమం పేరిట ప్రజల వద్దకు వస్తున్నారు. తమ తమ ప్రభుత్వాల పాలన, పార్టీ కార్యక్రమాలు, లక్ష్యాలు, పనితీరును వివరించడానికి నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. స్థానికి ఎన్నికల ఊహాగానాలు వినిపిస్తున్న నేపథ్యంలో రాజకీయ నాయకులు తమ దూకుడును పెంచుతున్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో హడావిడి స్పష్టంగా కనిపిస్తోంది. ప్రభుత్వ పథకాలపై బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, పార్టీ ప్రజా ప్రతినిధులు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. విమర్శలు చేస్తున్నారు. మంత్రులు రెవెన్యూ సదస్సులు ఇతర కార్యక్రమాల్లో భాగంగా ఊరూవాడ చుట్టేస్తున్నారు. కార్యక్రమాల్లో భాగంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ ఇతర ప్రజాప్రతినిధులు ప్రజలతో భాగస్వామ్యమై కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇకపోతే విపక్ష బిఆర్ఎస్ గతంలో కెసిఆర్ సర్కార్ చేపట్టిన పథకాలను వివరించడం, లబ్దిదారులకు కల్యాణ లక్ష్మి, షాధీ ముబారక్, సీఎం సహాయ నిధి వంటి పథకాలు అటకెక్కాయని విమర్శలు చేస్తున్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పదకొండేళ్ల పాలనపై బీజేపీ నేతలు ప్రచారం నిర్వహిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తున్నారు. స్థానిక నేతలు నియోజకవర్గాల పరిధిలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అరాచక పాలన అందిస్తోందని విమర్శిస్తూనే కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమాలు, పథకాలు, అభివృద్ధి పనులను వివరిస్తున్నారు. మొత్తంగా అన్ని పార్టీలు ఇప్పుడు ప్రజల్లో ఉంటున్నాయి. తమ ఘనతను చాటుతున్నాయి. తామే బెటర్ అని చెప్పుకుంటున్నాయి.

# నైరుతి మందగమనంతో వర్షాలు ఆలస్యం

## రైతన్నన్నను కుంగదీస్తున్న వర్షాభావం-తొలకరి ఆలస్యంతో రైతుల్లో ఆందోళన

హైదరాబాద్,జూన్14(సమయజ్యోతి):

ప్రస్తుత వాతావరణం చూస్తుంటే ఇంకా ఎండాకాలం ఉందా లేక వానాకాలమేనా అన్నట్లుగా ఉంది. రుతుపవనాలు వచ్చి పక్షం రోజులు దాటినా పూర్తిస్థాయిలో వర్షాలు కురియడం లేదు. వర్షాలు ముఖం చాటేయడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. తొలకరి రాక ఆలస్యం కావడంతో ఇప్పటికే దుక్కులు దున్ని విత్తనాలు వేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. కొన్నిచోట్ల పత్తి నాటుకున్నారు. దీంతో ఆ రైతుల్లో ఆందోళన తీవ్రం అవుతోంది. గత వారంరోజులుగా వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు. అయితే మండుటెండలు, వడగాల్పులు చూస్తుంటే మరో వారం దాకా తొలకరి చిలకరించే పరిస్థితి కానరావడం లేదు. ఇప్పటికే నైరుతి తొందరగా వచ్చింది. అయినా సకాలంలో వర్షాలు కరియడం లేదు. దీంతో సాగు భూములకు నీరు లేక నెర్రెలు బారుతున్నాయి. తొలకరి వర్షాలతో విత్తనాలు మొలకెత్తాల్సిన సమయమిది. వర్షాలు లేకపోవడం వల్ల మొలిచిన మొక్కలు ఒక పక్క ఎండుతుండగా, మరో పక్క సాగు భూములు నెర్రులు పడుతున్నాయని రైతులు వాపోతున్నారు. కనీసం ఒక్క చినుకైనా గట్టిగా కురియకపోతే విత్తులు మురిగిపోవడం ఖాయంగా కనినిస్తోంది.మృగశిర కార్తె ప్రారంభంలోనే వర్షాలు కురియడం ఆనవాయితీ. అప్పుడే విత్తనాలు వేస్తారు. ఓ వైపు వ్యవసాయాధి కారులు హెచ్చరిస్తున్నా వినలేదు. దుక్కులు దున్ని చాలా మంది రైతులు విత్తనాలు నాటుకునేందుకు సమాయత్తం అవుతున్న తరుణంలో వర్షాలు లేకపోవడంతో రైతులు ఆకాశం వైపు ఆందోళనతో చూస్తున్నారు. ఇక మొలచిన మొక్కలను బతికించుకొనేందుకు రైతులు పడుతున్న బాధలు వర్ణణాతీతం. వర్షాధారంపైనే ఆధారపడిన రైతులు అష్టకష్టాలు పడుతన్నారు. ఖరీఫ్ ప్రారంభంలోనే అన్నదాతలకు కష్టాలు వెంటాడుతుండటంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. చాలాచోట్ల ఎక్కువ మంది రైతులు వాణిజ్య పంట అయిన పత్తి పంటనే సాగు చేస్తారు. వర్షాకాలం ప్రారంభంలోనే రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి ఖరీఫ్‌కు సిద్ధమయ్యారు. ఈసారి వర్షాలు ఆలస్యం కావడంతో ఎప్పుడు పడతాయోనని వాపోతున్నారు. నైరుతి రుతుపవనాలు మే నెలాఖరుకే రాష్ట్రాన్ని తాకాయి. రెండు రోజుల్లో తెలంగాణలోని మరికొన్ని జిల్లాలకు, ఆ తర్వాతి రెండు రోజుల్లో రాష్ట్రమంతా విస్తరిస్తాయని వెల్లడించింది. వాతావరణంలో వచ్చిన మార్పుల నేపథ్యంలో రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు కాస్త తగ్గాయి. రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాల రాకతో పలు జిల్లాల్లో వానలు పడ్డాయి. ఉరుములు, మెరుపుతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిశాయి. భారీ వర్షాలు కురిసే చాన్స్ ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

# దేశానికి ఆదర్శం కాళేశ్వరం

## దానిని ఉపయోగించే పని చేయండి-మాజీమంత్రి వేముల సూచన

నిజామాబాద్,జూన్14 (సమయజ్యోతి):

తెలంగాణలో గత సిఎం కెసిఆర్ అనుసరించిన రైతు విధానాలను కాంగరెస్ పాటించివుంటే రైతులకు ఇన్ని కష్టాలు వచ్చివుండేవి కావని మాజీమంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. కాళేశ్వరంను ఎలా ఉపయోగించుకోవాలో కూడా వీరికి తెలియడం లేదన్నారు. రైతులకు సాగునీరు, పెట్టుబడి పథకం,బీమా పథకం అమలు చేయడం, పండిన ధాన్యం కొనుగోలు చేయడం వంటి పథకాలు పక్కాగా అమలయితే దేశంలో కరువు కాటకాలు ఉండవన్నారు. రైతులు ఆత్మహత్యలకు పాల్పడరని అన్నారు. ఇప్పటికే తెలంగాణ వ్యవసాయ రంగంలో ఓ రోల్ మాడల్‌గా నిలిచిందని అన్నారు. రైతుబీమా పథకం దేశానికే మార్గదర్శకంగా మారనుందని అన్నారు. వ్యవసాయాన్ని పండుగ చేయాలని తపించిన కెసిఆర్ రైతును రాజు చేయడమే లక్ష్యంగా అనేకానేక చర్యలు తీసుకుని ముందుకు నడిపించారని అన్నారు. అయితే కాంగ్రెస్ ఇవన్నీ పక్కన పెట్టి కాళేశ్వరంపై బురదజల్లే చర్యలకు ఉపక్రమించిందని అన్నారు. తెలంగాణ రైతులకు అండగా ఉంటూ వ్యవసాయరంగంలో నంబర్‌వన్ రాష్ట్రంగా నిలిపిన ఘనత కెసిఆర్‌దని అన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రైతు బీమా అమలు చేసిన ఏకైక రాష్ట్రం మనదేనని అన్నారు. ఏ కారణం చేతనైనా రైతు మరణిస్తే నామినీకి పది రోజుల్లో రూ.5 లక్షల ఇన్సూరెన్స్ అందించామని చెప్పారు. అందుకే ఈ పథకాలను తెలుసుకున్న దేశంలోని అన్ని రాజకీయపార్టీలు కేసీఆర్‌ను కొనియాడాయన్నారు. రైతుల కష్టాలు తెలిసిన కేసీఆర్ రైతుబీమా పథకాన్ని అమలులోకి తీసుకువచ్చారని అన్నారు. కాళేశ్వరంలో నీళ్లు ఎలా లిఫ్ట చేయాలో తెలియక పొలాలు ఎండబెట్టారని, ప్రాజెక్టుల్లో నీరు చేరకుండా చేశారని అన్నారు. కాళేశ్వరం సహా చేపట్టిన అన్ని ప్రాజెక్టులు పూర్తయితే ఇక సాగునీటికి ఢోకా ఉండదన్నారు. ఇప్పటికే చెరువుల పునరుద్దరణ కారణంగా జలకళను సంతరించుకున్నాయని అన్నారు. దీంతో సేద్యం అన్నది రైతుకు భారం



కాబోదన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో రైతు సంక్షేమ కార్యక్రమాలు ప్రారంభించుకుని, అమలు చేసుకున్నామని పేర్కొన్నారు. ఎన్నో ఇబ్బందులను అధిగమించి ముందుకు సాగుతుంటే కాంగ్రెస్ వాళ్లు కన్నీళ్లు పెట్టుకుంటున్నారని మండిపడ్డారు. రైతులు ఇబ్బందులు ఎదుర్కోకుండా విత్తనాలు, ఎరువులు ముందుగానే స్టాక్ పెట్టాలని పేర్కొన్నారు. పండిన పంటకు మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. తెలంగాణలో 24గంటల కరెంట్, నీళ్లు, పెట్టుబడి, ఎరువులు, విత్తనాలు ఇవ్వాలని అన్నారు.

# వైభవంగా ప్రసన్న వేంకటేశ్వరుడి రథోత్సవం

తిరుపతి,జూన్14 (సమయజ్యోతి):

తిరుపతి అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం 9.00 గంటలకు శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి రథోత్సవం వైభవంగా సాగింది. రథోత్సవంపై శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి విహరించి భక్తులను అనుగ్రహించారు. ఉదయం 7 - 8.30 గం.ల మధ్య పుణ్యాహవచనం, నవగ్రహపూజ చేపట్టారు. తదుపరి రథారోహణం, నిర్వహించారు. 09.00 - 10.30 గం.లకు భక్తజనసమోహం మధ్య రథోత్సవం చేపట్టారు. సాయంత్రం ఊంజల్ సేవ, అశ్వవాహనంపై స్వామి వారు భక్తులను ఆశీర్వదించనున్నారు.ఆదివారం ఉదయం పల్లకీ ఉత్సవం జరుగనుంది. తదుపరి స్నపన తిరుమంజనం చేపడుతారు. అనంతరం ఉదయం 10.30 - 10.45 గం.ల వరకు తీర్థవారి చక్రస్నానం నిర్వహిస్తారు. సాయంత్రం శ్రీవారి మాడవీధి ఉత్సవం జరుగుతుంది. రాత్రి ఏడుగంటలకు ధ్వజావరోహణతో శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ముగియ నున్నాయి. వాహన సేవలో టిటిడి డిప్యూటీ- ఈవో హరీంద్రనాథ్, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, అర్చకులు, శ్రీవారి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.



# కాళేశ్వరం ముందు అంతా కాకమ్మ కబుర్లు

## అంచనాలు పెంచడంపై కమిషన్ నిజాలు రాబట్టాలి

## మాజీ ఎమ్మెల్సీ ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ డిమాండ్

హైదరాబాద్,జూన్14(సమయజ్యోతి):

కాళేశ్వరంపై విచారణ జరుపుతున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఎదుట విచారణకు ఇటీవల హాజరైన వ్యక్తులు.. క్యాబినెట్ నిర్ణయం మేరకే అంతా జరిగిందని చెప్పారని భాజపా నేత ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. తప్పించుకోవడానికే ఇలా కాకమ్మ కథలు చెప్పారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ బహిరంగ విచారణ వద్దని అనడంలోనే అసలు ఉద్దేశం తెలుస్తోందన్నారు. బండారం బయట పడుతుందని అలా అడిగారని చెప్పారు. అప్పటి సీఎం కేసీఆర్ తప్పులు జరుగుతున్నా సరిచేయలేదని దుయ్యబట్టారు. కాళేశ్వరం బ్యారేజీలు కుంగిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. తమ్మిడిహట్టి నుంచి ప్రాజెక్ట్ లొకేషన్‌ను రాజకీయ కారణాలతోనే మార్చారు. అంచనాలు పెంచడంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ సమాధానాలు రాబట్టాలన్నారు. గత ప్రభుత్వ అవినీతిని బయటపెట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరుతున్నామని అన్నారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం లేదు. షెడ్యూల్ వెంటనే విడుదల చేయాలి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి ఖాయం అని ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు.

# విమాన ప్రమాదాలు జరక్కుండే అప్రమత్తం

## అంతర్గత ఆడిటింగ్‌లు..ప్రత్యేక తనిఖీలు

## ఎయిరిండియా బోర్డు నిర్ణయం

న్యూఢిల్లీ,జూన్14(సమయజ్యోతి):

గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిరిండియా విమాన ప్రమాదం ఎన్నో కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపింది. ఈ ఘటనపై యావత్ ప్రపంచం దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తోంది. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ఉండేందుకు ఎయిరిండియా బోర్డు అప్రమత్తమైనట్లు తెలుస్తోంది. తమ అన్ని విమానాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు-సంబంధిత వర్గాలు వెల్లడించాయి. విమాన ప్రమాదంలో 274 మంది ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో అంతర్గత ఆడిట్ నిర్వహించాలని ఎయిరిండియా నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. విమానాల కండీషన్, వాటి నిర్వహణ పద్ధతులు, ఇలా వివిధ శాఖలపై సమీక్ష కూడా చేయించడంపై ఎయిరిండియా ఛైర్మన్, సీఈవో సిద్ధమయ్యారు. భద్రతా ఆడిట్ నిర్వహణకు ఎయిరిండియా బోర్డును ఆదేశించారని తెలుస్తోంది. అంతేకాకుండా ఈ ఘటనపై మరో విచారణ చేపట్టనుంది. ఉద్యోగుల నైపుణ్యాలను మెరుగుపరచడం, వారిని సమగ్ర శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందించడంపై దృష్టి పెట్టింది. విమాన ప్రమాదంపై అన్ని దర్యాప్తు సంస్థలకు సహకరిస్తామని ఎయిరిండియా పేర్కొంది. కాగా.. అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు నుంచి లండన్ బయల్దేరిన ఎయిరిండియా ఫ్లయిట్ నెంబర్ ఏఐ-171 విమానం ఇటీ-వల కూలిపోయిన సంగతి తెలిసిందే. రన్‌వే నుంచి టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ప్రమాదానికి గురైంది. మేఘాని నగర్ ఘోడాసర్ క్యాంప్ ప్రాంతంలో విమానం ఒక్కసారిగా కూలిపోయింది. ఈ ప్రమాదంలో 274 మంది మృతి చెందారు. అయితే.. ఈ ప్రమాదంపై స్వయంగా దర్యాప్తు చేపట్టేందుకు ఎయిరిండియా సిద్ధమైంది. ఇలాంటి ప్రమాదాలను నివారించేందుకు సమగ్ర తనిఖీలు చేపడుతోంది.

# చేవెళ్లలో ప్రభుత్వ భూముల్లో అక్రమ కట్టడాలు కూల్చేసిన రెవెన్యూ సిబ్బంది

హైదరాబాద్,జూన్14(సమయజ్యోతి):

గ్రేటర్ హైదరాబాద్ లో ఓ వైపు హైడ్రా,మరో వైపు రెవెన్యూ,జీహెచ్ఎంసీ అధికారులు అక్రమ నిర్మాణాలపై కొరడా ఝులిపిస్తున్నారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన కట్టడాలను రెవెన్యూ అధికారులు నేలమట్టం చేస్తున్నారు. కొన్ని చోట్ల పర్మిషన్ లేకుండా ఇష్టారాజ్యంగా భవనాలు,బిల్డింగ్ లు కడుతున్నారు. శనివారం రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. షాబాద్ మండల పరిధిలో హైతాబాద్ గ్రామం రెవెన్యూలోని సర్వే నెంబర్ 8 లో 42 ఎకరాల ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలను తొలగించారు షాబాద్ ఎమ్మార్వో, అధికారులు. ఇష్టానుసారంగా హైతాబాద్ లో ఉన్నటువంటి బడా నాయకులు డబ్బుల కోసం వేరే వ్యక్తులకు షాపులు వేసుకొని నెలసరి మామూలు ఇవ్వాలని డిమాండ్ చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయం అధికారులకు తెలియడంతో అధికారులు ప్రభుత్వ భూములలో అక్రమ కట్టడాలను జేసీబీ సాయంతో తొలగించారు. ఇలాంటివి జరగకుండా అక్రమ నిర్మాణాలను అరికట్టాలని గ్రామస్తులు ప్రభుత్వ అధికారులను కోరారు. నాలాలు ఆక్రమించి, ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా వెలిసిన నిర్మాణాల వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గత కొన్ని రోజుల నుంచి జీహెచ్ఎంసీ, రెవెన్యూ, హైడ్రా వీటిపైనే ఫోకస్ పెట్టింది. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తోంది. నాలాల్లో పేరుకుపోయిన చెత్త తొలగింపు

# వేగంగా పనులు పూర్తి చేయాలన్న హైడ్రా కమిషనర్

హైదరాబాద్,జూన్14(సమయజ్యోతి):

నగరంలోని నాలాల్లో పేరుకుపోయిన చెత్త తొలగింపు పనులు వేగవంతం చేయాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అధికారులను ఆదేశించారు. నాలాల్లో ఎక్కడా ఆటంకాలు లేకుండా చూడాలని, నాలా ఆక్రమణలుంటే తొలగించాలన్నారు. శుక్రవారం చింతల్‌బస్తీ మీదుగా సాగే బుల్కాపూర్ నాలా విస్తరణ పనులను ఆయన పరిశీలించారు. చింతలబస్తీలో మూడ్రోజుల క్రితం తొలగించిన నాలా ఆక్రమణల కింద భారీగా పేరుకుపోయిన పూడికను తొలగించాలన్నారు. శంకర్ పల్లిలోని బుల్కాపూర్ చెరువు నుంచి వచ్చే నాలా మియాఖాన్ గడ్డ, జన్వాడ, ఖానాపూర్, కోకాపేట, నార్సింగి, పుప్పాలగూడ, మణికొండ, రాయదుర్గం, ఓయూకాలనీ, షేక్ పేట, బీజేఆర్ నగర్, మహాత్మాగాంధీ నగర్, హఖీమ్సా విరాట్‌నగర్, బృందావన్ కాలనీ, టోలిచౌకి, మెహిదీపట్నం మిలటరీ ఏరియా, బంజారాహిల్స్ రోడ్డు నంబరు 12, చింతలబస్తీ, తుమ్మలబస్తీ, ఖైరతాబాద్ మీదుగా హుస్సేన్ సాగర్‌కు వరదనీరును తీసుకువస్తుంది. చింతల్ బస్తీలో ఇటీవల హైడ్రా అధికారులు నాలాల కబ్జాలను తొలగించే సమయంలో ధ్వంసమైన వాటర్ బోర్డు మెయిన్ పైప్ లైన్ ను అధికారులు రిపేర్లు చేసి నీటి సరఫరాను పునరుద్ధరించారు. ఈ పనులను ఎండీ అశోక్ రెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హైడ్రా నాలా ఆక్రమణ తొలగింపు సందర్భంగా బంజారాహిల్స్ సంప్ ఔట్ లెట్ నుంచి మసాబ్ ట్యాంక్, ఏసీ గార్డ్స్ కు మంచినీటిని సరాఫరా చేసే 300 ఎంఎం డయా పైప్‌లైన్ దెబ్బతిన్నది. స్పందించిన అధికారులు రిపేర్లు పూర్తి చేసి సరఫరా పునరుద్ధరించారు. అంతకు ముందు ప్రభావిత ప్రాంతాల ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉచిత ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేశారు.


# కాళేశ్వరం ఓ పనికిరాని ప్రాజెక్ట్

## దానికోసం డబ్బులు వృధా చేయరాదు

## అన్నీ తానే అన్న కెసిఆర్ ఇప్పుడు కేబినేట్ అంటున్నారు

## విమర్శలు గుప్పించిన సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని

హన్మకొండ,జూన్14(సమయజ్యోతి): ప్రజాధనాన్ని ఇకపై కాళేశ్వరం కోసం ఖర్చు చేయొద్దని సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఈ మేరకు కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కూనంనేని సాంబశివరావు కీలక వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు పనికిరాదని, దాన్ని పూర్తిగా రద్దు చేయాలని అన్నారు. కూనంనేని మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వరానికి అన్నీ తానే అన్న మాజీ సిఎం కెసిఆర్ ఇప్పుడు సంబంధం లేదంటున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం నిర్మించాక ఒక్క ఎకరాకు అదనంగా నీళ్లు ఇవ్వలేదని, ఎల్లంపల్లి ద్వారానే పంటలకు నీళ్లు అందుతున్నాయని తెలియజేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ పనికిరాదని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌ని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజల సొమ్మును ఇకపై కాళేశ్వరం కోసం ఖర్చు చేయొద్దని సూచించారు. కేసీఆర్ అంటే కాళేశ్వరం.. కాళేశ్వరం అంటే కేసీఆర్ అన్నోళ్లు ఇప్పుడు నోరు మూసుకున్నారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయంలో అన్నీ తానే అన్న కేసీఆర్ ఇప్పుడు తనకు సంబంధం లేదని ఎందుకు అంటున్నారని ప్రశ్నల వర్షం కురిపించారు. మహారాష్ట్ర పర్మిషన్ ఇవ్వలేదని మాజీ మంత్రి హరీష్‌రావు అంటున్నారని చెప్పారు. గతంలో 140మీటర్ల ఎత్తులో తుమ్మిడిహెట్టి దగ్గర ప్రాజెక్ట్ కట్టాలని తాము డిమాండ్ చేశామని గుర్తుచేశారు. కాళేశ్వరం నిర్మించాక ఒక చుక్కనీరు అదనంగా ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. పంటలకు వచ్చేవి ఎల్లంపల్లి నీళ్లేనని స్పష్టం చేశారు కూనంనేని సాంబశివరావు. కేంద్రప్రభుత్వం మానవ హక్కులను ఉల్లంఘిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మావోయిస్టుల మృతదేహాలను చూసి కూడా కేంద్రం భయపడుతోందని, మృతదేహాన్ని అప్పగించకపోవడం దారుణమని కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితఎపిసోడ్ ఇప్పుడు రాజకీయాల్లో ఒక కొత్త చర్చకు దారితీసింది. తాజాగాకూనంనేని సాంబశివరావు షాకింగ్ కామెంట్స్ చేశారు. కవిత ప్రకటనతో బీఆర్ఎస్, బీజేపీ పార్టీల మధ్య ఉన్న రహస్య ఒప్పందం బయటపడిందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్ షర్మిల స్థితిగతులు ఎలా ఉన్నాయో.. తెలంగాణలో కవిత పరిస్థితి కూడా అలాగే ఉందని ఆయన విమర్శించారు. పేదలు లేని దేశంగా ఇండియాని చూపాలని మోదీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు.



నెలకు రూ.8 వేల ఆదాయం ఉంటే ధనికులు ఎలా అవుతారని ప్రశ్నించారు. పేదలను మోదీ ప్రభుత్వం దగా చేస్తోందని ఫైర్ అయ్యారు. నెలకు రూ. 20వేల ఆదాయం ఉన్నా కూడా పేదవారిగానే పరిగణించాలని కూనంనేని సాంబశివరావు కోరారు.

# నూనె శ్రీధర్ కేసులో కూపీ లాగుతున్న ఎసిబి

## ఉన్నతాధికారి ఆదేశాలను బేఖాతర్ చేసినట్లు గుర్తింపు

హైదరాబాద్,జూన్14(సమయజ్యోతి): అక్రమాస్తుల కేసులో అరెస్ట్ అయిన కాళేశ్వరం ఎస్ఈసీ నూనె శ్రీధర్ వ్యవహారంలో సంచలన అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. నూనె శ్రీధర్ వ్యవహారంలో మరి కొంతమంది ఇరిగేషన్ అధికారుల పాత్ర ఉన్నట్టుగా ఏసీబీ దర్యాప్తులో బయటపడింది. 2024 జూన్ 27న నూనె శ్రీధర్‌ను ఇరిగేషన్ చీఫ్ ఆఫీస్‌లో రిపోర్ట్ చేయాలని ఇరిగేషన్ ప్రిన్సిపాల్ సెక్రటరీ రాహుల్ బొజ్జా ఆదేశించారు. అయితే ఇరిగేషన్ ప్రిన్సిపాల్ సెక్రటరీ ఆదేశాలను కూడా నూనె శ్రీధర్ పక్కకు పెట్టినట్లు తెలుస్తోంది. ట్రాన్స్‌ఫర్ అయినప్పటికీ కూడా ఏడాది పాటు చొప్పదండిలోనే ఈఈగా శ్రీధర్ పని చేస్తున్నట్లు ఏసీబీ గుర్తించింది. ఈఎన్‌సీ అనిల్ ఆదేశాల మేరకే శ్రీధర్ అక్కడే పని చేసినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నూనె శ్రీధర్‌కు ఈఎన్‌సీ అనిల్‌కు ఉన్న సంబంధాలపై ఏసీబీ ఆరా తీస్తోంది. ఇరిగేషన్ చీఫ్‌గా ఉండి ప్రిన్సిపాల్ సెక్రటరీ చేసిన ట్రాన్స్‌ఫర్‌ను కూడా ఆపినట్టు- అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో నూనె శ్రీధర్‌ను కస్టడీకి తీసుకుని విచారించాలని ఏసీబీ నిర్ణయించింది. అలాగే ఈఎన్‌సీ అనిల్ పాత్రపైనా ఏసీబీ విచారణ జరిపే అవకాశం ఉంది. అక్రమాస్తుల కేసులో నూనె శ్రీధర్‌ను ఏసీబీ అరెస్ట్ చేయగా.. ఆయన చంచల్ గూడ జైలులో ఉన్నారు. శ్రీధర్‌కు సంబంధించిన అంశాలపై ఏసీబీ అధికారులు చాలా లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఎవరెవరితో సత్సంబంధాలు ఉన్నాయి, ఇరిగేషన్ శాఖ అధికారులతో నూనె శ్రీధర్‌కు ఉన్న సంబంధాలు ఏంటి.. ఇతనికి ఎవరైనా సహకారం అందించారా అనే కోణంలో దర్యాప్తు చేపట్టారు. ఈ సమయంలో పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఇటీవల శ్రీధర్‌కు సంబంధించి సుమారు 20 ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఈ సమయంలో కీలకమైన పత్రాలు, ఆస్తుల చిట్టాను స్వాధీనం చేసుకున్నారు. కొన్ని రోజుల క్రితం ఎంతో గ్రాండ్‌గా శ్రీధర్ తన కుమారుడి వివాహం జరిపించారు. హైదరాబాద్‌లో హల్దీ, సంగీత్ ఫంక్షన్లు నిర్వహించగా.. థాయిలాండ్‌లో వివాహం జరిపించారు. ఇందుకోసం శ్రీధర్ కోట్లు కుమ్మరించినట్లు తెలుస్తోంది. అయితే ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న శ్రీధర్‌కు ఇంత భారీ మొత్తంలో ఆస్తులు, ఆదాయం ఎలా సమకూరింది అనే అంశాలపై ఏసీబీ దృష్టి సారించింది.

# బనకచర్ల దోపిడీని అడ్డుకోవడంలో విఫలం

## ముఖ్యమంత్రి, నీటిపారుదల మంత్రుల నిర్లక్ష్యం

## -కేంద్రం చేయూతనిస్తుంటే ఎంపిలు ఏం చేస్తున్నారు

## నిలదీసిన మాజీమంత్రి హరీష్ రావు

హైదరాబాద్,జూన్14(సమయజ్యోతి): గోదావరి జలదోపిడీ జరుగుతుంటే ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లుగా ఉందని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. దీనిని తక్షణమే అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. కృష్ణా జలాలను అక్రమంగా తరలించడానికి పోతిరెడ్డిపాడు ఎలా మారిందో.. గోదావరి జలాలను తరలించుకుపోవడానికి బనకచర్ల అలా ఉపయోగపడుతుందని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. గోదావరి-బనకచర్ల లింక్ ప్రాజెక్ట్‌పై హరీశ్‌రావు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో ఏపీ ప్రభుత్వం ముందుకెళ్తుంటే తెలంగాణ సీఎం, నీటిపారుదలశాఖ మంత్రి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. బనకచర్ల ప్రాజెక్టు ఏపీ ప్రభుత్వం నిర్మిస్తుంటే.. మన ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు ఉంది. ఇప్పటికైనా కళ్లు తెరవండి. ఇంకా ఎక్కువ నష్టం జరగక ముందే గోదావరి-బనకచర్లను అడ్డుకోండి. కాంగ్రెస్ ప్రభుత్వం చేసే ఏ పోరాటానికైనా మేం మద్దతిస్తాం. మీరు ముందుకు రాకపోతే భారాస పెద్ద ఎత్తున పోరాటం చేస్తుందని హరీశ్‌రావు తెలిపారు. ఏపీ ప్రభుత్వం ఈ నెలాఖరుకు టెండర్లు పిలిచేందుకు సన్నద్ధమవుతుంటే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిద్రపోతోంది. ఇరిగేషన్ శాఖామంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉత్తుత్తి మాటలు మాట్లాడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం పెట్టడానికి రావట్లేదు. కేటీఆర్, ప్రతిపక్ష నేతలపై ఎలా కేసులు పెట్టాలనే దానిపైనే ప్రభుత్వానికి ధ్యాస తప్ప మరోటి లేదన్నారు. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడాలనే ఆలోచన ఈ ప్రభుత్వానికి లేదు. గత రెండు కేంద్ర బడ్జెట్లు చూస్తే ఆంధ్రప్రదేశ్‌కు నిధుల వరద.. తెలంగాణకు గుండు సున్నా. నిధులు ఆంధ్రాకే, నదులు ఆంధ్రాకే.. తెలంగాణకు సున్నా.. ఇదీ దిల్లీ పాలకుల వైఖరి అని విమర్శలు చేశారు. నిధుల్లో, నదుల్లో తెలంగాణకు అన్యాయం జరిగినా ఈ రాష్ట్రంలో ఉన్న 8మంది కాంగ్రెస్ ఎంపీలు, 8 మంది భాజపా ఎంపీలు నోరు విప్పడం లేదు. రాష్ట్రానికి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రుల నుంచి ఎలాంటి స్పందన లేదు. గోదావరి- బనకచర్లకు కేంద్రంలోని భాజపా ప్రభుత్వం నిధులు ఇచ్చి సహకరిస్తోంది. తెలంగాణ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసే హక్కు మీకు ఎవరు ఇచ్చారు. 2 టీ-ఎంసీల బాబ్లీ నీటి కోసం చంద్రబాబు 2008లో పెద్ద పోరాటం చేశారు. 200 టీఎంసీలతో అక్రమ ప్రాజెక్టు కడుతుంటే తెలంగాణ ప్రభుత్వం ఎంత పోరాటం చేయాలి. రాజకీయాల కంటే రాష్ట్ర భవిష్యత్తే భారాసకు ముఖ్యం అన్నారు.

# ఉగ్రమూకలకు ఎదురొడ్డి ప్రాణార్పణం

## మరణించిన ఆదిల్ షా భార్యకు ప్రభుత్వ ఉద్యోగం

శ్రీనగర్,జూన్14(సమయజ్యోతి): జమ్మూ కాశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలో జరిగిన పహల్గాం ఉగ్రవాద దాడి ఉదంతంలో ఎదురొడ్డి నిలిచిన ధీరుడి ఆత్మకు శాంతి కలిగే సంఘటన ఇది. పహల్గాంలో ఉగ్రవాదుల చేతిలో చిక్కుకున్న పర్యాటకులను రక్షించే ప్రయత్నంలో స్థానికుడైన సయ్యద్ ఆదిల్ హుస్సేన్ షా మరణించిన సంగతి తెలిసిందే. అతని కుటుంబ సభ్యులను జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఇవాళ కలుసుకున్నారు. దివంగత హుస్సేన్ షా భార్య గుల్నాజ్ అఖ్తర్‌కు ప్రభుత్వ ఉద్యోగమిస్తూ దానికి సంబంధించిన అపాయింట్‌మెంట్ లెటర్ అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు భారత సర్కారుకు ధన్యవాదాలు తెలిపారు. కాశ్మీర్ లోని ఒక పేద కుటుంబంలో జన్మించి, ఇంటర్ చదివిన ఆదిల్.. అమర్‌నాథ్ యాత్ర సమయంలో పహల్గాంకు వచ్చే పర్యాటకుల కోసం పోనీ గైడ్‌గా పనిచేసేవాడు. యాత్రికుల్ని గుర్రంపై తీసుకెళ్లి వాళ్లకి అక్కడి ప్రదేశాలు చూపిస్తూ, వాటి గురించి వివరించేవాడు. ప్రతీ రోజులానే ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న సమయంలో ఉగ్రమూక పర్యాటకులపై కాల్పులు జరుపుతోంది. దీంతో ఆదిల్ ఎంతో ధైర్య సాహసాలతో ఉగ్రవాదుల నుండి తుపాకీని లాక్కొని పర్యాటకుల్ని రక్షించడానికి తన వంతు ప్రయత్నం చేశాడు. దీంతో ఉగ్రమూక ఆదిల్‌ని గన్‌తో కాల్చి పొట్టన బెట్టుకున్నారు. కాగా, ఏప్రిల్ 22న పహల్గాంలో ఐదుగురు సభ్యుల ఉగ్రమూక, అక్కడి మైదానంలో విహరిస్తున్న పర్యాటకులపై కాల్పులు జరిపి 26 మందిని పొట్టనబెట్టు-కున్న సంగతి తెలిసిందే. ఈ మారణహోమానికి ఆదిల్ అహ్మద్ థోకర్ అనే వ్యక్తి కీలకంగా వ్యవహించినట్టు- గుర్తించారు. ఇతడు పాకిస్తాన్ లో శిక్షణ తర్వాత భారతదేశానికి తిరిగి వచ్చి ఇతర ఉగ్రవాదులతో సమన్వయం చేసుకుని, పర్యాటకులపై దాడికి పాల్పడ్డట్టు- సమాచారం. దీనికి ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ పేరిట పాకిస్థాన్ లోని ఉగ్రవాద స్థావరాలపై దాడి చేసి దాదాపు100 మంది ఉగ్రవాదుల్ని మట్టుపెట్టడం, తర్వాత ఇరుదేశాలు కాల్పుల విరమణకు అంగీకరించడం జరిగాయి.

# శుభాంశు శుక్లా అంతరిక్ష యాత్రకు రెడీ

## 19న స్పేస్ స్టేషన్‌కు ముహూర్తం ఖరారు

న్యూఢిల్లీ,జూన్14(సమయజ్యోతి): ఇండియన్ ఆస్ట్రోనాట్ గ్రూపు కెప్టెన్ శుభాన్షు శుక్లా అంతరిక్ష ప్రయాణానికి ముహూర్తం ఖరారైంది. జూన్ 19వ తేదీన ఆయన అంతరిక్ష ప్రయాణం చేయనున్నారు. ఫాల్కన్ 9 రాకెట్‌లో ఇంటర్‌నేషనల్ స్పేస్ స్టేషన్‌కు వెళ్లనున్నారు. అక్కడే 14 రోజుల పాటు ఉండనున్నారు. ఈ రాకెట్ గత నెలలోనే అంతరిక్షంలోకి వెళ్లాల్సి ఉండింది. అయితే, పలు కారణాల వల్ల ఐదుసార్లు ప్రయాణం వాయిదా పడింది. అన్ని అవరోధాలను దాటుకుని మరికొన్ని రోజుల్లో ఫాల్కన్ 9 అంతరిక్షంలోకి దూసుకెళ్లనుంది. ఫాల్కన్ 9 అంతరిక్ష ప్రయాణంపై ఇస్రో ఓ ప్రకటన విడుదల చేసింది. ఆ ప్రకటనలో.. 'ఫాల్కన్ 9లో లిక్విడ్ ఆక్సిజన్ లీకేజ్ సమస్య ఉందని గుర్తించాము. దాన్ని సరిచేశాము. జూన్ 19వ తేదీన ఫాల్కన్ అంతరిక్షంలోకి వెళ్లనుంది' అని పేర్కొంది. త్వరలో ఫాల్కన్ 9 రాకెట్‌లో అంతరిక్షంలోకి వెళుతున్న శుభాన్షు శుక్లాకు నాసా మాజీ ఆస్ట్రోనాట్ 64 ఏళ్ల డాక్టర్ విట్సన్ సాకారం అందిస్తున్నారు. డాక్టర్ విట్సన్‌కు 650 రోజులు అంతరిక్షంలో ఉన్న అనుభవం ఉంది. ఆమె శుభాన్షుకు సలహాలు, సూచనలు చేస్తున్నారు. ఒక వేళ శుభాన్షు విజయవంతంగా అంతరిక్షంలోకి వెళితే.. ఆయన పేరిట రికార్డు నెలకొననుంది. భారతదేశం నుంచి అంతరిక్ష ప్రయాణం చేసిన రెండో వ్యక్తిగా చరిత్రలో నిలిచిపోతారు. 1984లో మొదటి సారి భారత్‌కు చెందిన రాకేష్ శర్మ అంతరిక్షంలోకి వెళ్లి వచ్చారు.

# వరుసగా రెండోరోజూ ఎఐజి ఆస్పత్రికి కెసిఆర్

## జలుబు తదితర కారణాలతో వైద్య పరీక్షలు

హైదరాబాద్,జూన్14(సమయజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గచ్చిబౌలి ఏఐజీ ఆస్పత్రికి వైద్య పరీక్షల కోసం వెళ్లారు. గత కొంత కాలంగా జలుబుతో బాధపడుతున్న కెసిఆర్ ఆరోగ్య పరీక్షల కోసం శనివారం ఉదయం ఏఐజీ ఆస్పత్రికి వెళ్లారు. ఆయన వెంట కుటుంబసభ్యులు, మాజీ మంత్రి హరీష్ రావు, తదితరులు ఉన్నారు. శుక్రవారం కూడా ఆస్పత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకున్న కెసిఆర్ మరోసారి ఆస్పత్రికి వెళ్లారు. వైద్య పరీక్షలు పూర్తి అయిన తర్వాత నందీనగర్‌లోని నివాసానికి వెళ్లనున్నారు. ఐదు రోజుల పాటు- నందీనగర్ నివాసంలో కేసీఆర్ ఉండనున్నారు. ప్రతీ రెండు నెలలకు ఒకసారి కేసీఆర్ ఆస్పత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకుంటారు. గతంలో యశోదా ఆస్పత్రికి కేసీఆర్ తరచుగా వెళ్తుండేవారు. అయితే ఈసారి గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రికి వెళ్లారు. నిన్న సాయంత్రం ఎర్రవల్లి ఫాంహౌస్‌లోని ఆయన నివాసం నుంచి హైదరాబాద్ వచ్చిన కేసీఆర్.. ఏఐజీ ఆస్పత్రికి వెళ్లి వైద్యులను సంప్రదించారు. మళ్లీ ఈరోజు కూడా రావాల్సిందిగా వైద్యులు సూచించారు. వైద్యుల సూచనల మేరకు నేడు ఆస్పత్రికి వెళ్లి ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. గడిచిన ఏడాదిన్నర కాలంగా కేసీఆర్ ఎర్రవల్లి ఫాంహౌస్‌లోని ఆయన నివాసంలోనే ఉంటు-న్నారు. అందుబాటు-లో ఉండాలని వైద్యులు చెప్పిన నేపథ్యంలో బంజారాహిల్స్‌లోని నందినగర్‌లోనే ఉండనున్నారు. ఇక కాళేశ్వరం కమిషన్ విచారణకు ఈనెల 11న మాజీ సీఎం హాజరైన విషయం తెలిసిందే. ఆ సమయంలో కూడా తనకు జలుబు ఉందని కమిషన్ చైర్మన్ పీసీ ఘోష్‌కు చెప్పారు. ఓపెన్ కోర్టులో విచారణ వద్దని కేసీఆర్ కోరగా.. ఆయన వినతిని పరిగణలోకి తీసుకున్న కమిషన్ చైర్మన్ బహిరంగ విచారణను రద్దు చేశారు. ఇండోర్‌లోనే కేసీఆర్‌ను కమిషన్ ముఖాముఖిగా విచారించింది. ఇక అప్పటి నుంచి కూడా అనారోగ్యంతో కేసీఆర్ బాధపడు తున్నారు. ఈ క్రమంలో వైద్యపరీక్షల నిమిత్తం గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రికి మాజీ సీఎం కేసీఆర్ వెళ్లారు.

# అయోధ్యలో రామదర్బార్ దర్శనం

## భక్తులకు అనుమతించిన ట్రస్ట్

అయోధ్య,జూన్14(సమయజ్యోతి): ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య రామాలయం మొదటి అంతస్తులో రామ దర్బార్ ప్రాణ ప్రతిష్ఠ అనంతరం తొలిసారిగా భక్తుల సందర్శనకు అనుమతిస్తున్నారు. శనివారం నుంచి భక్తులను రామ దర్బార్ సందర్శనకు అనుమతించాలని ట్రస్ట్ నిర్ణయం తీసుకుంది. దీంతో శనివారం సాయంత్రం 5-7, 7-9 గంటల మధ్య రెండు స్లాట్లలో రామ దర్బార్‌ను సందర్శించేందుకు పరిమిత సంఖ్యలో భక్తులను అనుమతించాలని నిర్ణయించిట్టు శ్రీ రామ జన్మభూమి తీర్థ్ క్షేత్ర ట్రస్టు సభ్యులు అనిల్ మిశ్రా తెలిపారు. రామదర్బార్ ప్రతిష్ఠాపన జూన్ 5వ తేదీ ఉదయం 6 గంటలకు ప్రత్యేక పూజల అనంతరం మధ్యాహ్నం 1.25 నుంచి 1.40 గంటల మధ్య అభిజిత్ ముహూర్తంలో జరిగింది. రామాలయంలోని మొదటి అంతస్తులో రాముడు, సీత, లక్ష్మణుడు, భరతుడు, శత్రుఘ్నుడు, హనుమంతుడితో కూడిని రామదర్బార్ విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ఠ జరిగింది. వీటితోపాటు- ఆలయ ప్రాంగణంలో మరో ఏడు దేవాలయాల్లో విగ్రహాల ప్రాణప్రతిష్ఠ జరిగింది. రామ్‌లల్లా దర్శనం తరహాలోనే రామదర్బార్ దర్శనానికీ పాసులు జారీ చేస్తున్నామని అనిల్ మిశ్రా తెలిపారు. ప్రతి రెండు గంటలకు ఒక స్లాట్ ఉంటుందని, ఒక్కో స్లాట్‌కు 300 పాసులు జారీ చేస్తామని చెప్పారు. ఉదయం 7-9, 9-11, మధ్యాహ్నం 1-3, 3-5, సాయంత్రం 5-7, 7-9 వరకూ దర్శనం స్లాట్‌లు ఉంటాయని చెప్పారు.

# ఆధార్ అప్‌డేట్ గడువు పొడిగింపు

న్యూఢిల్లీ,జూన్14(సమయజ్యోతి): ఆధార్ అప్‌డేట్ చేసుకునే వారికి భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ ఉడాయ్ మరోమారు వెసలుబాటు కల్పించింది. ఆధార్ అప్‌డేట్ చేసుకునేందుకు ఇచ్చిన గడువును మరోసారి పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. సంబంధిత డాక్యుమెంట్లను ఉచితంగా అప్‌లోడ్ చేసుకునేందుకు ఇచ్చిన గడువు జూన్ 14వ తేదీతో..ముగియనుండగా ఉడాయ్ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఎక్స్ ఖాతా వేదికగా శనివారం వెల్లడించింది. ఈ నిర్ణయం వల్ల లక్షలాది మంది ప్రజలకు ప్రయోజనం చేకూరుతోందని స్పష్టం చేసింది. మై ఆధార్ పోర్టల్ ద్వారా ఉచితంగా ఈ డాక్యుమెంట్లను అప్ లోడ్ చేసుకోవచ్చు. ఆధార్ డేటాబేస్‌లో ప్రస్తుతం.. కచ్చితమైన సమాచారాన్ని ఉంచేందుకు ఆధార్ హోల్డర్లకు ఉడాయ్ ఈ అవకాశం కల్పిస్తోంది. గుర్తింపు పొందిన ఆధారాలు, చిరునామాకు సంబంధించిన పత్రాలను ఆన్‌లైన్‌లో ఉచితంగా అప్‌డేట్ చేసుకునేందుకు అనుమతిస్తోంది. వివాహం కావడం.. ఉన్నత చదువులు, తదితర కారణాల వల్ల కొందరు వేర్వేరు ప్రదేశాలకు మారుతూంటారు. అలాంటి వారికి ఇది ఉపయుక్తంగా ఉండనుంది. మరోవైపు ఆధార్ తీసుకుని పదేళ్లు పూర్తయ్యి ఉంటుందో వారు కూడా తమ వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని గతంలో ఉడయ్ సూచించిన సంగతి తెలిసిందే.

# సిఎంపై ఫిర్యాదు చేస్తే చర్యలు ఉండవా

## బిఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

హైదరాబాద్,జూన్14(సమయజ్యోతి): తెలంగాణ ప్రభుత్వంతో పాటు రాష్ట్ర పోలీసుల తీరుపై బీఆర్ఎస్ సీనియర్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఫార్ములా ఈ కేసులో సీఎం రేవంత్ రెడ్డి వల్ల రాష్ట్రానికి రావాల్సిన వేలాది కోట్ల రూపాయాల ఆదాయానికి గండి పడిందని నార్సింగి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాను. కానీ ఇంత వరకు సీఎంపై ఎఫ్ఐఆర్ నమోదు కాలేదు. కనీసం పోలీసులు ఫిర్యాదుదారునైన తనను విచారించకుండానే కేసు క్లోజ్ చేశారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గుర్తు చేశారు. సీఎం లేదా హోంమంత్రి మీద కేసు పెట్టకూడదని బీఎన్ఎస్ఎస్ చట్టంలో ఎక్కడైనా ఉందా? అని ఆర్ఎస్పీ ప్రశ్నించారు. ఉల్టా.. చేయని నేరానికి, ఫార్ములా వ్యవహారంలో ఒక తుఫైల్ ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేటీ-ఆర్‌కు నోటీ-సుల మీద నోటీసులు పంపుతున్నారు. ఎక్కడ పడితే అక్కడ ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తున్నారు. ఇదెక్కడి న్యాయం? సీఎంకు ఒక రూల్.. సామాన్యులకు మరో రూలా..? అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నిలదీశారు.


## రక్తదాన ప్రోత్సాహంలో విశేష సేవలు

### పెద్దపల్లి ఎసిపి గజ్జికృష్ణకు మోటివేటర్ అవార్డు

### గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందచేత

**పెద్దపల్లి,జూన్14(సమయజ్యోతి):**

ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ యాదవ్ తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా బెస్ట్ మోటివేటర్ అవార్డు అందుకున్నారు. పెద్దపల్లి ఏసీపీగా గజ్జి కృష్ణ యాదవ్ పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు- చేయడంతో పాటు- రక్తదాతలను ప్రోత్సహించడం, ఆయన గతంలో చేసిన సామాజిక సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ- సిఫారసు మేరకు రాజ్ భవన్ వర్గాలు ఏసీపీ గజ్జి కృష్ణ యాదవ్ సేవలను గుర్తించి, బెస్ట్ మోటివేటర్ అవార్డుకు ఎంపిక చేయడంతో ప్రజలకు విశేష సేవలు అందించిన పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ యాదవ్ శనివారం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న పెద్దపల్లి ఏసిపి గజ్జి కృష్ణ యాదవ్ కు పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలు అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ ప్రభుత్వంపై బిజెపికి ప్రేమ

### మాజీమంత్రి నిరంజన్ రెడ్డి విమర్శలు

**హైదరాబాద్,జూన్14(సమయజ్యోతి):**

కాంగ్రెస్, బిజెపిపై బిఆర్ఎస్ మాజీ మంత్రి నింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఫైరయ్యారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ముల్లుకుచ్చుకుంటే.. రాష్ట్ర బిజెపి నేతలకు నొప్పిలేస్తుందని అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, ప్రాజెక్టులలో జరుగుతున్న నష్టాల మీద రాష్ట్ర బిజెపి నేతలు, ప్రజా ప్రతినిధులు, కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదని మండిపడ్డారు. ప్రాజెక్టుల్లో నష్టాలపై ఎలాంటి కమిషన్లు వేయదని.. విచారణ కూడా చేయదన్నారు. శ్రీశైలం సొరంగం కూలినా.. సుంకిశాల రిటైనింగ్ వాల్ కూలినా.. వట్టెం పంప్ హౌస్ మునిగినా.. కేంద్రం ఎందుకు కమిషన్లు పంపడం లేదని మాజీ మంత్రి ప్రశ్నించారు. వాటి మీద విచారణకు రాష్ట్ర బిజెపి నేతలు ఎందుకు డిమాండ్ చేయరని నిరంజన్ రెడ్డి నిలదీశారు.

## ఎమ్మెల్యే వంటమనిషి ఆత్మహత్య

**యాదగిరిగుట్ట,జూన్14(సమయజ్యోతి):**

యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఇంట్లో సైదాపురం గ్రామానికి చెందిన రవి (38) అనే వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతను ఎమ్మెల్యే ఐలయ్య ఇంట్లో వంట మనిషిగా పనిచేస్తూ పై అంతస్థులోనే ఎన్నో ఏళ్లుగా ఉంటున్నట్లు స్థానికులు తెలిపారు. మృతుడు రవికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆత్మహత్యకు కుటుంబ కలహాలే కారణమని స్థానికులు తెలిపారు.

## ముగ్గురు మంత్రులకు ఛాంబర్ల కేటాయింపు

### త్వరలోనే అధికారిక విధుల్లోకి మంత్రులు

**హైదరాబాద్,జూన్14(సమయజ్యోతి):**

తెలంగాణ మంత్రివర్గంలో కొత్తగా చేరిన మంత్రులకు సచివాలయంలో చాంబర్ల ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ జీఏడీ చాంబర్ల కేటాయింపుపై ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల మంత్రివర్గంలోకి తీసుకున్న అడ్లూరి లక్ష్మణ్‌కు సచివాలయ మొదటి అంతస్తులో 13, 14, 15, 16 నంబర్ గదులు కేటాయించగా, మంత్రి వివేక్ వెంకటస్వామికి రెండో అంతస్తులో 20, 21, 22 నంబర్ గదులు లభించాయి. వాకిటి శ్రీహరికి రెండో అంతస్తులోనే 26, 27, 28 నంబర్ గదులు కేటాయించారు. ఇప్పుడు చాంబర్లు కేటాయింపుతో వీరు త్వరలోనే తమ శాఖల అధికారిక బాధ్యతలను స్వీకరించనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే వారికి శాఖల కేటాయింపులు కూడా పూర్తయ్యాయి. అడ్లూరి లక్ష్మణ్‌కు ఎస్సీ అభివృద్ధి, గిరిజన, మైనారిటీ- సంక్షేమం, దివ్యాంగులు, వృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల సాధికారత వంటి సామాజిక రంగాలకు సంబంధించిన కీలక శాఖలు అప్పగించగా, వివేక్ వెంకటస్వామికి కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీలు, మైనింగ్, జియాలజీ వంటి పారిశ్రామిక రంగాల శాఖలు లభించాయి. వాకిటి శ్రీహరికి పశుసంవర్ధక, పాడి అభివృద్ధి, క్రీడలు, యువజన సేవల శాఖలు కేటాయించారు. ఈ నేపథ్యంలో సచివాలయంలో వీరికి కేటాయించిన కొత్త కార్యాలయాలు త్వరలో బిజీగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. కొత్త మంత్రులతో కార్యాలయాల్లో కార్యకలాపాలు ఊపందుకునే అవకాశం ఉంది.

## విమాన ప్రమాద బాధితులకు 25లక్షల తక్షణ సాయం

**న్యూఢిల్లీ,జూన్14(సమయజ్యోతి):**

విమాన ప్రమాద బాధితులకు ఎయిర్ ఇండియా సంస్థ తక్షణ ఆర్థిక సాయం ప్రకటించింది. మధ్యంతర సాయం కింద బాధితులకు రూ.25 లక్షలు ఇవ్వనున్నట్లు ప్రకటించింది. బాధితులకు గతంలో టాటా సన్స్ ప్రకటించిన రూ. కోటి ఆర్థిక సాయానికి ఇది అదనమని పేర్కొంది. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఎయిర్ ఇండియా పోస్టు పెట్టింది. ఈ కష్ట సమయంలో బాధిత కుటుంబాలకు తాము అన్ని రకాలుగా అండగా ఉంటామని ఎయిర్ ఇండియా పేర్కొంది. బాధిత కుటుంబాలకు సాయం కోసం క్షేత్రస్థాయిలో తమ బృందాలు కృషి చేస్తున్నాయని తెలిపింది. ఇందులో భాగంగానే మధ్యంతర ఆర్థిక సాయం ప్రకటించినట్టు- వెల్లడించింది. ప్రమాద ఘటన తమను ఎంతో కలచివేసిందని పేర్కొంది.

# బీసీల జీవితాల్లో మార్పు కోసం ప్రయత్నిద్దాం

### ఓబీసీ పుస్తక ఆవిష్కరణ లో.. రాష్ట్ర ఖనిజ ఖనిజాభివృద్ధి

### -కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**




బీసీల్లో ఇప్పటికీ 90 శాతం మంది వెనుకబడి ఉన్నారు.. వారు బాగుపడొద్దా.. ఈ విషయంలో మనమందరం స్పందించాలి.. రాజకీయాలకు అతీతంగా పని చేద్దాం.. బీసీల జీవితాల్లో మార్పు కోసం ప్రయత్నిద్దామని రాష్ట్ర ఖనిజాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ పేర్కొన్నారు. ఆయన హైదరాబాదులో ఐఏఎస్ పి.నరహరి రచించిన "ఓబీసీ పోరుబాట" పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆయన మాటల్లో యథాతథంగా..ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను ఏ విధంగా అమలు చేశారు, వాటి పర్యవసానల గురించి జరగాల్సినంత చర్చ ఎప్పుడూ జరగలేదు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీలను ఎందుకు తొలగించారనే విషయం మీద కూడా చర్చ జరగలేదు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు..ఆర్థికంగా వెనుకబడిన వారిని నిర్దేశించినవి. అంటే ఆర్థికంగా వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ, బీసీలను కూడా ఆ రిజర్వేషన్లల కోసం పరిగణనలోకి తీసుకోవాలి. కానీ అలా జరగడం లేదు. విధానాలను నిర్దేశించే వ్యవస్థలోని విధాన నిర్ణేతల్లో మన వారి ప్రాతినిధ్యం తగినంత లేకపోవడమే ఈ అన్యాయానికి కారణంసుప్రీం కోర్టులోని 33 మంది జడ్జిల్లో నలుగురు మాత్రమే ఎస్సీ, బీసీ వర్గానికి చెందిన వారు. ఎస్టీ వర్గం వారు లేరు. సుప్రీం కోర్టు చరిత్రలో ఒక్కసారి మాత్రమే ఎస్టీ వర్గానికి చెందిన మాత్రమే జడ్జిగా నియమితులయ్యారు. గత ఏడేళ్లుగా దేశవ్యాప్తంగా 715 మంది జడ్జిలను నియమిస్తే అందులో 77 శాతం మంది అగ్రవర్ణాలకు చెందిన వారు కావడం గమనార్హం.రిజర్వేషన్ల మీద ఉన్న 50 శాతం క్యాప్ పరిమితి ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లకు వర్తించదు అని సుప్రీం కోర్టు ఐదు జడ్జిల్ ధర్మాసనం 3-2 తేడాతో తీర్పు ఇచ్చింది. ఈ ఐదుగురి జడ్జిలో ముగ్గురు బ్రహ్మణులు, ఒకరు బనియా, మరొకరు పార్సీ. ఈ నేపథ్యంలో మనకు న్యాయం ఎలా జరుగుతుంది. యూపీఎస్సీ సివిల్స్ పరీక్షల్లో ఓబీసీలకు రాత పరీక్షలో 900 మార్కులు వస్తే 200 మార్కులున్న ఇంటర్వ్యూలో 120-130 మార్కులు వస్తాయి. అదే అగ్రవర్ణాల వారికి రాత పరీక్షలో 800 మార్కులు వస్తే ఇంటర్వ్యూలో 200కి 200 మార్కులు వేస్తున్నారు. విధానాలను రూపొందించే దగ్గర, విధానాలను సమీక్షించే వ్యవస్థలో మన వారికి తగిన ప్రాతినిధ్యం లేకపోవడంతోనే ఈ అన్యాయం జరుగుతుంది. కామారెడ్డి డిక్లరేషన్లో మేము స్థానిక సంస్థల్లో మాత్రమే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని హామీ ఇచ్చాం. కానీ మహేష్ కుమార్ గౌడ్, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖతోపాటు ఇక్కడ ఉన్న వకుళాభరణం అందరూ కోరితే విద్య, ఉద్యోగాల్లో కూడా 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నాం. ఈ క్రమంలో ఎటువంటి వివాదాలకు తావులేకుండా డెడికేటెడ్ కమిషన్ వేసి, కులగణన చేసి అన్ని నిబంధనలు పాటిస్తూ అందరూ సూచించిన విధంగా స్థానిక సంస్థలు, విద్య, ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులను శాసనసభలో ఆమోదించి కేంద్రానికి పంపించడం జరిగింది. ఇది జరిగి నాలుగు నెలలు అవుతుంది. అయినా కేంద్రంలో ఉలుకు పలుకు లేదు. ప్రభుత్వం 2027లో కులగణన చేస్తా అంటుంది. దానికి ఇంకా రెండేళ్ల సమయం ఉంది. రెండేళ్ల తర్వాత కులగణన చేసి, దాన్ని ఎప్పుడూ అమలు చేస్తారో దేవుడికే తెలియాలి. ఇక్కడ మా ప్రభుత్వం ఇక్కడ ఏటా క్రమం తప్పకుండా ఉద్యోగాలను భర్తీ చేస్తోంది. మీరేమో మేము పంపిన బిల్లులను ఆమోదించరు. బీసీల పట్ల కేంద్ర చిత్తశుద్ధి ఇదేనా? కులగణనను రెండేళ్ల తర్వాత చేస్తా అంటున్నారు. దీంతో బీసీలకు ఉద్యోగాల భర్తీలో 27 శాతం రిజర్వేషన్లు మాత్రమే అమలవుతాయి. ఫలితంగా బీసీలకు అన్యాయం జరగదా? 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తే బీసీలకు అదనంగా ఉద్యోగాలు లభిస్తాయి. ఇప్పుడా అవకాశాన్ని బీసీలు కోల్పోవడం లేదా? ఈ నేపథ్యంలో రెండేళ్లు ఆగుదామా? రేవంత్ రెడ్డి ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెచ్చిన బిల్లులను ఆమోదించమని కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తేద్దామా? లేదా మనం ఆలోచించాలి. ఒకరిని ఒకరు విమర్శించుకోవడం కంటే సమిష్టిగా కేంద్రం మీద పోరాటం చేయాలి. ఇక్కడ రాజేందర్ అన్న ఉన్నాడు. బీజేపీలో ఆయనే పెద్ద లీడర్. బీసీ రిజర్వేషన్ల బాధ్యతను రాజేందర్ అన్న మీదే మనమందరం పెడదాం. కేంద్రం దగ్గరికి పోదాం. తమిళనాడు మాదిరిగా 9వ షెడ్యూల్లో తెలంగాణ ఆమోదించిన బీసీ బిల్లులను ప్రవేశపెడితే ఆర్టికల్ 31 (బి) రాజ్యాంగ రక్షణ లభిస్తుంది. రాజ్యాంగ రక్షణ ఉంటుంది కాబట్టి కోర్టుల్లో కేసులు వేసిన అవి నిలబడవు. ఇందుకోసం కేంద్రం మీద ఒత్తిడి తేద్దాం. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లకు 50 శాతం క్యాప్ పరిమితి వర్తించదు. బీసీలకు 15 శాతం అదనంగా రిజర్వేషన్ల కల్పించాలంటే మాత్రం 50 శాతం క్యాప్ పరిమితి అడ్డు వస్తోంది. బీసీల విషయంలో మాత్రం ఈ వివక్ష ఎందుకు? బీసీల్లో ఇప్పటికీ 90 శాతం మంది వెనుకబడి ఉన్నారు. వారు బాగుపడొద్దా. ఈ విషయంలో మనమందరం స్పందించాలి. రాజకీయాలకు అతీతంగా పని చేద్దాం. బీసీల జీవితాల్లో మార్పు కోసం ప్రయత్నిద్దాం.

## ఐదో అంతస్థునుంచి దూకి మహిళ ఆత్మహత్య

### కుటుంబకలహాలే కారణమంటున్న పోలీసులు

**హైదరాబాద్,జూన్14(సమయజ్యోతి):**

సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఎర్రగడ్డలోని జనప్రియ అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న ఓ మహిళ 5వ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నట్టు- పోలీసులు తెలిపారు. శనివారం ఉదయం 8:30 గంటల సమయంలో ఈ సంఘటన జరిగింది. పోలీసులు ఇచ్చిన సమాచారం ప్రకారం... ఆత్మహత్య చేసుకున్న మహిళ పేరు కొక్కినీ శ్రావణి (30), ఆమె తిమ్మాపురం, ఏలూరు జిల్లా వాసిగా గుర్తించారు. . కొద్ది నెలల క్రితమే హైదరాబాద్‌కు వలసవచ్చి, జనప్రియ అపార్ట్‌మెంట్‌లో హౌస్ కీపింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నట్టు- తెలుస్తోంది. ఆమెకు రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. కుటుంబ కలహాలే ఆమె ఆత్మహత్యకు కారణమై ఉంటాయని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్టు- పోలీసులు తెలిపారు. పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఈ సంఘటనతో అపార్ట్‌మెంట్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## బెయిల్ రావడంతో బోరుగడ్డ విడుదల

**గుంటూరు,జూన్14(సమయజ్యోతి):**

రౌడీ షీటర్ బోరుగడ్డ అనిల్ జైలు నుంచి విడుదలయ్యారు. అనిల్ పై రాష్ట్రవ్యాప్తంగా 50కిపైగా కేసులు నమోదయ్యాయి. టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చెయ్యడంతో గుంటూరు, అనంతపురం జిల్లాలలో బోరుగడ్డపై కేసులు నమోదయ్యాయి. గుంటూరులో చర్చి వివాదంలో కర్లపూడి బాబూప్రకాష్ ను బెదిరించిన ఘటనపై కేసు నమోదు అయ్యింది. గతేడాది అక్టోబర్ లో బోరుగడ్డను పోలీసులు అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపర్చడంతో రిమాండ్ విధించింది. దీంతో బోరుగడ్డను రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. అప్పటినుంచి బోరుగడ్డపై నమోదైన కేసులలో పోలీసులు వివిధ కోర్టులలో హాజరుపర్చారు. 2016లో పెదకాకాని సర్వేయర్ మల్లిఖార్జునరావును బెదిరించిన కేసులో గుంటూరు కోర్టు బెయిల్ మంజూరు చెయ్యడంతో గుంటూరు జిల్లా జైలునుంచి బోరుగడ్డ విడుదలయ్యారు.

## పొదిలి రాళ్లదాడి కేసు

### మరో 15మంది అరెస్ట్

**ఒంగోలు,జూన్14(సమయజ్యోతి):**

ప్రకాశం జిల్లా పొదిలిలో ఈనెల 11న మాజీ సీఎం జగన్ పర్యటనలో మహిళలు, పోలీసులపై రాళ్ల దాడి జరిగిన కేసులో మరో 15మందిని అరెస్ట్ చేశారు. రోడ్డు పక్కన నిరసన తెలిపిన మహిళలపై రెచ్చిపోయిన వైకాపా కార్యకర్తలు రాళ్లు, చెప్పులతో దాడి చేశారు. ఈ కేసులో ఇప్పటికే 9మందిని అరెస్టు చేయగా.. తాజాగా మరో 15 మందిని అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. మరి కొందరు పరారీలో ఉన్నట్టు చెప్పారు. జగన్ కార్యక్రమానికి పోలీసుల అనుమతి పొందడంతో పాటు-, కార్యక్రమాన్ని నిర్వహించిన దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డికి పోలీసులు నోటీసులు జారీ చేశారు. పోలీసుల అనుమతి ప్రకారం కార్యక్రమం నిర్వహించలేదని, బారికేడ్లు తొలగించుకొని కార్యకర్తుల చొచ్చుకెళ్లడం, ర్యాలీలో క్రమశిక్షణ పాటించకపోవడం తదితర కారణాలు చూపుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చి సమాధానం చెప్పాలని బూచేపల్లికి శుక్రవారం నోటీ-సులు జారీ చేశారు. కానీ, ఆయన సమాధానమివ్వలేదు. బూచేపల్లి అందుబాటు-లో లేకపోవడంతో పరారయ్యారంటూ సోషల్ మీడియాలో ప్రచారం సాగింది. సోషల్ మీడియాలో వచ్చిన వార్తలను దృష్టిలో పెట్టు-కొని బూచేపల్లి ప్రకటన విడుదల చేశారు. తాను ఎక్కడికీ పారిపోలేదని.. తన పిల్లలను చూసేందుకు హైదరాబాద్ వెళ్లానని, పోలీసుల వద్దకు వచ్చి వివరణ ఇస్తానని పేర్కొన్నారు.

## అంతర్జాతీయ యోగాను విజయవంతం చేయాలి

### యోగాంధ్ర కార్యక్రమంలో

### పాల్గొన్న రఘురామ

**భీమవరం,జూన్14(సమయజ్యోతి):**

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా నెల రోజుల పాటు యోగాంధ్ర పేరుతో మాసోత్సవాలను ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ప్రతీ జిల్లాలో ప్రజలు రోజూ యోగాసనాలు వేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో నిర్వహిస్తున్న యోగాంధ్రలో రాజకీయ నాయకులు, అధికారులు, పోలీసులు కూడా పాల్గొని యోగాసనాలు చేస్తున్నారు. శనివారం పశ్చిమగోదావరి జిల్లాలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో డిప్యూటీ- స్పీకర్ రఘురామకృష్ణంరాజు పాల్గొన్నారు. జిల్లాలోని కాళ్ల మండలం పెదఆమిరంలో యోగాంధ్ర 2025 కార్యక్రమం నిర్వహించారు. యోగా కార్యక్రమంలో డిప్యూటీ- స్పీకర్ పాల్గొని యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా రఘురామ మాట్లడుతూ.. దేశంలోని అన్ని రాష్ట్రాల కంటే యోగాంధ్ర కార్యక్రమం ఏపీ రాష్ట్రంలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెద్ద ఎత్తున నెలరోజుల పాటు యోగా శిక్షణ నిర్వహిస్తున్నారన్నారు. ఈనెల 21న వైజాగ్ సముద్రం ఒడ్డున ప్రపంచ స్థాయిలోనే నిలిచిపోయేలాగా ప్రణాళిక చేస్తున్నారని తెలిపారు. రెండు కోట్ల మంది యోగాకు రిజిస్టర్ అవుతారు అనుకుంటే, రెండు కోట్ల 20 లక్షల మంది రిజిస్టర్ అయ్యారన్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో 8,50,000 మంది యోగా రిజిస్టర్ చేసుకున్నారని చెప్పారు. భారతదేశంలోనే యోగా అంటే ఆంధ్రప్రదేశ్ గుర్తొచ్చేలాగా యోగాంధ్ర 2025ని విజయవంతం చేయాలని డిప్యూటీ- స్పీకర్ రఘురామకృష్ణంరాజు పిలుపునిచ్చారు. ఈ యోగా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నాగరాణి, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి పాల్గొని యోగాసనాలు వేశారు. ఇదిలావుంటే ఈనెల జూన్ 21న విశాఖపట్నంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఈ యోగా డేలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ , సీఎం చంద్రబాబు పాల్గొననున్నారు. విశాఖలో జరిగే యోగా దినోత్సవ వివరాలను ఇప్పటికే కేంద్ర ఆయూష్ మంత్రి ప్రతాప్ రావ్ జాదవ్ వెల్లడించారు. 45 నిమిషాల పాటు యోగా కార్యక్రమం ఉంటుందని.. ప్రధాని మోదీ ప్రసంగం తర్వాత కార్యక్రమం ముగుస్తుందని తెలిపారు. యోగా కార్యక్రమ ఏర్పాట్లను స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యవేక్షిస్తున్నారని వెల్లడించారు. అంతేకాకుండా దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో జరిగే యోగా కార్యక్రమాలు లైవ్ ప్రసారం జరుగుతుందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

# కూర్మ గ్రామంలో అగ్నిప్రమాదంపై అనుమానాలు

## ఆ కోణంలోనూ దర్యాప్తు చేపడతాం

## అధికారులను ఆదేశించిన డిప్యూటీ సిఎం పవన్

**అమరావతి,జూన్14(సమయజ్యోతి):**

శ్రీకాకుళం జిల్లా కూర్మ గ్రామంలో అగ్నిప్రమాద ఘటనపై అనుమానాలు వ్యక్తమవుతున్న తరుణంలో ఆ కోణంలోనూ దర్యాప్తు చేపట్టాలని డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ ఆదేశించారు. ప్రమాద ఘటనపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందించారు. ఆధునిక హంగులు లేకుండా ఆధ్యాత్మిక చింతనతో జీవించేలా తీర్చిదిద్దుకున్న కూర్మ గ్రామం అగ్నికి ఆహుతి కావడం దురదృష్ట కరమన్నారు. అగ్నిప్రమాదంపై పోలీసులు లోతుగా విచారణ చేయాలని సంబంధిత యంత్రాంగానికి సూచనలు చేసినట్లు తెలిపారు. ఈ ఘటనపై అనుమానాలు వ్యక్తమవుతున్న తరుణంలో ఆ కోణంలోనూ దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు. కూర్మ గ్రామంలో ప్రస్తుత పరిస్థితిపై జిల్లా అధికారులతో మాట్లాడి, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. సనాతన ధార్మిక జీవనం కోసం ఇస్కాన్ ఆధ్వర్యంలో ఈ గ్రామం ఏర్పాటైందని తెలిపారు. కూర్మ గ్రామవాసులు యాంత్రిక జీవన విధానాలకు భిన్నంగా మట్టి ఇళ్లల్లో ఉంటూ ప్రకృతి వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారన్నారు. వేద విద్యను అభ్యసించే చిన్నారులు సంస్కృతం, తెలుగు, హిందీ, ఆంగ్లం అనర్గళంగా మాట్లాడుతూ ఉంటారని అన్నారు. వర్తమాన కాలంలో విశిష్టంగా ఉన్న ఈ గ్రామం పునరుద్ధరణపై దృష్టి సారించాలని డిప్యూటీ- సీఎం పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ఇటీవల కూర్మ గ్రామంలోని ఆధ్యాత్మిక ప్రసంగాలు చేసే రాధాకృష్ణ మందిరంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో భక్తులు భయంతో పరుగులు తీశారు. ఈ ఘటనలో విలువైన గ్రంథాలు, పుస్తకాలు అగ్నికి ఆహుతయ్యాయి. దాదాపు రూ.50 లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లినట్లు అంచనా. వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. క్లూస్ టీం రంగంలోకి దిగి పలు ఆధారాలను సేకరించాయి. గతంలోనూ దుండుగులు ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడ్డారని నిర్వాహకులు తెలిపారు.

# మహిళలను కించపరిస్తే చర్యలు తప్పవు

కూటమి ప్రభుత్వంపై జగన్ కుట్రలు

శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా చర్యలు

జగన్ కుట్రలను రాష్ట్రంలో సాగనివ్వబోం

మీడియా సమావేశంలో హోంమంత్రి అనిత

**విజయవాడ,జూన్14(సమయజ్యోతి):**

మహిళలను కించపరిచిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హోం మంత్రి వంగలపూడి అనిత హెచ్చరించారు. వైకాపా అధినేత జగన్.. కూటమి ప్రభుత్వంపై లేనిపోని విమర్శలు చేయిస్తున్నారని, బురద జల్లేందుకు అనేక ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌పై ఆంధ్రప్రదేశ్ హోమ్ శాఖ మంత్రి వంగలపూడి అనిత మరోసారి నిప్పులు చెరిగారు. శనివారం అమరావతిలో ఏర్పాటు- చేసిన విలేకర్ల సమావేశంలో మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ.. ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ఉన్నంత వరకూ వైఎస్ జగన్ ఆటలు సాగవని స్పష్టం చేశారు. శాంతిభద్రతలకు ఎలాగైనా విఘాతం కలిగించాలని చూసే జగన్ కుట్రలు రాష్ట్రంలో సాగనివ్వబోమని ఆమె హెచ్చరించారు. రాష్ట్రంలో మహిళలకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చే దిశగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని వివరించారు. దీనిని ఎవ్వరు విఘాతం కలిగించాలని చూసినా ఉపేక్షించేది లేదని ఆమె హెచ్చరించారు. మహిళల్ని అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేయాలనుకుంటున్న జగన్‌కు సిగ్గనిపించట్లేదా? అంటూ ఆమె సందేహం వ్యక్తం చేశారు. ప్రకాశం జిల్లా పొదిలిలో పోలీసులు తిరిగి ఎదురు రాళ్ల దాడి చేసి ఉంటే వైఎస్ జగన్ చుట్టూ ఎంత మంది మిగిలే వారో గుర్తుపెట్టుకోవాలంటూ వైసీపీ నేతలకు మంత్రి అనిత సూచించారు. కేజీ పొగాకు ధర కూడా తెలియకుండా రైతుల పరామర్శకు వెళ్లిన జగన్ మానసిక పరిస్థితి అర్థం చేసుకోవచ్చంటూ ఈ సందర్భంగా ఆమె వ్యంగ్యంగా పేర్కొన్నారు. పులివెందులకు మాత్రమే పరిమితమైన ఎమ్మెల్యేగా గుర్తుపెట్టుకోవాలంటూ వైఎస్ జగన్‌కు ఈ సందర్భంగా ఆమె సూచించారు. కూటమి ప్రభుత్వంలో మహిళలు, తల్లులు సంతోషంగా ఉండటాన్ని వైసీపీ జీర్ణించుకోలేకపోతోందని విమర్శించారు. ప్రతిపక్ష హోదా కూడా లేని ఓ విపక్ష పార్టీ కడుపు మంట చూస్తే నవ్వొస్తుందని ఎద్దేవా చేశారు. అమరావతి గురించి కొందరు వెధవలు చేసిన వ్యాఖ్యల్ని జగన్ సమర్థించటం సిగ్గుచేటు అంటు వ్యాఖ్యానించారు. సాక్షి జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావు నిర్దోషి అంటూ సుప్రీంకోర్టు ఎక్కడా నిర్ధారించలేదని గుర్తు చేశారు. ఎలాంటి టీవీ డిబేట్లు నిర్వహించ కూడదని కొమ్మినేనికి సుప్రీంకోర్టు షరతులతో కూడిన బెయిల్ మాత్రమే మంజూరు చేసిందని సోదాహరణగా మంత్రి వంగలపూడి అనిత వివరించారు. వైఎస్ జగన్, వైఎస్ భారతీతో క్షమాపణలు చెప్పించడానికి సమావేశం పెట్టుకోవాలంటూ వైసీపీ నేతలకు మంత్రి అనిత హితవు పలికారు. సాటి మహిళల్ని కించపరిస్తే ఆ అంశాన్ని సమర్థించుకోవడానికి వైసీపీ మహిళా నేతలు సమావేశం పెట్టుకోవడాన్ని వారి విజ్ఞతకే వదిలేస్తున్నానన్నారు. పులివెందుల ఎమ్మెల్యేగా కూడా మిగలని పరిస్థితిని వైఎస్ జగన్ తెచ్చుకుంటు-న్నాడని జోస్యం చెప్పారు. తల్లికి వందనం నిధులపై లోకేష్ విసిరిన ఛాలెంజ్ స్వీకరించే దమ్ము ఒక్కరికి కూడా లేకపోయిందంటూ వైసీపీ నేతలపై మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన శక్తి యాప్‌కు, గత ప్రభుత్వం తెచ్చిన బూటకపు దిశ యాప్‌కు పొంతనే లేదన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే అభివృద్ధిని



అడ్డుకోవచ్చనే కుట్రతో జగన్ కిందా మీద పడుతున్నారని విమర్శించారు. జగన్ రాజకీయ ముసుగులో ఉన్న నేరస్థుడు కాబట్టే రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి చూసి ఓర్వలేక పోతున్నాడన్నారు. పోలీసులు మీద రాళ్లు విసిరితే మాకు బీపీలు రావా? అని ప్రశ్నించారు. మాకు బీపీలు వచ్చినా, చేసిన అవమానాలకు కడుపు మండినా సంయమనం పాటిస్తున్నామని మంత్రి వంగలపూడి అనిత గుర్తు చేశారు. డైవర్షన్ పాలిటిక్స్‌ను జగన్ పే-టె-ంట్ తీసుకున్నాడని ఎద్దేవా చేశారు. జగన్ తన నియోజకవర్గానికి వస్తే ఐదుగురు పిల్లల ఉన్న తల్లులకు తల్లికి వందనం పడిన వారిని చూపిస్తానని చెప్పారు. డీఎస్సీ నిలుపుదల చేయటానికి సుప్రీంకోర్టు వరకూ వెళ్లి కుట్రలు చేయలేదా? అంటూ వైసీపీ నేతలపై ఆయన మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పలు చోట్లు- భారీగా గంజాయి పట్టు-కున్నాం. జగన్ ఎప్పుడూ మహిళలను అడ్డం పెట్టుకునే రాజకీయాలు చేస్తారు. ఆయన నడుపుతున్న ఛానెల్‌లో మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు చేస్తే.. ఎలాంటి చర్యలు తీసుకున్నారు? సాటి మహిళలపై అసభ్య వాఖ్యలు చేసిన వారికి.. వైకాపాలోని మహిళా నేతలు అండగా ఉంటారా? చివరికి 'తల్లికి వందనం' పైనా రాజకీయం చేస్తున్నారు. కేవలం ఒకరికి మాత్రమే కాకుండా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ 'తల్లికి వందనం' ఇస్తున్నాం. గతంలో మాదిరిగానే రూ.2 వేలు పాఠశాల నిర్వహణకు కేటాయిస్తే .. నిధులు దుర్వినియోగం చేశారని రాద్ధాంతం చేస్తున్నారు. తల్లికి వందనం నిధులపై లోకేశ్ విసిరిన ఛాలెంజ్ స్వీకరించే దమ్ములేదా? మేం తెచ్చిన శక్తి యాప్‌కు, గత ప్రభుత్వం తెచ్చిన దిశ యాప్‌కు పొంతనే లేదు. రాష్ట్రంలో అభివృద్ధిని చూసి జగన్ ఓర్వలేక పోతున్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించి అభివృద్ధిని అడ్డుకునేందుకు కుట్రలు చేస్తున్నారు. పోలీసుల మీద రాళు విసిరితే మాకు బీపీలు రావా? డైవర్షన్ పాలిటిక్స్‌కు జగన్ పేటెంట్ తీసుకున్నారు. డీఎస్సీ ఆపేందుకు సుప్రీంకోర్టుకు వెళ్లి కుట్రలు చేయలేదా అని హోం మంత్రి ప్రశ్నించారు.

# నా ఇంటికి నన్నే పోనివ్వరా

## పోలీసుల తీరుపై కేతిరెడ్డి అసహనం

**అనంతపురం,జూన్14(సమయజ్యోతి):**

తాడిపత్రికి తనని పోలీసులు వెళ్లనివ్వడంలేదని తాడిపత్రి మాజీ ఎంఎల్ఎ కేతిరెడ్డి పెద్దారెడ్డి మండిపడ్డారు. హైకోర్టు ఆదేశాలను ఆంధ్రప్రదేశ్ పోలీసులు పాటించడంలేదని ధ్వజమెత్తారు. తాడిపత్రిలో టిడిపి నేత జెసి ప్రభాకర్ రెడ్డి కనుసన్నల్లో ఖాకీలు చేస్తున్నారని విమర్శలు చేశారు. శనివారం ఉదయం తాడిపత్రికి వెళ్తున్న పెద్దారెడ్డిని యల్లనూరు మండల తిమ్మంపల్లి గ్రామ శివారులో వాహనాలను పెట్టి పోలీసులు అడ్డుకోవడంతో పెద్దారెడ్డి మీడియాతో మాట్లాడారు. ఇప్పటికే తాడిపత్రి పర్యటన పలుమార్లు వాయిదా వేసుకున్నానని, తాడిపత్రిలో సొంతిళ్లు ఉందని, తన ఇంటికి తాను వెళ్తానంటే పోలీసులు ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. తాడిపత్రిలో టిడిపి గుండాలు కత్తులు, కటారాలతో సంచరిస్తున్నారని విమర్శలు గుప్పించారు. తాడిపత్రిలో ఐపిఎస్ అధికారి విధులు నిర్వహిస్తున్న ప్రయోజనం లేకుండా పోయిందని ఎద్దేవా చేశారు. తాడిపత్రిలో గంజాయి, అక్రమ దందాలు కొనసాగుతున్నాయని, తాను తాడిపత్రికి వెళ్తే అక్రమ దందాలు సాగవని జెసి ప్రభాకర్ రెడ్డి భయపడుతున్నారని పెద్దారెడ్డి దుయ్యబట్టారు. విశాఖపట్నంలో ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన ఉండడంతో తనకు రక్షణ కల్పించలేమని ఎస్పి జగదీష్ తెలిపారన్నారు. పెద్దారెడ్డి తాడిపత్రికి వెళ్తే ఆయనకు భద్రత కల్పించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే.

# స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటుతుంది

## కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి ధీమా

**సిద్దిపేట,జూన్14(సమయజ్యోతి):**

వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో మెదక్ జిల్లాలో అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ గెలవడం ఖాయమని కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి ధీమా వ్యక్తం చేశారు. శనివారం గజ్వేల్ మండలం రిమ్మనగూడ వద్ద ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామికి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు తుంకుంట నర్సారెడ్డి, పార్టీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అలాగే సిద్దిపేట రంగదాంపల్లి వద్ద అమరవీరుల స్థూపం వద్ద అమరవీరులకు మంత్రి వివేక్ వెంకటస్వామి నివాళులు అర్పించారు .ఈ సందర్భంగా వివేక్ వెంకటస్వామి మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ శ్రేణులు మెదక్ జిల్లాలో ఇంతటి ఘనస్వాగతం పలకడం తనకు సంతోషంగా ఉందని అన్నారు. సన్నబియ్యం, నూతన రేషన్ కార్డుల మంజూరు వంటి కార్యక్రమాలతో ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై అపూర్వ స్పందన వస్తోందని ఉద్ఘాటించారు. వచ్చే ఎన్నికలనూ దృష్టిలో పెట్టు-కొని గ్రామ గ్రామాల్లో కాంగ్రెస్ జెండా ఎగిరే విధంగా ప్రణాళిక రూపొందించుకొని ముందుకు వెళ్తామని తెలిపారు. కాంగ్రెస్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్దామని అన్నారు. విభేదాలను పక్కన పెట్టి సమస్యలు పరిష్కారం చేసుకుందామని కోరారు. సిద్దిపేటలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని మాటిచ్చారు. ఇచ్చిన హామీలను నెరవేర్చుకుందాం, వారానికి ఒక్కసారి సిద్దిపేటకి వస్తానని మంత్రి వివేక్ వెంకటస్వామి వెల్లడించారు.

# కావ్యతో పెళ్లి వార్తల పుకార్లు-ఖండించిన అనిరుధ్ రవిచందర్

**చెన్నై,జూన్14(సమయజ్యోతి):**

కావ్యా మారన్‌తో పెళ్లి అంటూ వస్తున్న పుకార్లను సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ ఖండించారు. ఇలాంటి వార్తలను ప్రచారం చేసే ముందు ఆలోచించాలని అన్నారు. అలాగే ఈ పుకార్లకు వెంటనే ముగింపు పలకాలని అన్నారు. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు సీఈవోగా వ్యవహరిస్తున్న కావ్యా మారన్‌తో అనిరుధ్ కొంతకాలంగా రిలేషన్‌షిప్‌లో ఉన్నారని, త్వరలోనే పెళ్లి చేసుకోనున్నారని కోలీవుడ్ మీడియాలో వార్తలు రావడం హాట్‌టాపిక్ అయింది. సామాజిక మాధ్యమాల్లోనూ చర్చ జరిగింది. వీటిపై అనిరుధ్ స్పందించారు. 'పెళ్లా..? రూమర్స్ ప్రచారం ఆపండి' అంటూ సోషల్ మీడియా వేదికగా ఆ వార్తలను ఖండించారు. కావ్య.. సన్ గ్రూప్ ఛైర్మన్ కళానిధి మారన్ కుమార్తె. ఐపీఎల్ మ్యాచ్‌ల సమయంలో మైదానంలో తనదైన హావభావాలతో పాపులర్ అయ్యారు. కళానిధి మారన్ నిర్మించిన 'జైలర్', 'బీస్ట్', 'రాయన్' తదితర చిత్రాలకు అనిరుధ్ సంగీతం అందించారు.

# గంజాయి రవాణా చేస్తున్న దంపతులు

## వారితో పాటు మరో ఇద్దరి పట్టివేత

**రాజమండ్రి,జూన్14(సమయజ్యోతి):**

అక్రమ గంజాయి నిల్వ ఉంచి ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్న భార్యాభర్తలు, వీరికి సహకరిస్తున్న మరో ఇద్దరు వ్యక్తులను తూర్పు గోదావరి జిల్లా రాజానగరం పోలీసులు పట్టుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి ఒక వ్యాన్, కారు, రెండు మోటారు సైకిళ్లను, రేకుల షెడ్ సీజ్ చేసినట్లు తెలిపారు. గంజాయి కేసుకు సంబంధించిన వివరాలను రాజమండ్రి నార్త్ జోన్ డిఎస్పీ వై. శ్రీకాంత్ వెల్లడించారు. రాజానగరం మండలంలో కొండగుంటూరు కొండాలమ్మ గుడి సమీపంలో ప్రైవేట్ లే అవుట్ రేకుల షెడ్ లో వీరిని పోలీసులు పట్టు-కున్నారని తెలిపారు. ఒరిస్సా జిల్లా చిత్రకొండ రఘువీర్ రాయ్, ఇతని భార్య ప్రశాంతి రాయ్ గంజాయి అక్రమంగా నిల్వ ఉంచి రవాణా చేస్తున్న కేసులో అరెస్టు చేశారు పోలీసులు. కారులో భార్యాభర్తలు గంజాయి తీసుకుని వచ్చినట్లు- తెలిసి పోలీసులు తనిఖీ చేసి పట్టుకున్నారు. వీరికి సహకరించిన ఒరిస్సా రాష్ట్రం మల్కాగిరి జిల్లా చిత్రకొండ మండలం దొరగుడ పంచాయతీ సురేష్ చంద్ర కులదీప్, అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం పొల్లూరు గ్రామానికి చెందిన చందన్ మండల్ ను అరెస్టు చేశారు. కారులో నుంచి 11 ప్యాకెట్లు 23.101 కేజీల గంజాయి దించుతుండగా దాడులు చేసి పట్టు-కున్నారు. గంజాయి, రవాణాకు ఉపయోగిస్తున్న ఒక వ్యాన్, కారు, రెండు బైకులను సీజ్ చేశారు. ఈ అక్రమ సంపాదనతో కొంతమూరులో విశాలమైన ఇల్లు కొనుగోలు చేసుకుని నివాసం ఉంటున్నారు నిందితులు. కొండ గుంటూరులో రేకుల షెడ్ సీజ్ చేశారు. కొంతమూరు ఇల్లు సీజ్ చేయడానికి ఉన్నతాధికారులకు నివేదికలు పంపించారు పోలీసులు.

# తిరుమల అన్న ప్రసాదంలో మ్యాంగో జ్యూస్

## సిఎంతో మాట్లాడి ఖరారు చేయించే ఆలోచన

## మామిడి రైతులకు అండగా ఉండేలా చర్యలు

## రైతులతో భేటీ అయిన మంత్రి అచ్చన్నాయుడు

**తిరుపతి,జూన్14(సమయజ్యోతి):**

తిరుమల అన్న ప్రసాదంలో ఇతర పుణ్యక్షేత్రాల్లో మధ్యాహ్నం ఒక గ్లాస్ మ్యాంగో జ్యూస్ ప్యాకెట్ అందించేందుకు ముఖ్యమంత్రితో చర్చలు జరుపుతున్నామని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. మామిడి సాగుతో పాటు ఇతర లాభసాటి పంటలపై రైతులు దృష్టి సారించాలని కోరారు. గుజ్జు పరిశ్రమలు రైతులను ఇబ్బందులు గురిచేస్తున్నాయని అన్నారు. పాకాల మండలం దామలచెరువులో మామిడి రైతులు, వ్యాపారులతో మంత్రి అచ్చెన్నాయుడు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 5లక్షల హెక్టార్లకు పైగా మామిడి సాగు అవుతుందన్నారు. ఇప్పటికి 22వేల టన్నులు మార్కెటింగ్ జరిగింది.. లక్ష టన్నులకు పైగా మార్కెటింగ్ జరగాల్సి ఉందన్నారు. తోతాపూరి కేజీకి రూ.12 రైతులకు చెల్లించాలి. చివరి మామిడి కాయ వరకు రు.4 సబ్సిడీ కల్పిస్తాం. పరిశ్రమలు రూ.8 తప్పనిసరిగా ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. గుజ్జు పరిశ్రమలు సకరించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు మిర్చికి రూ.20వేలు వచ్చేదని జగన్ మోహన్ రెడ్డి అంటున్నాడు.. జగన్ మోహన్ రెడ్డి అవగాహన లేకుండా మాట్లాడుతున్నాడు.. గత 10 సంవత్సరాలలో ఒక్కసారి 2022లో మాత్రమే రూ.20 వేలు వచ్చింది.. మిగిలిన 9 సంవత్సరాలు మిర్చికి రూ.14వేలు ధర వచ్చింది.. జగన్ నువ్వు ఒక్క సంవత్సరం ముఖ్యమంత్రివా... లేక 5 సంవత్సరాల ముఖ్యమంత్రివా అని ప్రశ్నించారు.



# తల్లికి వందనం చూసి ఓర్వలేక విషప్రచారం

## వైకాపా తీరుపై మండిపడ్డ మంత్రి గొట్టిపాటి

**అమరావతి,జూన్14(సమయజ్యోతి):**

తల్లులకు చేకూర్చే లబ్ది చూసి ఓర్వలేకే వైసిపి విషప్రచారం చేస్తుందని ఎపి మంత్రి గొట్టిపాటి రవికుమార్ మండిపడ్డారు. పాఠశాలలు తెరచిన రోజే పుస్తకాలు, నాణ్యమైన విద్యా కిట్ల పంపిణీకి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తల్లికివందనం కింద ఒక్కరోజులో విద్యార్థులకు రూ. 10 వేల కోట్ల లబ్ది ఓ రికార్డు అని అన్నారు. మంత్రి నారా లోకేష్ విసిరిన సవాల్ స్వీకరించే ధైర్యం వైసిపిలో ఒక్కరికైనా ఉందా? అని ప్రశ్నించారు. నిన్నటి దాకా వైసిపి సైకోలు మహిళలను కించపరిచారని, ఇప్పుడు తల్లులు ఆనందంగా ఉండడం చూసి తట్టుకోలేకపోతున్నారని విమర్శించారు. రంగులు, బొమ్మల పిచ్చితో గత పాలకులు విద్యా వ్యవస్థను నాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తు, టీచర్ల నియామకంపైనే కూటమి ప్రభుత్వం దృష్టి సారించిందని గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు.



# బస్సును ఢీకొన్న రెడ్ మిక్స్ వాహనం

## పలువురుకి గాయాలు

**ఖమ్మం,జూన్14(సమయజ్యోతి):**

ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం మర్రిగూడెం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆర్‌టిసి బస్సు-రెడీమిక్స్ వాహనం ఎదురెదురుగా ఢీకొనడంతో పలువురు గాయపడ్డారు. ఇరువురు డ్రైవర్లకు తీవ్ర గాయాలు కావడంతో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. రెండు వాహనాలు రోడ్డు ఇరువైపులా ఉండడంతో తీవ్ర ట్రాఫిక జామ్ ఏర్పడింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. క్రేన్ సహాయంతో వాహనాలను పక్కకు తొలిగించేందుకు ప్రయత్నిస్తున్నారు.

# డబ్ల్యూటీసీ విజేతగా సౌతాఫ్రికా..

# 27 ఏళ్ల కల సాకారం

## 5 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియాపై గెలుపు - మార్క్రామ్ కీలక ఇన్నింగ్స్

దక్షిణాఫ్రికా ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌ను గెలుచుకుంది. శనివారం సౌతాఫ్రికా జట్టు డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియాను 5 వికెట్ల తేడాతో ఓడించింది. దక్షిణాఫ్రికా జట్టు క్రికెట్ ఏ ఫార్మాట్‌లోనైనా మొదటిసారి ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచింది. ఇది మాత్రమే కాదు, సౌతాఫ్రికా జట్టు 27 సంవత్సరాల తర్వాత ఐసీసీ టోర్నమెంట్‌ను గెలుచుకుంది. అంతకుముందు సౌతాఫ్రికా జట్టు 1998లో ఛాంపియన్స్ ట్రోఫీని గెలుచుకుంది.లండన్‌లోని లార్డ్స్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో నాలుగో రోజు భోజన విరామానికి ముందే దక్షిణాఫ్రికా 5 వికెట్లకు 282 పరుగుల లక్ష్యాన్ని చేరుకుంది. ఐడెన్ మార్క్రామ్ 136 పరుగులు చేయగా, టెంబా బావుమా 66 పరుగుల ఇన్నింగ్స్ ఆడారు.రెండో ఇన్నింగ్స్ లో ఆస్ట్రేలియా 218 పరుగులు చేసి దక్షిణాఫ్రికాకు 282 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. తొలి ఇన్నింగ్స్ లో ఆస్ట్రేలియా 212 పరుగులు చేయగా, దక్షిణాఫ్రికా 138 పరుగులు చేసింది. ఇక్కడ కంగారూ జట్టు 74 పరుగుల ఆధిక్యాన్ని పొందింది. లార్డ్స్‌లో జరిగిన నాల్గవ ఇన్నింగ్స్‌లో, మొత్తం 200ం పరుగుల లక్ష్యాన్ని 4 సార్లు మాత్రమే ఛేదించినట్లు రికార్డులు చెబుతున్నాయి. దీని కారణంగా దక్షిణాఫ్రికాకు విజయం కొంచెం కష్టంగా అనిపించింది. సమస్య ఏమిటంటే, దక్షిణాఫ్రికా దీనికి ముందు 5 సార్లు మాత్రమే టెస్టుల్లో మొత్తం 250ం పరుగుల లక్ష్యాన్ని ఛేదించింది. అది కూడా, చివరిసారిగా 2008 సంవత్సరంలో అలా చేసింది. కానీ, ఐడెన్ మార్క్రామ్, టెంబా బావుమా బ్యాటింగ్ చేసిన విధానం తర్వాత, దక్షిణాఫ్రికాకు ఎటువంటి ప్రతికూలతలు ఎదురుకాలేదు. దీంతో విజయానికి మార్గం సులభం అయింది. ఫలితంగా దక్షిణాఫ్రికా చరిత్ర సృష్టించింది. 282 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో దక్షిణాఫ్రికా మూడో రోజునే 2 వికెట్లకు 213 పరుగులు చేసింది. దీనిలో టెంబా బావుమా, ఐడెన్ మార్క్రామ్ మధ్య మూడో వికెట్‌కు సెంచరీ భాగస్వామ్యం కీలక పాత్ర పోషించింది. అయితే, నాల్గవ రోజు ఆట ప్రారంభమైనప్పుడు ఆ భాగస్వామ్యంలో గణనీయమైన పెరుగుదల కనిపించలేదు. మూడవ రోజు 65 పరుగులతో నాటౌట్‌గా నిలిచిన టెంబా బావుమా, నాల్గవ రోజు తన స్కోరుకు మరో పరుగు మాత్రమే జోడించగలిగాడు. పాట్ కమ్మిన్స్ అతన్ని పెవిలియన్ చేర్చాడు. మూడవ వికెట్‌కు బావుమా, మార్క్రామ్ మధ్య మొత్తం 147 పరుగుల భాగస్వామ్యం నెలకొంది. టెంబా బావుమా, ఐడెన్ మార్క్రామ్‌ల భాగస్వామ్యానికి బ్రేకులు పడొచ్చు. కానీ, బ్రేక్ అవ్వడానికి ముందే, వారిద్దరూ తమ పనిని పూర్తి చేశారు. తమ జట్టును విజయ ధంకా మోగించి %ఔజ% టైటిల్‌ను కైవసం చేసుకునే స్థాయికి తీసుకువచ్చారు. మంచి విషయం ఏమిటంటే, బావుమా ఔట్ అయిన తర్వాత, మార్క్రామ్ ఒక చివరలో నిలిచి జట్టును విజయానికి దగ్గరగా తీసుకెళ్లాడు. అయితే, మార్క్రామ్ అద్భుతమైన ఇన్నింగ్స్ విజయానికి 6 పరుగుల ముందు ముగిసింది. మార్క్రామ్ 136 పరుగులు చేశాడు. ఇది ఎప్పటికీ గుర్తుండిపోతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

**సంక్షిప్త స్కోర్లు:**

ఆసీస్ తొలి ఇన్నింగ్స్: 212 ఆలౌట్
సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 138 ఆలౌట్
ఆసీస్ రెండో ఇన్నింగ్స్: 207 ఆలౌట్
సౌతాఫ్రికా రెండో ఇన్నింగ్స్: 83.4 ఓవర్లలో 282/5

రెండు జట్ల ప్లేయింగ్-11

దక్షిణాఫ్రికా: టెంబా బావుమా (కెప్టెన్), ర్యాన్ రికెల్టన్, ఐడెన్ మార్క్రామ్, వియాన్ ముల్డర్, ట్రిస్టన్ స్టబ్స్, డేవిడ్ బెడింగ్‌హామ్, కైల్ వేరియన్ (వికెట్ కీపర్), మార్కో జాన్సెన్, కేశవ్ మహరాజ్, కగిసో రబడ, లుంగి ఎన్‌గిడి.

ఆస్ట్రేలియా: పాట్ కమిన్స్ (కెప్టెన్), ఉస్మాన్ ఖవాజా, మార్నస్ లబుస్చాగ్నే, కామెరాన్ గ్రీన్, స్టీవ్ స్మిత్, ట్రావిస్ హెడ్, బ్యూ వెబ్‌స్టర్, అలెక్స్ కారీ (వికెట్ కీపర్), మిచెల్ స్టార్క్, నాథన్ లియాన్, జోష్ హాజిల్‌వుడ్.



## మార్క్‌రమ్, బవుమా వల్లే ఓటమి

### ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్

ఎయిడెన్ మార్క్‌రమ్, టెంబా బవుమా అసాధారణ బ్యాటింగ్‌తోనే తాము ఓటమిపాలయ్యామని ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ అన్నాడు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025లో భాగంగా సౌతాఫ్రికాతో శనివారం ముగిసిన ఫైనల్లో డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియా 5 వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. ఈ గెలుపుతో సౌతాఫ్రికా 27 ఏళ్ల కలను సాకారం చేసుకుంది. ఎన్నో ఏళ్లుగా ఊరిస్తున్న ఐసీసీ టైటిల్‌ను అందుకుంది. తమపై పడిన చోకర్స్ ముద్రను ఈ విజయంతో చెరిపేసుకుంది. ఈ మ్యాచ్ అనంతరం మాట్లాడిన ప్యాట్ కమిన్స్.. సౌతాఫ్రికా జట్టుపై ప్రశంసల జల్లు కురిపించాడు. ఈ విజయానికి వారు పూర్తి అర్హులని కితాబిచ్చాడు. కొన్ని విషయాల్లో తమ జట్టు విఫలమైందని, మార్క్‌రమ్, బవుమా తమకు అవకాశం ఇవ్వలేదని చెప్పాడు. 'పరిస్థితులు త్వరగా మారుతాయి. కానీ దురదృష్టవశాత్తు ఈ మ్యాచ్‌లో చాలా వేగంగా పరిస్థితి మా చేయి ధాటిపోయింది. మేం కొన్ని విషయాల్లో మెరుగ్గా రాణించలేదు. మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యం తర్వాత ప్రత్యర్థిని త్వరగా ఔట్ చేయలేకపోయాం. నాలుగో ఇన్నింగ్స్‌లో సౌతాఫ్రికా మాకు ఎలాంటి అవకాశం ఇవ్వలేదు. మా టాప్-7లో కొన్ని సమస్యలు ఉన్నాయి. గత రెండేళ్లుగా మా ఆటగాళ్లు అద్భుత ప్రదర్శన కనబర్చారు. తొలి రెండు రోజులు మా బౌలర్లు అద్భుతంగా బౌలింగ్ చేశారు. మేం ప్రతీది ప్రయత్నించాం. నాథన్ లయన్ బాగానే బౌలింగ్ చేశాడు. కానీ అతనికి వికెట్ దక్కలేదు. మార్క్‌రమ్, బవుమా మాకు ఎలాంటి అవకాశం ఇవ్వలేదు. సౌతాఫ్రికా జట్టు తమ సత్తా ఏంటో చాటి చెప్పింది. ఈ విజయానికి వారు పూర్తి అర్హులు. ఈ మ్యాచ్ అసాంతం వారు పట్టు వదల్లేదు. టెస్ట్ క్రికెట్ అంటే నాకు చాలా ఇష్టం. ఫైనల్‌కు చేరడమే గొప్ప ఘనత. రెండేళ్ల పాటు సాగిన టోర్నీని షూటౌట్ తరహాలో ఒక్క మ్యాచ్‌తోనే ఫలితం తేల్చడం అద్భుతం. ఫలితం మాకు అనుకూలంగా లేదు. కానీ ఇదో గొప్ప వారం.'అని ప్యాట్ కమిన్స్ చెప్పుకొచ్చాడు.

## రాబోయే మూడు టెస్ట్ ఛాంపియన్ షిప్‌ఫైనల్స్‌ను ఇంగ్లాండ్‌లోనే!!

### బీసీసీఐ ఆశలకు బ్రేక్ వేస్తూ ఐసీసీ కీలక నిర్ణయం!

డబ్ల్యూటీసీ ఫైనల్స్?కు బీసీసీఐ ఎన్నో ఆశలు పెట్టుకుంది. వాటికి బ్రేక్ వేస్తూ ఐసీసీ కీలక నిర్ణయం తీసుకుంది. రాబోయే మూడు టెస్ట్ ఛాంపియన్?షిప్? ఫైనల్స్?ను ఇంగ్లాండ్?లోనే నిర్వహించాలని ఐసీసీ నిర్ణయించినట్లు సమాచారం వచ్చింది. అసలు ఇది ఎంత వరకు నిజమనేది తెలియాల్సి ఉంది. దీని పై అధికారికంగా ప్రకటన రావాల్సి ఉంది. టెస్ట్ ఫార్మాట్?లో డబ్ల్యూటీసీ ఫైనల్? మ్యాచ్ ఎంతో ప్రతిష్ఠాత్మకం. ఈ టోర్నమెంట్ విశేష ప్రేక్షకాదరణను కలిగి ఉంది. ఇలాంటి ప్రతిష్ఠాత్మక పోరుకు ఆతిథ్యం ఇవ్వాలని బీసీసీఐ ఆసక్తి చూపిస్తోంది. బీసీసీఐ ఆశలకు ఐసీసీ బ్రేక్? వేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం కొనసాగుతున్ననట్లుగానే డబ్ల్యూటీసీ ఫైనల్?ను వచ్చే మూడు సీజన్లలోనూ ఇంగ్లాండ్?లోనే నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ విషయం పై వచ్చే నెలలో అధికారికంగా ప్రకటన విడుదల చేసే అవకాశం ఉంది.ప్రపంచ టెస్ట్ ఛాంపియన్ షిప్ ఫైనల్స్?ను 2021 నుంచి నిర్వహిస్తున్నారు. 2023-25 సైకిల్?లో భాగంగా డబ్ల్యూటీసీ ఫైనల్? ఆస్ట్రేలియా - దక్షిణాఫ్రికా మధ్య లార్డ్స్ వేదికగా జరుగుతోంది. ఈ సీజన్?తో కలిపి ఇప్పటివరకు మూడు ఎడిషన్లు ఫైనల్? మ్యాచ్?లు జరిగాయి. ఈ ఫైనల్ మ్యాచ్?లు ఇంగ్లాండ్?లోని సౌతాంప్టన్?, ఓవల్, లార్డ్స్ మైదానాల్లో నిర్వహించారు. అయితే భారత్?లో కూడా ఈ ఫార్మాట్?కు ఆదరణ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ప్రపంచ టెస్ట్ ఛాంపియన్?షిప్ ఫైనల్? మ్యాచ్?కు భారత్?కు ఆతిథ్య హక్కులు ఇవ్వాలని బీసీసీఐ కోరుతుంది. కానీ, బీసీసీఐ విజ్ఞప్తి పట్ల ఐసీసీ సుముఖత చూపడం లేదని సమాచారం.రాబోయే 2027, 2029, 2031సంవత్సరాలలో జరగనున్న డబ్ల్యూటీసీ ఫైనల్ మ్యాచ్?లకు ఇంగ్లాండ్?కే ఆతిథ్య హక్కులు ఇవ్వాలని ఐసీసీ నిర్ణయించింది. దీనిపై ఇంగ్లాండ్? క్రికెట్? బోర్డ్ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. జులైలో సింగపూర్ వేదికగా జరిగే ఐసీసీ వార్షిక సదస్సులో ఈ విషయం పై అధికారికంగా ఆమోదించి, ప్రకటనను విడుదల చేయనున్నట్లుగా క్రీడా వర్గాలు వెల్లడించాయి. ఈ విషయం పై పలు ఆంగ్ల మీడియాలలో కథనాలు వస్తున్నాయి. డబ్ల్యూటీసీ ఫైనల్ మ్యాచ్ నాలుగో రోజుకు చేరుకుంది. ఈ పోరులో దక్షిణాఫ్రికా విజయానికి మరింత చేరువైంది. 2025-27 సైకిల్ కూడా ఇంగ్లాండ్?లోనే మొదలు పెట్టనున్నారు. జూన్? 20 నుంచి భారత్, ఇంగ్లాండ్? మధ్య 5 మ్యాచ్?ల టెస్ట్ సిరీస్? ప్రారంభం కానుంది. ఇప్పటివరకు ఇండియా డబ్ల్యూటీసీ ఫైనల్?కు రెండుసార్లు వెళ్లినా, విజయాన్ని అందుకోలేకపోయింది.




## 29 ఏళ్ల కంగారుల కంచుకోటను బద్దలు

### లార్డ్స్‌లో ఐడెన్ మార్క్రామ్ అరుదైన రికార్డు

ఆస్ట్రేలియాతో జరుగుతోన్న ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025 ఫైనల్‌లో సౌతాఫ్రికా బ్యాటర్ ఐడెన్ మార్క్రమ్ సెంచరీ సాధించి, ఎన్నో రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు. కెప్టెన్ బవుమాతో కలిసి కీలక ఇన్నింగ్స్ ఆడిన మార్క్రమ్ 29 ఏళ్ల కరువును తీర్చేశాడు.ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025 ఫైనల్‌లో దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మన్ ఐడెన్ మార్క్రామ్ సెంచరీ సాధించిన సంగతి తెలిసిందే. ఇంగ్లాండ్‌లోని లార్డ్స్‌లో ఆస్ట్రేలియాతో జరుగుతున్న మ్యాచ్‌లో మూడో రోజున అతను ఈ అద్భుతమైన ఫీట్ సాధించాడు. ఇది మార్క్రామ్ టెస్ట్ కెరీర్‌లో ఎనిమిదో సెంచరీ. ఈ సెంచరీ ఇన్నింగ్స్‌లో, అతను టెంబా బావుమాతో కలిసి జట్టును విజయానికి దగ్గరగా తీసుకువచ్చాడు. దీంతో పాటు, అతను అనేక అద్భుతమైన రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు.ఐడెన్ మార్క్రమ్ కంటే ముందు, 1996 ప్రపంచ కప్ ఫైనల్‌లో ఆస్ట్రేలియాపై ఒక బ్యాట్స్‌మన్ సెంచరీ చేశాడు. ఆ సమయంలో శ్రీలంకకు చెందిన అరవింద డి సిల్వా ఈ ఘనత సాధించాడు. ఆ తర్వాత ఆస్ట్రేలియా అనేక ఐసీసీ ఈవెంట్లలో ఫైనల్స్ ఆడింది. కానీ, ఒక్క సెంచరీ కూడా నమోదు కాలేదు. ఇప్పుడు 29 సంవత్సరాల తర్వాత, మార్క్రమ్ ఈ కరువును అంతం చేశాడు.లార్డ్స్‌లో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో నాల్గవ ఇన్నింగ్స్‌లో సెంచరీ చేసిన ఐదవ టూరింగ్ బ్యాట్స్‌మన్ ఐడెన్ మార్క్రామ్. అతని ముందు, ఆస్ట్రేలియాకు చెందిన మైఖేల్ క్లార్క్ చివరిసారిగా 2009లో ఈ ఘనత సాధించాడు. ఈ విధంగా, 19 సంవత్సరాల తర్వాత, టూరింగ్ జట్టుకు చెందిన బ్యాట్స్‌మన్ లార్డ్స్ టెస్ట్ మ్యాచ్‌లో నాల్గవ ఇన్నింగ్స్‌లో సెంచరీ సాధించాడు. మార్క్రామ్, క్లార్క్ కాకుండా, వెస్టిండీస్‌కు చెందిన గోర్డాన్ గ్రీనిడ్జ్ (1984), రాయ్ ఫ్రెడరిక్స్ (1976), ఆస్ట్రేలియాకు చెందిన డాన్ బ్రాడ్‌మాన్ (1938), భారతదేశానికి చెందిన అజిత్ అగార్కర్ (2002) కూడా అలాంటి ఘనతను సాధించారు. ఫైనల్ తొలి ఇన్నింగ్స్‌లో ఐడెన్ మార్క్రామ్ ఒక్క పరుగులేమీ చేయకుండానే ఔటయ్యాడు. రెండవ ఇన్నింగ్స్‌లో సెంచరీ సాధించాడు.


## కమిన్స్ పై మాజీ క్రికెటర్ల విమర్శలు



ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్‌పై ఆ దేశ దిగ్గజ క్రికెటర్ మాథ్యూ హెడెన్‌తో పాటు సౌతాఫ్రికా దిగ్గజ పేసర్ డేల్ స్టెయిన్ విమర్శలు గుప్పించారు. ప్యాట్ కమిన్స్ కెప్టెన్సీ సరిగ్గా లేదన్నారు. లార్డ్స్ వేదికగా ఆస్ట్రేలియాతో జరుగుతున్న వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్లో సౌతాఫ్రికా విజయం ముంగిట నిలిచింది. 282 పరుగుల భారీ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన సౌతాఫ్రికా మూడో రోజు ఆట ముగిసే సమయానికి 56 ఓవర్లలో 2 వికెట్లకు 213 పరుగులు చేసింది. ఎయిడెన్ మార్క్‌రమ్(159 బంతుల్లో 11 ఫోర్లతో 102 బ్యాటింగ్) సెంచరీతో చెలరేగితే.. టెంబా బవుమా(121 బంతుల్లో 5 ఫోర్లతో 65 నాటౌట్) హాఫ్ సెంచరీతో రాణించాడు. ఈ ఇద్దరూ మూడో వికెట్‌కు అజేయంగా 143 పరుగులు జోడించారు. సౌతాఫ్రికా విజయానికి 69 పరుగుల అవసరం కాగా.. ఆస్ట్రేలియా గెలవాలంటే 8 వికెట్లు కావాలి.అయితే ఈ పరిస్థితికి ప్యాట్ కమిన్స్ చెత్త కెప్టెన్సీ కారణమని డేల్ స్టెయిన్, మాథ్యూ హెడెన్ అన్నారు. అటాకింగ్ ఫీల్డ్ సెటప్ కాకుండా డిఫెన్సివ్ ఫీల్డింగ్‌తో మూల్యం చెల్లించుకున్నాడని విమర్శించారు. 'ఫీల్డ్ సెటప్ విషయంలో ఆసీస్ తప్పిదం చేసింది. అటాకింగ్ ఫీల్డ్ సెటప్ కాకుండా డిఫెన్సివ్ ఫీల్డింగ్‌తో మూల్యం చెల్లించుకుంది. ర్యాన్ రికెల్టన్, మల్డర్‌లను ఔట్ చేసిన తర్వాత బవుమాపై ఆసీస్ ఒత్తిడి తేవాల్సింది. ముఖ్యంగా క్యాచింగ్ కవర్ ఏరియాస్‌లో తక్కువ డిఫెన్సివ్‌గా.. మరింత అటాకింగ్‌గా ఫీల్డ్ పెట్టాల్సింది. ఆరంభంలో బంతులు కాస్త పైకి లేచి ఉంటే సౌతాఫ్రికా మూడు వికెట్లు కోల్పోయేది. ఆస్ట్రేలియా మ్యాచ్‌పై పట్టు సాధించేది. కానీ ఆసీస్ పెద్ద పొరపాటు చేసింది.ఆట స్వభావం మారడం వల్ల స్ట్రైక్ రొటేషన్ సులువైంది. భాగస్వామ్యం పెరగడంతో సఫారీ బ్యాటర్ల ఆత్మవిశ్వాసం రెట్టింపు అయ్యింది. మరోవైపు ఆసీస్ బౌలింగ్ లైనప్ ఆత్మవిశ్వాసం దెబ్బతిన్నది. పిచ్ కండిషన్స్ కూడా బ్యాటింగ్‌కు అనుకూలంగా మారాయి. కానీ డబ్ల్యూటీసీ గెలవాలంటే ప్రత్యర్థిని ఆలౌట్ చేయాల్సిందే.'అని మాథ్యూ హెడెన్ చెప్పుకొచ్చాడు. ఆస్ట్రేలియా వ్యూహాలపై డేల్ స్టెయిన్ కూడా ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. బంతి స్లిప్స్‌లోకి కూడా వెళ్లని పిచ్‌పై మెరుగైన క్యాచింగ్ పొజిషన్స్ పెట్టాల్సిందన్నాడు. 'ఆసీస్ ఫీల్డ్ సెటప్ నన్ను ఆశ్చర్యానికి గురిచేసింది. ఆటకు అనుగుణంగా మన వ్యూహాలు మారాలి. ఈ రోజు బంతి ఎక్కువగా బౌన్స్ కాలేదు. స్లిప్ ఫీల్డర్ వైపు బంతి వెళ్లనే లేదు. భారత్ వంటి కండిషన్స్‌లో షార్ట్ కవర్, షార్ట్ మిడ్ వికెట్ ఫీల్డర్స్‌ను పెట్టవచ్చు. కానీ సౌతాఫ్రికా, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ వంటి కండిషన్స్‌లో కార్డన్ స్లిప్స్ బెటర్. బంతి వేగంగా వెళ్లని పరిస్థితుల్లో మెరుగైన క్యాచింగ్ పొజిషన్స్‌లో ఫీల్డర్స్‌ను పెట్టాలి.'అని డేల్ స్టెయిన్ అభిప్రాయపడ్డాడు.




## బౌండరీలైన్ వద్ద క్యాచ్‌ల్లో కీలక మార్పు




మెరిల్‌బోర్న్ క్రికెట్ క్లబ్ క్రికెట్?లో కొత్త నిబంధన తీసుకురానునుంది. బౌండరీ లైన్ వద్ద ఫీల్డర్లు అందుకునే క్యాచ్?ల్లో కీలక మార్పు చేసింది. ఈ కొత్త నిబంధనను ఈనెలలోనే అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ రూల్స్?లో చేర్చనుంది. అయితే ఇది 2026 అక్టోబర్?లో అమల్లోకి రానున్నట్లు ఎమ్?సీసీ పేర్కొంది. దీంతో ఫీల్డర్లకు కొంత ఇబ్బంది కలిగే ఛాన్స్ ఉంది. ప్రస్తుతం క్రికెట్?లో ఫీల్డర్లు, బౌండరీలైన్ దాటి బంతిని పట్టుకొని పలుమార్లు గాల్లోకి విసిరి, ఆ తర్వాత లైన్ లోపలకు వచ్చి క్యాచ్? పూర్తి చేస్తుంటారు. దీన్ని ఇప్పుడు ఔట్?గానే పరిగణిస్తున్నారు. ఈ క్రమంలోనే అద్భుత ఫీల్డింగ్ విన్యాసాలు జరిగేవి. బిగ్?బాష్ లీగ్? సహా పలు డొమెస్టిక్ లీగ్?ల్లో ఇలాంటి క్యాచ్?లు ఎక్కువగా నమోదు అవుతున్నాయి. అయితే ఇలాంటి క్యాచ్?లు ఔట్?గా పరిగణిండంపై పలువురు అభ్యంతరం తెలుపుతున్నారు. ఇది కరెక్ట్ కాదంటూ అభిప్రాయపడుతున్నారు. దీంతో ఇకపై అలాంటి క్యాచ్?లు చెల్లవని ఎమ్?సీసీ స్పష్టం చేసింది. ఫీల్డర్ బౌండరీ లైన్ బయటకు వెళ్లి గాల్లో బంతి అందుకుంటే, ఒకే ప్రయత్నంలో దాన్ని తిరిగి లోపలికి విసరాలి. ఇలా విసిరిన బంతిని వెంటనే లైన్ లోపలికి వచ్చి పట్టుకోవాలి. అప్పుడే అది క్యాచౌట్?గా పరిగణిస్తారు. ఒకవేళ బౌండరీ లైన్ బయట నుంచి బంతిని రెండుసార్లు గాల్లోకి విసిరితే (ఆ సమయంలో ఫీల్డర్ గాల్లోనే ఉన్నా) అది సిక్స్?గానే పరిగణిస్తారు. అంటే బౌండరీ లైన్ బయట ఫీల్డర్, బంతిని ఒకేసారి తాకాలి అన్నమాట. రెండుసార్లు గాల్లోకి ఎగురవేయడం ఇకపై కుదరదు. ఈ నయా రూల్ 2025-27 వరల్డ్?టెస్టు ఛాంపియన్?షిప్? కొత్త ఎడిషన్?లో భాగంగా శ్రీలంక- బంగ్లాదేశ్? మధ్య జూన్ 17న జరగనున్న తొలి టెస్టు నుంచి అమలు కానుంది. ఐసీసీ నిర్వహించే అన్ని మ్యాచ్?ల్లో ఈనెల నుంచే అమలు కానుంది. ఇక ఎమ్?సీసీ రూల్స్?లో మాత్రం 2026 అక్టోబర్?లో చేర్చనున్నారు.

# కుబే మూవీ టీజర్ విడుదలకు రంగం సిద్ధం

## హైదరాబాద్ వేదికగా నేడు గ్రాండ్ ఈవెంట్

శేఖర్ కమ్ముల దర్శకత్వంలో తమిళ నటుడు ధనుష్, టాలీవుడ్ నటుడు నాగార్జున, రష్మిక మందన్నా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం కుబేర టీజర్ విడుదలకు రంగం సిద్ధం అయ్యింది. హైదరాబాద్ వేదికగా ఆదవారం ఈవెంట్‌ను గ్రాండ్‌గా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. వచ్చే వారం రిలీజ్ కాబోతున్న కుబేర సినిమాపై ఆడియెన్స్‌లో ఉన్న ఎక్స్‌పెక్టేషన్స్ అన్నీ ఇన్నీ కావు. ఎప్పుడెప్పుడు సినిమా రిలీజవుతుందా అని ఉత్కంఠగా వేయిట్ చేస్తున్నారు.పాన్ ఇండియా లెవల్లో తెరకెక్కుతున్న ఈ సినిమాను శ్రీ వెంకటేశ్వర సినిమాస్ , అమిగోస్ క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్లపై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మిస్తుండగా. ఈ జూన్ 20న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అయితే..ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకను వాయిదా వేసిన విషయం తెలిసిందే. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో విమాన ప్రమాదం జరగడంతో ఈ వేడుకను వాయిదా వేసుకున్నారు. తాజాగా ఈ వేడుకకి సంబంధించి కొత్త డేట్‌ని ప్రకటించారు. కుబేరా ప్రీ రిలీజ్ వేడుకను జూన్ 15న హైదరాబాద్‌లో గ్రాండ్‌గా నిర్వహించ బోతున్నట్లు తెలిపారు. అలాగే ఈ మూవీ నుంచి రేపు -ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు- చిత్రయూనిట్ ప్రకటించింది. ఈ కార్యక్రమానికి చిత్రబృందంతో పాటు పలువురు సినీ ప్రముఖులు హాజరయ్యే అవకాశం ఉంది. ట్రైలర్ లాంచ్‌తో సినిమాపై మరింత హైప్ పెరిగేలా ప్లాన్ చేస్తున్నారు మేకర్స్.




# లిప్‌లాక్‌లకు తాను దూరం

## ఓ సినిమాలో అలా నటించినా..ఎడిటింగ్‌లో కట్

## అలనాటి హీరోయిన్ మధుబాల అంతరంగం

'రోజా' మూవీతో సినీ ప్రియుల హృదయాలు గెలుచుకున్న నటి మధుబాల. ఆ తరవాత జెంటిల్‌మెన్, అల్లరి ప్రియుడు వంటి సూపర్ చిత్రాల్లో మధుబాల పేరు సంపాదించుకుంది. మధుబాల ప్రస్తుతం 'కన్నప్ప' కోసం వర్క్ చేస్తున్నారు. ప్రస్తుతం సహాయ నటి పాత్రల్లో నటిస్తూ ప్రేక్షకులను అలరిస్తోన్న ఆమె తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన కెరీర్ ఆరంభంలో ఎదుర్కొన్న పలు ఇబ్బందుల గురించి మాట్లాడారు. ముఖ్యంగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టినప్పుడు నటిగా తాను కొన్ని షరతులు పెట్టుకున్నానని తెలిపారు. ఒక సినిమా కోసం తాను ఆ రూల్ బ్రేక్ చేయాల్సి వచ్చిందన్నారు. తీరా చూస్తే ఆ సన్నివేశాన్ని తొలగించారని వెల్లడించారు. స్కిన్ షో లేదా ముద్దు సన్నివేశాల్లో నటించడం నాకు నచ్చేది కాదు. అందుకే కథానాయికగా ఎంట్రీ ఇచ్చిన సమయంలోనే ఆయా సన్నివేశాల్లో నటించకూడదని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఆ కారణంతోనే చాలా సినిమాలు వదులుకున్నా. అయితే, ఓ సినిమా కోసం నేను ఆ రూల్ బ్రేక్ చేయాల్సి వచ్చింది. సెట్‌లోకి అడుగుపెట్టిన తర్వాత కిస్ సీన్ చేయాలని టీమ్ చెప్పింది. నేను అందుకు అంగీకరించలేదు. కాకపోతే, ఆ సీన్ ముఖ్యమని టీమ్ చెప్పడంతో చేసేది లేకపోయింది. దాంతో లిప్ కిస్ సీన్‌లో యాక్ట్ చేశా. అది నన్నెంతో ఇబ్బంది పెట్టింది. తీరా చూస్తే ఎడిటింగ్ సమయంలో ఆ సన్నివేశం అవసరం లేదని టీమ్ భావించింది. దాంతో సీన్‌ను తొలగించేశారు. ఆ విషయంలో దర్శకుడితో నేను ఏమీ గొడవ పడలేదు. సినిమా కోసం ఎలాంటి సన్నివేశాల్లోనైనా యాక్ట్ చేయాల్సి ఉంటుందని కొంతమంది సీనియర్ నటీమణులను చూశాక నాకు అర్థమైందని మధుబాల చెప్పారు. సల్మాన్ ఖాన్, షారుక్ ఖాన్ చిత్రాల్లో నటించే అవకాశం తనకు వచ్చిందని.. ఆడిషన్స్‌లోనూ తాను పాల్గొన్నానని ఆమె తెలిపారు. అయితే, ఆయా సినిమాలు చివరకు వేరే వాళ్లను వరించాయన్నారు.





# క్రేజీ హీరోయిన్ శ్రీలీల బర్త్‌డే

## రెండు సినిమాలకు సంబంధించి పోస్టర్ల విడుదల

ప్రస్తుతం సౌత్ లో క్రేజీ హీరోయిన్‌గా దూసుకుపోతోంది శ్రీలీల. అనతి కాలంలోనే తన అందం, అభినయం, ఎనర్జీతో మంచి క్రేజ్ సంపాదించుకున్న ఈ ముద్దుగుమ్మ జూన్ 14 తన పుట్టినరోజును జరుపుకుంది. ఈ సందర్భంగా శ్రీలీలకు పలువురు విషెస్ చెప్పారు. ఆమె నటిస్తున్న రెండు భారీ ప్రాజెక్టుల నుంచి బ్యాక్ టూ బ్యాక్ స్పెషల్ పోస్టర్స్‌ను విడుదల చేశారు నిర్మాతలు. ఇందులో 'ఉస్తాద్ భగత్ సింగ్' ఒకటి పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో శ్రీలీల కథానాయికగా నటిస్తోంది. ఈ సినిమా నుంచి విడుదలైన పోస్టర్‌లో ఆమె గ్లామర్‌తో పాటు డ్రస్సింగ్ ÷-టసైల్ కూడా ఫ్యాన్స్‌ను ఆకట్టుకుంది. ఇక అలాగే.. మరోవైపు మాస్ రాజా రవితేజ 'మాస్ జాతార' మూవీ నుంచి కూడా బర్త్‌డే స్పెషల్ పోస్టర్ విడుదలైంది. ఇందులో శ్రీలీల మరోసారి ట్రెడిషనల్ లుక్‌లో కనిపించి ఫ్యాన్స్‌ను ఫిదా చేసింది. ఈ సినిమాలో ఆమె పాత్ర కు సంబంధించి ఇంకా పూర్తి వివరాలు బయటకు రాలేనప్పటికీ, పోస్టర్ చూస్తేనే ఆమె పాత్ర పట్ల ఆసక్తి పెరిగింది. ఇక ఈ రెండు పోస్టర్లు బర్త్‌డే సందర్భంగా విడుదల కావడంతో శ్రీ లీల అభిమానులు సోషల్ మీడియాలో భారీగా పోస్టులు షేర్ చేస్తున్నారు. కాగా శ్రీలీల కెరీర్‌లో చిత్రాలు మరో మైలురాయిగా నిలవనున్నాయి.

# పాక్‌లో దంగల్‌ను అందుకే విడుదల చేయలేదు

## ఆనాటి వివరాలు

## వెల్లడించిన అమీర్ ఖాన్

బాలీవుడ్ స్టార్ హీరో అమీర్ ఖాన్ వైవిధ్యమైన సినిమాలతో ప్రేక్షకులని ఎంతగా అలరిస్తున్నారో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అమీర్‌ఖాన్ దర్శకత్వం వహించడంతో పాటు- ప్రధాన పాత్రలో రూపొందిన తారే జమీన్ పర్ 2007లో విడుదలై సంచలన విజయం సాధించింది.. ఇప్పుడు ఈ చిత్రానికి సీక్వెల్‌గా రూపొందించిన సినిమా సితారే జమీన్ పర్ . 2018లో స్పానిష్ ఛాంపియన్స్ మూవీ ఆధారంగా హిందీలో రూపొందించిన ఈ సినిమాకు దివ్య నిధి శర్మ కథ అందించగా . ÷ూ. ప్రసన్న దర్శకత్వం వహించాడు. ఈ మూవీని అమీర్ ఖాన్ స్వయంగా నిర్మించాడు. జెనీలియా దేశ్‌ముఖ్ కీలక పాత్ర పోషించింది. జూన్ 20న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. గత కొద్ది రోజులుగా మూవీ ప్రమోషన్స్ తో బిజీగా ఉన్న అమీర్ ఖాన్ ఆసక్తికర విషయాలు పంచుకుంటు-న్నారు. ఆయన నటించిన బ్లాక్‌బస్టర్ మూవీ 'దంగల్' పాకిస్తాన్‌లో ఎందుకు విడుదల కాలేదన్న అంశంపై తాజాగా వివరణ ఇచ్చారు. పాక్ లో దంగల్ సినిమా విడుదల కావాలంటే వారు రెండు షరతులు పెట్టారు. మన జాతీయ గీతం, జాతీయ జెండాను మూవీ నుంచి తొలగించాలని అక్కడి సెన్సార్ బోర్డు చెప్పడంతో నేను దానికి ఏ మాత్రం అంగీకరించలేదు. గీతా ఫోగట్ మ్యాచ్ గెలిచిన సన్నివేశంలో భారత జెండాతో పాటు జాతీయ గీతం ఉంటుంది. ఆ రెండింటిని తొలగిస్తినే ఈ చిత్రానికి అనుమతి ఉంటుందని పాక్ సెన్సార్ చెప్పింది దీంతో వెంటనే నేను మా సినిమా పాకిస్తాన్ లో విడుదల కాదని చెప్పాను. పాకిస్తాన్ విడుదలను రద్దు చేయడం వల్ల కలెక్షన్స్ విషయంలో కాస్త ప్రతికూల ప్రభావం పడుతుందని నిర్మాతలు నాతో చెప్పారు. అయినప్పటికీ, భారతదేశానికి వ్యతిరేకంగా ఉన్న దేనికీ మద్దతు ఇవ్వకూడదని స్పష్టంగా ఆరోజే చెప్పాను అని అమీర్ ఖాన్ అన్నారు. సినిమా విడుదల వల్ల డబ్బు వస్తుంది, కానీ దేశ ప్రయోజనాల విషయంలో మేము రాజీ పడం. దేశానికి వ్యతిరేకంగా ఏ నిర్ణయానికీ మేము ఒప్పుకోము. ఇది నా ఒక్క నిర్ణయమే కాదు, అందరం కూడా అదే అభిప్రాయంతో ఉన్నామని అమీర్ స్పష్టం చేశారు. 2016లో విడుదలైన 'దంగల్' చిత్రం భారత రెజ్లింగ్ చాంపియన్స్ అయిన ఫోగాట్ సిస్టర్స్ జీవితం ఆధారంగా రూపొందింది. ప్రపంచవ్యాప్తంగా ...2,000 కోట్లకు పైగా వసూలు చేసిన ఈ చిత్రం చైనాలో కూడా ఘన విజయం సాధించింది. కానీ పాకిస్తాన్‌లో మాత్రం రాజకీయ కారణాల వలన విడుదల కాలేదు





# నటి కల్పికపై మరో కేసు

ప్రముఖ సినీ నటి కల్పిక గణేష్ మీద రోజుకో వార్త పుట్టుకోస్తోంది. తాజాగా ఆమె పై మరో కేసు నమోదయింది. అసలు విషయంలోకి వెళితే.. ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ లో అసభ్యకరమైన పదజాలం ఉపయోగించి తనను దూషించింది అంటూ బాధితురాలు కీర్తన పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు ఇచ్చింది. ఆ÷-లనైన్ అబ్యూజింగ్ తో పాటు వేధింపులకు కూడా పాల్పడినట్లు ఆమె తన ఫిర్యాదులో తెలిపింది. ఇక సోషల్ మీడియాలో స్టేటస్ పెట్టు-కోవడంతో పాటు-, బాధితురాలికి మెసేజ్ పెట్టి కల్పిక చాలా వల్గర్‌గా మాట్లాడిందట. ఇన్ బాక్స్ మెసేజ్లను, స్టేటస్ పెట్టిన స్క్రీన్ షాట్‌లను పోలీసులకు బాధితురాలు కీర్తన చూపించింది. దీంతో హైదరాబాద్ సైబర్ క్రూమ్ పోలీసులు రంగంలోకి దిగి కేసు నమోదు చేసుకున్నారు.

EDITED, PRINTED AND PUBLISHED BY FAISAL KHAN PRINTED AT UJALA PRESS, LIG, 211 APHB COLONY ADILABAD, TELANGANA.
PUBLISHED FROM H.NO.4-4-120/C/3, SANJAY NAGAR COLONY, ADILABAD, TELANGANA STATE. EDITOR : FAISAL KHAN, RNI : APTEL/2013/53323, CELL : 94400 62685